మాటలు - మంత్రాలు

2వ భాగం

కర్త :

డాక్టరు మోపిదేవి కృష్ణస్వామి

ఎం.ఎ.పిహెచ్.డి.

ప్రచురణ

ది యూనివర్సల్ హ్యూమానిటేరియన్

ఎడ్యుకేషన్ ట్రస్ట్

విశాఖపట్నం - 17

ప్రథమ ముద్రణ
1991 వసంత నవరాత్రులు

కూర్పు :
పంక్తి

వెల : 14-00

ప్రతులకు :

ది యూనివర్సల్ హ్యూమానిటేరియన్

ఎడ్యుకేషన్ ట్రస్ట్

1-99
ముంజులూరు-521366.
బంటుమిల్లి మండలం, కృష్ణాజిల్లా
ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ముద్రణ :
గాయత్రీ ప్రింటర్స్
మారుతీనగరం, ఫోన్ : 74525
విజయవాడ-520 004.

స మ ర్ప ణ



ఈ మాటలు మంత్రాలు

నాకు నచ్చాయి నాన్నా

అందుకే ఈ పుస్తకాన్ని

నా వద్దే ఉంచుకొంటాను”

అంటూ అమితంగా మురిసిన అమ్మకు

అమృతాశీస్సులను అందించిన అమ్మకు

మోపిదేవి కృష్ణస్వామి

ఇందులో

మాటలు కావు, ముత్యాల మూటలు

మంత్రాలు మాటలలోనే వుంటాయి. అయితే, మంత్రాలనేవి సంస్కృతం మాటలలోనే ఎక్కువగా కనిపిస్తాయి. మన మంత్రాలన్నీ సాధారణంగా సంస్కృతంలోనే వుంటాయి. అందువల్లనే, మంత్రాలు సంస్కృతం రానివారికి, సామాన్యులకు, ఏవో తంత్రాలుగానే కనిపిస్తాయి. ఇప్పుడిప్పుడు ఆ మంత్రాల అర్థం తెలియని వారు వాటిని కుతంత్రాలని కూడా అంటున్నారనుకోండి !

కాళిదాసు నోటి వెంట ఏ మాటవస్తే, అదే కవిత అయ్యేదంటారు. అలాగే "వికటకవీంద్రుడు" తెనాలి రామకృష్ణుడు కాళీవర ప్రసాదుడు కాబట్టి, తాను ఏ మాట అంటే ఆ మాటనే కవితగా చెల్లించుకున్నాడు.

అయితే, తెలుగులో మాటలు మంత్రాలు కాలేవు. వాటిని సంస్కృతం మూసలో పోస్తేనే మంత్రాలవుతాయి.

తెలుగులో మంత్రాలవంటి మాటలు సృష్టించే ఒక రామకృష్ణుడున్నాడు. ఆయన తెనాలి రామకృష్ణుడు కాదు – మోపిదేవి కృష్ణుడు ! అయితే వికటకవి కారు.

అయినా, అలవోకగా ఆయన ఏ మాట అన్నా, అది కవితగానే వినిపిస్తుంది; భాసిస్తుంది. మనిషినుంచి మనిషి పుట్టినట్టే మాటనుంచే మాటను పుట్టిస్తారు. ఆయన ఏ మాటఅన్నా అందులో కవితార్థం వుంటుంది. అందులోనే పరమార్థం వుంటుంది.

మాటనుంచి కొత్తమాటను - కొత్తఅర్థంతో కూడిన మాటను - పరమార్థంతో కూడిన మాటను - ఆయన ఎంత మాత్రం శ్రమ పడకుండా, ఆలోచించుకోకుండానే, అరక్షణమైనా ఆలస్యం చేయకుండానే పుట్టిస్తారు.

ఆ శక్తి ఆయనకు దైవదత్తం. అది అనుకరిస్తే వచ్చేది కాదు; కుస్తీ పడితే వచ్చేదికాదు. ఇందులో ఆయనకు సాటి ఎవ్వరూ లేరు; పోటీని ఆయన కోరుకున్నా, ఎవ్వరూ కాలేరు కూడా. ఆయనకు ఆయనే సాటి !

ఈ మాటలు అతిశయోక్తులు కావు. ఆత్మనుంచి వచ్చినవి. ఆయనతో అయిదు నిమిషాలు మాట్లాడితే, ఎన్నో మామూలు మాటల నుంచి ఆయన మంత్రాలను సృష్టిస్తారు. అదొక అద్భుతమైన ఆనందానుభూతి. ఏమాటనుంచి ఏ పరమార్థాన్ని సృష్టిస్తారో మనం వూహించలేము.

ఉదాహరణకు, చూడండి—

— "మనకు కావలసింది నినాదం కాదు — నాదం"

— "హరి ఓమ్ అనగానే ఈ శరీరం హరికి హోమ్‌గా మారిపోతుంది"

— "మాత్రల పైద్యమే చాలదు, మాటల పైద్యం కూడా కావాలి"

— "రోగ్‌లు లేరు, వున్నది రోగులే !"

— "నాన్న బ్రహ్మన్ (మనందరి సృష్టి కర్త బ్రహ్మదేవుడు) అయితే నాన్ బ్రాహ్మిన్ ఎక్కడ ?"

— "వృత్తివిద్యలు — వృత్తివిద్యలు"

— "మీరు వెనుక బడిన జాతులుకారు, వెన్నెముక జాతులు"

— "నినాదం చాలదు, నిర్మాణం కావాలి"

— "తిరుగుబాటు కాదు, తిరిగిబాట కెక్కించడం కావాలి"

— "ఆ పరిస్థితికి మనం తట్టుకోవాలి అంటే మనల్ని మనం "తట్టు"కోవాలి. కాని తిట్టుకుంటూ కూర్చుంటే లాభంలేదు"

— "వీలు చూసుకుని కాదు, వీలు చేసుకునిరండి"

— మార్చడంకాదు, మలచడం జరగాలి"

— "స్పర్ధయా వర్ధతే విద్యా కాదు, శ్రద్ధయా వర్ధతే విద్యా".

డాక్టర్ మోపిదేవి కృష్ణస్వామిగారి నోటవెలువడే మంత్రాల వంటి ఇలాంటి మాటలు ఎన్నెన్నో !

మంత్రాలవంటి వారి మాటలతో కూర్చిన ఈ పుస్తకం ఆ శీర్షికతో వెలువడిన రెండవభాగం.

ఎంతో పరమార్థ ద్యోతకాలైన ఆయన మాటల మూటలను విప్పితే కాని వాటి సుగంధాలు పరిమళించవు. ఈ పుస్తకం విప్పి చదవండి - అలాంటి మాటల ముత్యాల మూటలు ఎన్నో కని పిస్తాయి !

విజయవాడ
20-3-91

తుర్లపాటి కుటుంబరావు

ఈ మంత్రాలు అపౌరుషేయాలు

ఈ మాటలు - మంత్రాలు ముందు చదువుతానా నాన్నా! నాకు ఇవంటే చాలా ఇష్టం. అంటూ ముచ్చటపడ్డారు జిల్లెళ్ళమూడి అమ్మ. 19-2-1985 న సాయంం వేళలో, స్వామి జిల్లెళ్ళమూడిలో అమ్మతో గడుపుతున్న ఆ మధురక్షణాలలో మాటలు మంత్రాలు మొదటి భాగాన్ని తిరగేస్తూ. అక్కడక్కడా చవి చూస్తూ, చదివిచూస్తూ మురిసిపోతున్నది అమ్మ. ఆమె నోటి నుండి వెలువడేవి మాటలు- మంత్రాలే కదా మరి ! ఆ సమాన ధర్మాన్ని గమనిస్తూ, తల పంకిస్తున్నదామె.

క్షణాలు అనుభూతి ప్రదంగా నడుస్తున్నాయి. అమ్మ వీక్షణాలు మాటలు-మంత్రాలనే గమనిస్తున్నాయి. అలా గమనిస్తూనే, తలనుపంకిస్తూనే ఇలా అన్నది అమ్మ: దాదాపుగా ఇక్కడ ఉన్న విద్యార్థులంతా నీ పుస్తకాలన్నింటినీ శ్రద్ధగా చదువుతున్న వాళ్లేనా నాన్నా ! వీళ్ళందరికీ నీ వన్నా, నీ పుస్తకాలన్నా వల్లమాలిన అభిమానం. ఇప్పుడు నీ విచ్చిన ఈ గ్రంథాలను కూడా నేనొకసారి చదువుకొని వీళ్ళ గ్రంథాలయంలోనికే పంపిస్తాను. ఈ మాటలు-మంత్రాలు మాత్రం నాతోనే ఉంచుకుంటాను. సరేనా ! జాతి పునర్ని ర్మాణం గురించి, దేశమంతటా నీ ప్రవచనాలు జరుగుతున్నాయట ! ఇక్కడ వీళ్ళంతా చాలా ఇదిగా చెబుతున్నారు. ఆ జాతి పునర్నిర్మాణానికి కావలసిన మంత్రాలు ఇవే కదా నాన్నా ! అందుకే నాకు ఇవంటే ఇష్టం.

అమ్మ స్వామిపైపు చూస్తున్నది : ఇలాంటి మాటలు-మంత్రాలు ఇంకా ఇంకా కావాలినాన్నా ! ఈ జాతికి జీవనం పోయడానికి ! అన్నట్లుగా చూస్తున్నది. ఆ చూపునకు ప్రతిఫలమా అన్నట్లుగా ఇప్పుడు మాటలు-మంత్రాలు రెండవభాగం రూపుదిద్దుకొని మీ కందుతూ ఉన్నది.

ఆబాలగోపాలాన్ని ఇంతగా ఆనందింపచేస్తున్న ఈ మాటలు - మంత్రాలు అనే రచనా ప్రక్రియకు రూపకల్పన జరగడానికి వెనుక ఒక చిత్రమయినగాథ ఉన్నది. మాస్టర్ ఇ.కె నుండి శ్రీమద్భాగవతానికి రహస్య ప్రకాశరచన దీక్షగా సాగుతున్న రోజులవి. స్వామి నిత్యకృత్యాలకు పోనూ మిగిలిన సమయమంతా మాస్టర్ ఇ.కె. తోనే గడుపుతున్నారు. ఒక రోజు మధ్యాహ్నం ఇ.కె. మాస్టరుగారు తప్పనిసరై పనిమీద ఎక్కడికో వెళ్ళారు. స్వామి రాధా మాధవంలోని లైబ్రరీలో పనిచేసు కుంటున్నారు. ఇంతలో నడివయస్కుడొకాయన స్వామి ఎదుట నిలబడి నమస్కరించాడు. తమది విశాఖపట్టణమే అయినా వృత్తిరీత్యా భిలాయ్ నగరంలో ఉంటున్నాననీ, ఇప్పుడక్కడినుండే వచ్చాననీ పరిచయంచేసుకున్నాడు.

ఒక్క క్షణం ఆగి ఇలా అన్నాడాయన: 'మీ మాటలు మా మనస్సులలో నిరంతరం మెదులుతూనే ఉంటాయి. మమ్మల్ని నడుపుతూనే ఉంటాయి. నిజానికి అవి మా పాలిటి మంత్రాలే ! మొన్నటికి మొన్న గురుపూజలలో ప్రవచనం చేస్తూ మీరొక మాట చెప్పారు. మంచిపని చేయనంలో భారతీయుడికీ, పాశ్చాత్యునికీ తేడా ఉంది. భారతీయుడు 'వీలును' బట్టి చేస్తున్నాడు. పాశ్చాత్యుడు 'జీలు'ను బట్టి చేస్తున్నాడు. అని

గురుపూజలయిపోయినాయి. మరునాడు ఇక్కడే, మా ఇంటిదగ్గర ఒక సన్నివేశం. మోటారుచెడిపోయింది. నూతిలో కొంచెం లోతుగానే ఉన్నాయి నీళ్ళు. తోడటానికి బొక్కెనలేదు. ఒక కాగు లాంటి దానికి తాడుకట్టి తోడటం మొదలుపెట్టాడు తమ్ముడు. 'అన్నయ్యా బొక్కెన ఉంటే బాగుండేది' అన్నాడు ఒకటికి రెండుసార్లు. నేనన్నాను: అన్నీ కుదిరితే అందరూ చేస్తారురా, కుదరనప్పుడు కూడా చేయగలగాలి. కృష్ణస్వామిగారు ఏమన్నారురా. 'భారతీయుడు వీలును బట్టి చేస్తాడు. పాశ్చాత్యుడు 'జీలు'ను బట్టి చేస్తాడు' అన్నారుకదా అని. అంతే! మా వాడిక నీళ్ళు తోడాడంటే, ఆ కాగుతో. ఆ వేగం, ఆ ఉత్సాహం వాణ్ణి అలా చూస్తుంటే నాకు చాలా ముచ్చటేసింది. మంత్రం అంటే ఇదిరా అనిపించింది. ఇలాంటి ప్రవచనాలు విన్నప్పుడల్లా ఆ ప్రవచనాలలో వచ్చే మంత్రాలను వ్రాసుకుంటూ ఉంటాను. వాటిని నా విషయంలోనూ, నా చుట్టూ ఉన్నవారి విషయంలోనూ సద్వినియోగంచేస్తూ ఉంటాను. భిలాయ్‌లో నేను పని చేసే చోటకూడా సందర్భాన్ని బట్టి మిత్రకూటమిపైన ఈ మంత్రాలను ప్రయోగిస్తూ ఉంటాను. అవి మంచి ఫలితాలనిస్తూ ఉంటాయి. ఈ నా అనుభూతిని ఎప్పటినుండో మీకు చెప్పాలని ప్రయత్నం. ఇప్పటికి అవకాశం కుదిరింది.

'అయ్యా! మీ మాటలు — మంత్రాలయి దశదిశలా వ్యాపిస్తూ. జాతిని జాగృతం చేస్తున్నాయి. చిరకాలం వర్ధిల్లాలి. ఇలాంటి మంత్రాలను వందలూ, వేలుగా మా బోటివారికి అందిస్తూ ఉండాలి. మంత్రాల రూపంలో ఎప్పుడూ మీరు మా వెంట ఉండాలి' అంటూ పాదాలకు నమస్కరించి మాటలే మంత్రా

లుగా వెలువరిస్తున్న ఆ గొంతుతో, ఈ సామాన్యుణ్ణి ఒక్కసారి ఆశీర్వదించండి. అన్నాడు.

'మీరు సహృదయులు. మీ జీవితం తప్పక సార్ధకమవు తుంది.' అంటూ స్వామి అతణ్ణి లేవనెత్తి అక్కున చేర్చుకున్నారు ఆతడొక పసిపాపలా స్వామి కౌగిట వదిగిపోయాడు. జాతి ఇలా కోరి పఠించి ధ్యానించుకుంటున్న మంత్రాలను ఒక ప్రత్యేకమయిన ప్రక్రియారూపంలో వెలువడేటట్లుగా చూస్తే బాగుంటుందని, అతడు తమ కౌగిట వదిగిన క్షణంలో స్వామికి అనిపించింది. ఆ సంకల్పమే అటుపైన చక్రపాణిగారి మీదుగా మాటలు-మంత్రాలు మొదటి భాగంగా రూపుధరించింది.

మాటలు-మంత్రాలు మొదటి భాగానికి మాస్టర్ ఇ.కె తమ ఆశీః పూర్వకమయిన అభినందనలందచేశారు. స్వామి నుండి వెలువడుతున్న ఈ మాటలు మంత్రాలు అపౌరుషేయా లన్నారు. స్వామి శరీరం అందుకొక దివ్యమయిన వాహికగా పని చేస్తున్నదన్నారు. ఈ వాహికను భద్రంగా చూసుకోవడంలో స్వామి పరివారం శ్రద్ధవహించాలన్నారు. స్వామిలోని ప్రవర్తను మొదటిసారిగా దర్శింపచేసిన ఆ దివ్యగ్రంథాన్ని 13-1-84 న విశాఖలో గురుపూజా వేదికపైన తామగా ఆవిష్కరించారు.

ఇలా ఎందరెందరి హృదయాలనో చూరగొన్న మాటలు-మంత్రాలు ఇప్పుడు రెండవ భాగంగా కూడా రూపుదిద్దుకొని మీ ముందుకు రావడమన్నది ఎనలేని ఆనందాన్ని కలిగిస్తూ ఉన్నది.

మాటలు మంత్రాలు రెండవ భాగంలో అయిదు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం 'మాస్టర్ ఇ.కె.- మనం. ఈ అధ్యాయం కొంచెం బరువుగా సాగుతుంది. అయితే మహనీయుల జీవితాల యెడల మనకన్ను ఎలా విచ్చుకోవాలో, మన మనస్సు ఎలా విప్పారాలో, మన హృదయం ఎలా ప్రతిఫలించాలో ఈ అధ్యాయం ఆర్ద్రంగా తెలియచెబుతుంది. మన గుండెలలో మనకు తెలియని లోతులను కూడా ఈ అధ్యాయం స్పృశిస్తుంది.

రెండవ అధ్యాయం 'సహచరులు- సరిదారి.' తనతో నడుస్తున్న వారిని దగ్గరగా తీసుకొని, వారిలోపలకుచూస్తూ, వారిలో జరగవలసిన సర్దుబాట్లకుగాను స్వామి ఉపదేశించిన మంత్రాలు ఇందులో ఉన్నాయి. స్వామి తనను దగ్గరగా తీసుకొని, తన జీవితాన్ని తడిమిచూస్తూ, అందులో జరగవలసిన మార్పులు, చేర్పులకుగాను తగిన మంత్రాలను ఉపదేశిస్తున్నట్లుగా చదువరికి అనుభూతి కలుగుతుంది ఈ అధ్యాయాన్ని అధ్యయనం చేస్తున్న వేళలో.

మాటల వైద్యం, మాత్రల వైద్యం అనే మూడవ అధ్యాయం సమాజానికి స్వస్థతను చేకూర్చడంలో స్వామి మాత్రలతో పాటు మాటలనుకూడా ఎలా వినియోగిస్తారన్నది తెలియచెప్తుతోంది. ఆహ్లాదకరమయిన అధ్యాయమిది. ఆ ఆహ్లాదంతో పాటుగా, ఒక అవగాహన, ఒక సందేశం, ఒక సంస్కరణ నడిచిపోతూ ఉంటాయి. 'మేం వస్తున్నది కేవలం మీ మాత్రల కోసం అనుకుంటున్నారా, ఇదిగో మీ నుండి వెలువడుతూ ఉండే ఈ మాటలకోసమే ఈ మంత్రాలకోసమే ! అంటూ మురిసిపోతూ

ఉంటారు రోగార్తులు గా వచ్చేవాళ్లెందరో, ఎందరెందరో ! వైద్య సేవ జరిగే వేళ, స్వామి సన్నిధిలో మూలుగులుండవు. ముసిరి పోలుంటాయి. నిట్టూర్పులుండవు. నిండయిన నవ్వులుంటాయి. అలా వ్యాధి గ్రస్థులలోని వ్యాధులను కూడా నవ్వించి, పంపించి వేస్తూ ఉంటారాయన. ఆ పంపిస్తున్న క్షణాలలో, ఆ పంపించడానికిగాను, ఆయననుండి వెలువడే సరసమయిన మంత్రాలున్నాయే, వాటిని రుచి చూపించడానికే ఈ అధ్యాయం రూపు దిద్దుకున్నది. చదువుతున్నామని మీ కనిపించేలోపునే అయిపోయే అధ్యాయమిది. అరే ! అప్పుడే అయిపోయిందా మరీకాసిసే మంత్రాలిస్తారు. మరి కాసిని మంత్రాలిస్తే వీళ్ళ సొమ్మేం పోయింది. అని మీ కనిపిస్తుంది.

నాల్గవది అయిన సమాజము- సంస్కరణ అనే అధ్యాయం. నేడు మనజాతిలో జరగవలసి ఉన్న నిజమయిన సంస్కరణ ఏమిటి అన్నది సూటిగా, సూక్ష్మంగా తెలియచేస్తున్నది. సరళంగా స్పష్టంగా వివరిస్తున్నది. అనుష్ఠాన పరులయిన సంస్కరణాభిలాషులకు ఈ అధ్యాయం నిజంగా ఒకకల్పవృక్షమే ! వారికి ఏకోణంలో పరిష్కారంకావలసివచ్చినా, ఈకల్పవృక్షాన్ని వెంటనే సమీపించవచ్చు. సంప్రదించవచ్చు.

అయిదవ అధ్యాయం. ఆత్మవిద్య- అసలురూపం. ఆత్మవిద్యయొక్క అసలురూపాన్ని ఈ అధ్యాయం లలితంగా తెలియచెబుతుంది. పరిభాషలూ, పడికట్టు రాళ్ళతో నిమిత్తం లేకుండా సత్యదర్శనాన్ని సూటిగా అందిస్తుంది. ఆత్మవిద్యను నిత్య జీవితంలో మెదిపి అందిస్తుంది. ఇంతవరకూ ఆధ్యాత్మికత

పేరులో మనం వింటూ వస్తున్న అంశాలు ఎన్నో మనకు ఇందులో అర్థమవుతాయి. అనుభవానికి వస్తాయి. పర్వతానికి శిఖరం ఎలాంటిదో, ఈ గ్రంథానికి ఈ అధ్యాయం అలాంటిది. నదికి సంగమస్థానం ఎలాంటిదో, ఈ గ్రంథానికి ఈ అధ్యాయం అలాంటిది.

ఇలా అయిదు అధ్యాయాలుగా కూర్పుచేయబడిన ఈ మాటలు- మంత్రాలు నిత్యజీవిత నిర్వాహణలో ఎల్లరకూ అక్కరకు వస్తాయని, పరిపూర్ణత వైపునకు అందరినీ నడిపిస్తాయని విశ్వసిస్తున్నాను.

మంత్రి

1. మాస్టర్ ఇ. కె - మనం

1. స్మారకపేటిక కాదిది-గురుపేటిక

2. వారి తర్వాత కాదు-వారితో బాటుగా

3. తట్టుకోవాలి అంటే-మనని మనం తట్టుకోవాలి

4. పరిసమాప్తం కాదిది-పని ప్రారంభం

5. ఇది మన నిర్లక్ష్యానికి పరిశిక్ష

6. చెట్టుగా కాక-తోటగా

7. మౌనం పాటించడం కాదు-ధ్యానం చేద్దాం

8. దేహానికి దేహమే బదులు

9. ఆక్రమణ ఉండదు-ఆ క్రమమే ఉంటుంది

10. కాలమే కులపతికి-కాలమే రూపుదిద్దుతుంది

స్వరపేటిక కాదిది-గురుపేటిక

'మీ మాటలువింటుంటే అచ్చం ఇ.కె. మాస్టరుగారుమాట్లాడు తున్నట్లే ఉంటుంది. ఆ ఉచ్చారణ, ఆ మాడ్యులేషన్, ఆ ఒంపులు.సొంపులు అంతా ఇ.కె. మాస్టరుగారే. ఏ మాత్రం తేడా లేదు' అన్నారొక మిత్రులు.

ప్రేమగా చూస్తూ స్వామి ఇలా అన్నారు: తేడా ఎందుకు ఉంటుంది. గొంతు ఆయనదే అయినప్పుడు. నా దృష్టిలో ఈ గొంతుగా ఇక్కడ ఉన్నదే ఇది స్వరపేటికకాదు గురుపేటిక. ఈ గురుపేటికకు వినియోగపడటానికే ఉన్నది మిగిలిన ఈ శరీరమంతా. ఈ అంశాన్ని మాటలు–మంత్రాలు మొదటిభాగానికి ముందుమాట వ్రాస్తూ అందులో మాస్టరుగారే సూచించారు. ఇది వారి అనుగ్రహం. వారి దివ్యసంకల్పం.

మీరన్నది అక్షరాలానిజం. ఇది ఎక్కిరాలగళం. మానవు లందరూ చైతన్యవంతులై ఎక్కి వచ్చేటట్లుగా పిలుపునిచ్చే టందుకై ఆయన తానుగా తీర్చిదిద్దుకున్న రథం ఈ శరీరం.

ఆ మిత్రులు పారవశ్యంలో మునిగిపోతూనే ఇలా అన్నారు ఇది ఈ భూమి చేసుకున్న అదృష్టంఅని నాకని పిస్తున్నది. ఎక్కిరాలవారు తాము తలపెట్టిన లోకహితార్థమైనకృషి నిరాటంకంగా కొనసాగడానికై తాముగా చేసుకున్న ఏర్పాటే ఇది అని నా మనస్సునకు భాసిస్తున్నది. మీరు ధన్యులు. మీ నుండి ఆ గొంతును వినగలుగుతున్న మేము ధన్యులం. పది కాలాలపాటు మీరు వర్ధిల్లాలి అని పదే పదే ఆ దైవాన్ని కోరు

మాస్టరు ఇ. కె - మనం

ఉంటున్నాను. ఈ గురుపేటిక నుంచి వెలువడే మాటలు - మంత్రాలకోసం మానవజాతి ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉంటుంది.

అంటూ స్వామి పదములకు నమస్కరించివారు సెలవు తీసుకున్నారు.

వారి తరువాత కాదు-వారితో బాటుగా

'కృష్ణస్వామిగారూ ! మిమ్మల్నెప్పటినుండో ఒక మాట అడగాలనుకుంటున్నాను. ఇ. కె మాస్టరుగారు ఇంత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారుకదా! మరి వారి తరువాత ఈ కార్యక్రమం మాటేమిటి ? అన్నారొకాయన.

సూటిగా చూస్తూ స్వామిఇలా అన్నారు: మాస్టరుగారి విషయంలో తరువాత అన్న ప్రసక్తే లేదు. ఎందుకనంటే వారితో పాటుగా పనిచేయగలిగిన వారిని లెక్కకు మిక్కిలిగా తయారు చేసుకుని ఉన్నవారు వారు. వారిలా పనిచేసేవారు వారితోబాటుగ ఇప్పుడే పనిచేస్తున్నప్పుడు వారి తర్వాత ఏమిటి అన్న ప్రసక్తి ఎందుకు వస్తుంది ?

'మనీ పవర్‌కన్న మ్యాన్ పవర్ నాకు ముఖ్యం' అన్నారాయన. 'ఒక గ్రంథాన్ని రచించడంలో కన్న ఒకవ్యక్తిని తీర్చిదిద్దడంలో ఎక్కువ సంతృప్తి దొరుకుతుంది నాకు అన్నారాయన. చందాలను తీసుకుని, మనుషులను వదిలిపేయడం ఆయనకు నచ్చని పద్ధతి. దగ్గరయిన మనుషులను దక్కించుకోడంకోసం, తనను తాను నిశ్శేషంగా సమర్పించుకుంటారాయన. మరి అలా

తీర్చిదిద్దబడిన వ్యక్తులు ఆయన చేసిన 'సజీవమైన' రచనలే కదా ! కనుక వారి కార్యక్రమానికి కాలం గడుస్తున్నకొద్దీ వేగం పెరుగుతుంది. అది చిరంజీవమైన కార్యక్రమం.

అవతల వ్యక్తి తృప్తిగా చూశారు: మీరు మాట్లాడిన ఈ కాసిని మాటలలోనే వారి కార్యక్రమపై భవం కొల్లగా వెల్లడి అవుతోంది. మీరన్నట్లు అది నిజంగానే తిరుగులేని కార్యక్రమం' అంటూ మురిసిపోయారాయన.

తట్టుకోవాలి అంటే - మనని మనం తట్టుకోవాలి

ఈ సంఘటనలు ఇలా జరుగుతూ ఉండగా 1984 మార్చి 16 వ తేదీ రాత్రి మాస్టరు ఇ.కె తమ భౌతిక కాయాన్ని విడిచి పెట్టడం జరిగింది. వారికది లీలాప్రాయమే కావచ్చు. సోదర బృందానికి ఆ వార్త పిడుగుపాటుకన్న మించినది. పదిహేనవ తేదీ అంతా స్వామి, ఇ.కె మాస్టరుగారి భౌతికకాయం దగ్గర, ఆ పాదాలచెంత అలా నిలబడి ఉన్నారు. అంతిమయాత్ర వేళకు స్వామి దేహానికి ఇక ఏ మాత్రం శక్తి ఉన్నట్లులేదు. మిత్రు లొకరు వచ్చి తమకారులో కూర్చోబెట్టుకోవడంతో ఆయన ఆ అంతిమ యాత్రను అనుసరించగలిగారు.

మరుభూమిలో మరిక మామూలుగా కనబడని స్థితికి మళ్ళి పోతున్నది మాస్టరు ఇ.కె దేహం. అలా ఒక ప్రక్కగా విలవిల లాడుతున్న దేహంతో నిలబడి ఉన్నారు స్వామి. దేహం కాలి

పోతున్నప్పటికంటె మించినబాధ అది కన్నీళ్ళకు అందనిది మాటలకుఅందనిది.

ఇంతలో అక్కడి బృందంలోనుంచి సోదరులు మల్లిపూడి వీరయ్యగారుస్వామిని సమీపించి ఆత్మీయతను కురిపిస్తున్న కళ్ళతోచూస్తూ 'మీరుకూడా ఇలా అయిపోతే ఎలా చెప్పండి? అన్నీ తెలిసినవారు మీరు తట్టుకోవాలి. మాకొరకైనా మీరు తట్టుకోవాలి' అన్నారు

పెగలలేకపోతున్న గొంతుతో కన్నీళ్ళ మధ్యలోనుంచి చూస్తూ 'అవును తట్టుకోవాలి. తట్టుకోవాలీ అంటే మనలో ఒకళ్ళ నొకళ్ళు ఇలా తట్టుకోవాలి. అప్పుడే మనంతట్టుకోవడం సాధ్యం.' అంటూ ఆయన్ని కౌగిలించుకున్నారు స్వామి.

'చూశారా మనం మాట్లాడుకొనే మామూలు మాటలకే ఏ నోటినుండి వెలువడేటప్పటికి ఎలాంటి శక్తి వస్తున్నదో వస్తున్నదో!' అన్నారాయన.

'అవును అది మాస్టరుగారి దివ్యశక్తి. మనం తట్టుకునే శక్తి చేయగలిగిందదే' అన్నారుస్వామి.

పరిసమాప్తం కాదిది-పని ప్రారంభం

అక్కడ జరుగవలసిన కార్యక్రమం పూర్తికాగానే బరువెక్కిన గుండెలతో, సాగలేకపోతున్న పాదాలతో తప్పదుకదా ! అని ఇంటి ముఖం పట్టారు సోదరబృందం. ఆ మరుభూమినుండి ఇవతలకువస్తూఉండగా సోదరులలో ఒకరన్నారు స్వామితో: 'ఇవాల్టితో కథపూర్తయిపోయింది' అని.

స్వామి వారినివారిస్తూ ఇలా అన్నారు: 'పరిసమాప్తంకాదు ఇది పని ప్రారంభం. పని పూర్తికాకుండా కథ ఎలా అవుతుంది ? సృష్టికథ మలుపుతిరగవలసి వచ్చినప్పుడల్లా పురాణపురుషుడు దేహధారియైదిగివస్తాడు, సృష్టికథ మలుపుతిరిగి ఒక స్థాయికి రాగానే ఇక ఇలాసాగుతుందనిసరిచూసుకొని, అప్పటికాదేహన్ని త్యజిస్తాడు, మలుపుతిరిగిన సృష్టికథకు అది ఒక ప్రారంభం లాంటిదే అది సమాప్తమెలా అవుతుంది ? సృష్టికథకు అయిపోవటమంటూ ఉండదు. ఇలా కొంతకాలం సాగుతుంది. మళ్ళీ మలుపుతిరగవలసి ఉంటుంది. అప్పుడు మళ్ళీ ఆయన దిగి వస్తాడు. ఈ లోపల ఆయన దగ్గరశిక్షణ పొందినవారు డీలా పడి పోకుండా ఆ అడుగుజాడలవెంట సృష్టికథను సాగేటట్లుగ చూడాలి. అలా చూడటంకోసమే ఆయన దగ్గరకు చేరే అపురూపమైన అదృష్టం వారికి లభించిందని వారు గ్రహించాలి. ఆయన దగ్గర పొందిన శిక్షణను సద్వినియోగం చేయాలి. ఏమంటారు. పరిసమాప్తంకాదిది, ప్రారంభం, పని ప్రారంభం.

ఆ సోదరులు అవునన్నట్లు తలపంకించారు. 'చాలా బాగా గుర్తుచేశారు, ఏమరుపాటు చెందుతున్న మనస్సుకు ఎరుకను కలిగించారు.' అంటూ చేతులు జోడించారు.

ఇది మన నిర్లక్ష్యానికి పడిన శిక్ష

అది మాస్టరు ఇ.కె. దేహం విడిచిపెట్టిన తర్వాత పద మూడవరోజు. చిన్నమునిపేటలోని మాస్టరుగారి ఇంటి ప్రాంగణం. ఎక్కడెక్కడి వారు వచ్చి చేరుతున్నారు. జరుగ వలసిన క్రతువు జరుగుతూ ఉన్నది. సోదర బృందంవారు బృందాలు బృందాలుగా రూపొంది మాస్టరుగారిని గురించిన వివిధాంశాలను మననం చేసుకుంటున్నారు. ఒక బృందం మధ్యలో స్వామికూర్చొని ఉన్నారు. వాళ్ళందరూ చెప్పుతూ వస్తున్న మాటలు విని విని స్వామి ఇలా అన్నారు: నేనొక్క మాట చెప్పనా? ఆయన దేహంతో ఉన్నప్పుడు మన ప్రవర్తనలను గూర్చి ఒక్కసారి గుర్తుచేసుకోండి. ఆయనదేహాన్ని గురించి గాని, దేహస్థితిని గురించిగాని, ఆ దేహానికి కావలసిన విశ్రాంతిని గురించిగాని, అదివని చేయుటానికి కావలసిన సౌకర్యాలను గురించిగాని మనం పట్టించుకున్నవారెందరు? ఎవరికి వారు మనపని పూర్తయిపోతే చాలనుకున్నాం. ఆయన నుండి మనము సేకరించుకొని బయటపడేది ఎలాగ? అను మాత్రమే చూసు కొన్నాం. ఆయనకూడా అన్నం తినాలి అనుకోవడంకన్నా, మన పనికావడం చూసి అప్పుడు అన్నంతింటే బాగుండును అని అను కున్నవాళ్ళమే ఎక్కువమందిమి. మాస్టరుగారు భోజనానికి లేస్తున్నట్లున్నారే! అంటూనే గంటల తరబడి మనం ఆయన్ని తినేసేవాళ్ళం. మాస్టరుగారూ మీకు నిద్రవస్తున్నట్లుగా ఉంది. అంటూనే వస్తున్న నిద్రకు అడ్డంపడి మన సమస్యలన్నీ ఆయన ముందు పెట్టి ఆయనకు నిద్రలేకుండా, అప్పుడే అది ఆ ఛాయలకు

రాకుండా చూసేవాళ్ళం. రైల్లో ఆయన ఏదైనా ఊరువెళుతూ ఉంటే ప్రతిస్టేషన్ దగ్గరాఆయన్ని ఆపి మందులు వ్రాయించుకోవడంతోనే సరిపెట్టకుండా మరదళ్ళపెళ్ళిసంగతి, మనవళ్ళ వడుగుసంగతి ఆయన్నే నిర్ణయించమనిచెప్పి ఆయన ఓపికనంతా పిండుకుని, మిగిలినభాగాన్ని పిప్పిలా ఇప్పటికిలా వదలుతున్నామన్నట్లుగారైలుకువదలిపెట్టేవాళ్ళం. చివరకు ఆయనబాత్రూంకువెళుతున్నా అడ్డుపడి మా బాధలు విని మరీవెళ్ళండి అన్నవారు ఉన్నారు మనలో ఏమంటారు ? నేను చెబుతున్న ఈ అంశాల్లో అతిశయోక్తులేమయినా ఉన్నాయంటారా ? నేను చెప్పిన విషయాలు చాలా చిన్నవిసుమా ! చివరకు ఆయన ఆరోగ్యం ప్రమాదస్థితిపైపునకు ఒకప్రక్క పయనిస్తూ ఉండగా అలాంటిస్థితిలో విశాఖచేరుదామని ఆయన బయలుదేరితే మధ్యన ఒక ఊళ్ళోఆపి, కూర్చోవటానికికూడా శరీరం సహకరించని స్థితిలోఉన్న ఆయన్ని బలవంతాన కుర్చీలో కూర్చోబెట్టి, మనకున్నబలమంతా ఆయనకు పాదనమస్కారాలు చేయడంలోచూపినవాళ్ళం. ఒకప్రక్క దేహానికి దారుణస్థితి ప్రాప్తిస్తోంది. కనులెత్తిచూడలేకపోతున్నారాయన. మగత ఆయన కనురెప్పల్ని నొక్కేస్తుంటే మాస్టరుగారూ ! వీడూ మా అబ్బాయి. ఇది మా కోడలు. ఇటుచూడండి. వీడే మా మనవడు అని మూసుకుపోతున్న ఆ కనురెప్పలను పైకెత్తిమరీ చూపించినవాళ్ళం మనం. సోదరులారా ఏమిచెప్పను మనచర్యలను గురించి ? ఆయనదృష్టిలో మనంపడాలి అనుకున్నాంతప్ప మనదృష్టి కనీసం ఆయనదేహం మీదనైనా పడలేదు. ఆయనను వినియోగించుకోవాలన్న ఆత్రుతలోపడి మనమాయనదేహాన్ని పట్టించుకోనేలేదు. అయినా అది కొన్నాళ్ళుమనమధ్య పెనుగులాడింది ఆయనమీదున్న అను

రాగంతో. మననిర్లక్ష్యానికి తట్టుకోలేక మనపైప్రేమచూపి చూపి, మనలో ఇక ఎదుగుదలరాదని గమనించి 'మీకుకావల్సిందాయనే కదా ! నేను మీకు అక్కరలేదుకదా ! అందుకే నేనిక తప్పుకుంటున్నాను. మీరిక ఆయననుచూసుకోండి అని తప్పనిసరై తానుతప్పుకుంది. తప్పుకుంటేనేగాని మనకు దాని విలువతెలియలేదు. ఇప్పుడు విలువతెలిసింది ఏం లాభం ? ఏదైనాఇంతేనేమో ! ఉన్నప్పుడు విలువ తెలియడం కష్టం. ఉన్ననాడు, విలువ తెలిసి వర్తించగలిగితే, మానవుడు ఇక ధన్యుడే ! ఏంచేద్దాం ఇప్పుడుచెప్పండి ! ఇది మన నిర్లక్ష్యానికిపడినశిక్ష. ఇప్పటికైనా మనతో అన్నాళ్ళు గడిపినందుకు ఆదేవునికి కృతజ్ఞతలు చెప్పుకుందాం. అంతకన్నా చేయగలిగిందిలేదు.

ఆ బృందమంతా అశ్రునయనాలతో ఆత్మపరిశీలన చేసి కొంటూ కూర్చుండిపోయింది అలా.

చెట్లుగా గాక - తోటగా

ఆ పదమూడవరోజునే సాయంత్రం 6 గంటలకు విశాఖ లోని ప్రేమసమాజం హాల్లో సోదరబృందం సమావేశమయింది. సోదరబృందంలోని ప్రముఖులు ఒక్కొక్కరే వేదికపైకివచ్చి తగు మాత్రంగా జరిగిన, జరుగవలసిన అంశాలను గురించి తమ కనిపించిన విధంగా మాట్లాడి దిగిపోతున్నారు. ఇంతలో స్వామి వంతు వచ్చింది.

సోదరబృందమందరినీ ఒక్కసారిగా కలియజూచి స్వామి ఇలా అన్నారు: మాస్టరుగారు మనకందించినవి అప్పగించినవి రెండు. ఒకటిసేవ. రెండు సందేశం. ఆ రెండింటి విషయంలోను మనం మరింత శ్రద్ధపెట్టవలసి ఉందిప్పుడు. ఎందువల్లనంటే వాటిలోనే మనం మాస్టరుగారిని చూడగలం కనుక. నిజంకూడా అంతే. వాటినిచూసే మనం మాస్టరుగారికి దగ్గరయ్యాం. వాటిని చూచే మనం వారు మాస్టరుగారని మోకరిల్లాం. మళ్ళీ ఇప్పుడు వాటి నిర్వహణలోనే మనం వారిని సాక్షాత్కరింపచేసుకోవలసి ఉంది. అయితే ఇక్కడో చిత్రముంది. వారిసేవాసందేశాల సంగతి లోకానికంతటికీ తెలిసిందే. వారి స్వరూపాలే అవి!అనికూడా ప్రజలెందరికో తెలుసు, అయితే వాటిమీదుగా, వారికి దగ్గరైన మనం ఎటువంటి దివ్యప్రేమను అనుభవించామో మనకు మాత్రమేతెలుసు. నిజానికా దివ్యప్రేమవల్లే ఈ సేవా,సందేశాలకు ఇంతటి విస్తృతి, ఇంతటి ప్రయోజనాలు ఏర్పడ్డాయి. కనుక సేవా, సందేశాలను కొనసాగించడం అంటే మామూలుగా కొనసాగించటంకాదు. మామూలుగ కొనసాగిస్తే అవి ఎంతోకాలం సాగవు. అలాంటి దివ్యప్రేమతో మనం కొనసాగించగలిగినపుడే ఈ సేవా సందేశాలు నేలనాలుగు చెఱగులావ్యాపించి, ఈ విశ్వరూపాన్ని మాస్టరుగారి నిజస్వరూపంగా మనకు చూపించగలుగుతాయి. కనుక ఇప్పుడుమనం ఆయన మనయెడలచూపిన ప్రేమను నిరంతరం స్మరించుకుంటూ మనమే ప్రేమగా రూపొందవలసి ఉన్నది. నిజానికి మన నిజస్వరూపమదే ! మాస్టరుగారు మనకు రుచి చూపిందీ, తెలియజెప్పింది, అనుభవింపజేసిందీకూడా అదే. ఆయన నడిపిన శిక్షణ తరగతులు, చేసిన శాస్త్రబోధలు అన్నీ ఆ ప్రేమమహాసముద్రంనుండిపైకిలేచిన కెరటాలే! ఆయన మననుంచి

ఏమీ కోరలేదు. మనను తనకన్న ఎన్నడూ వేరుగా చూడలేదు. మనలో తనను చూసుకుంటూ, మననితానుగా తీర్చిదిద్దుకుంటూ వచ్చారాయన. ఈ సత్యాన్ని ఎందుకు గుర్తుచేస్తున్నానంటే మన తోటివారితో మనం అలాంటిఆత్మీయతతో మెలగగలగాలని తెలియ చెప్పటానికి, అప్పుడు మాత్రమే ఆయననుండి వ్యక్తమైన సేవా సందేశాలు మనద్వారా విస్తృతిచెంది మనజీవితాలను పునీతం చేస్తాయని నేను మరల మరల మనవి చేస్తున్నాను. సోదరులారా ! మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకోవలసిన మాటలివి. మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకోవలసిన దివ్యస్థితిఇది. దీనిపట్ల మనం ఏ మాత్రం ఏమరుపాటు చెందకుందుముగాక !

నాకుముందు మాట్లాడిన మిత్రులలో కొందరు వారుచెప్పిన అంశాల్లో భాగంగా 'మాస్టరుగారికి ప్రత్యేకించి వారసులులేరు. అంతా వారే నడుపుకుంటారు అని చెబుతూ వచ్చారు. ఈ విషయమై నేనొక చిన్నమాటచెబుతాను. వారు చెప్పింది వినటానికి బాగానేఉందిగాని, క్రియారూపంలో అలా జరగడానికి అవకాశంలేదు. మాస్టరుగారు తమ ప్రణాళికను నిర్వహించడానికి కొన్ని ఉపాధులను తప్పక ఎంచుకుంటారు. కొన్నింటిని ఇప్పటికే ఎంచుకుని ఉన్నారు. ఇంకొన్నిటిని కాలక్రమంలో ఎంచుకుంటారు. మాస్టరు సి.వి.వి అలాగే చేశారుకదా ! చేస్తున్నారుకదా! మాస్టరుగారికథా అంతే ! అలాగే మాస్టరుగారిని దేహంతో చూడటానికి అలవాటుపడిన సోదరబృందం ఆ దేహం తప్పుకున్న కారణాన ఇప్పుడు తీవ్రమైన విరహవేదనను అనుభవిస్తున్నారు. వారు తప్పకుండా మనలో కొందరిలో మాస్టరుగారిని చూసుకునే ప్రయత్నం చేస్తారు. ఇప్పటికే చేస్తున్నారు దానికి మనం అర్హ

పెట్టకూడదు. అడ్డుపెట్టడానికి మనమెవరం ? చిత్రమేమంటే మన ప్రణాళికను వ్యక్తంచేయడానికి మాస్టరుగారు స్వీకరించిన ఉపాధులూ ప్రజలు ఆయనను చూచుకోవడానికి ఎంచుకునే ఉపాధులూ ఒకటే అవుతాయి. కథ అలా జరుగుతుంది.

మరోమాట. మనిషికి ఒక వయసు వచ్చినతరువాత వివాహమౌతుంది. పిల్లలు కలుగుతారు. ఆ కలిగిన బిడ్డలు అమ్మా, నాన్నా అని పిలుస్తూ చుట్టూతిరుగుతారు. అది సహజం. అలా జరుగుతున్నందుకు ఆశ్చర్యపడవలసిందిగాని, గర్వించవలసింది గాని ఏమీ లేదు. అలాగే మననుండి లోకహితార్థమైనకార్యక్రమం వ్యక్తమవుతున్న కొద్దీ దానిఎడల అభిరుచి కలిగిన కొందరు మనకు దగ్గరకావడం, మనలో తమకు కావలసిన గురుస్వరూపాన్ని చూసుకోవడం, దానికి శరణాగతిచెంది తాముశిష్యులై శిక్షణపొందడం జరుగుతూ ఉంటుంది. తల్లిదండ్రుల బిడ్డలకథ ఎలాంటిదో ఇదీ అలాంటిదే. ఈవిషయంలోకూడ ఆశ్చర్యపడవలసిందిగాని,గర్వించవలసింది గాని ఏమీలేదు. ఈ సత్యాన్ని తెలుసుకుంటే మనం సాఫీగా ముందుకు సాగిపోగలుతాం. అలాకాక ఆశ్చర్యపడినా, గర్వించినా, అలా పడడంకోసం మనం మన ప్రయాణాన్ని ఆపి వేయవలసివస్తుంది. కనుక భవిష్యత్తులో ఈ అంశాలను సోదర బృందంలోని ప్రముఖులు నిరంతరం గుర్తుపెట్టుకోవడం ఎంతైనా అవసరం.

చివరిగా ఇంకొక్కమాట. మనలో ఎవరి స్వభావం వారి కుంటుంది. ఒకరిలా ఇంకొకరు పని చేయడంగాని, ప్రవర్తించడం గాని సాధ్యంకాదు. అలాజరుగవలసిన అవసరమూలేదు. ఎవరి స్వభావానికి అనుగుణంగా వారు మాస్టరుగారి ప్రణాళికలో పని

చేయవచ్చు. పనిచేస్తాం కూడా. అలా పనిచేస్తున్నప్పుడు మనమధ్య ఉన్న తారతమ్యాన్ని వైరుధ్యంగా గాక వైవిధ్యంగా మాస్టరు గారి దివ్యవైభవంగా మనం దర్శించవలసి ఉంటుంది. ఈ సృష్టిలోని చిత్రమొకటి చెబుతాను చూడండి. ఒక తోట ఉన్నది. ఆ తోటలో రకరకాల మొక్కలున్నాయి. ఆ మొక్కలు పెరిగి చెట్లవుతాయి. ఆ రకరకాల చెట్లు తమకు తగినట్లుగానే ప్రవర్తిస్తాయి కదా! ఒక్కొక్క రకం ఒక్కొక్క విధంగా పూస్తాయి. ఒక్కొక్క కాలంలో కాస్తాయి, ఫలిస్తాయి. అలా జరగడం వల్ల ఆ తోటకు అందచందాలు పెరుగుతున్నాయే తప్ప ఇబ్బంది ఏమీ రావడంలేదు కదా! ఇన్ని రకాల చెట్లు, ఇన్ని రకాలుగా పూయటం, కాయటం, జరుగుతుండడం వల్ల అన్ని కాలాల్లోనూ ఆ తోట వైభవం పెరుగుతూనే ఉన్నది. సోదరులారా! మనమిప్పుడు అలాంటి తోటగా రూపొందాలి. మనలో ఎవరి స్వభావాలు వారికుండవచ్చు. ఎవరి అభిరుచులు వారికుండవచ్చు. ఎవరి కార్యక్రమాలు వారికుండవచ్చు. కాని మనమందరం ఒకటే అని మనకు గుర్తుండాలి. వ్యక్తమవుతున్న వైవిధ్యమంతా మాస్టరుగారిదేనని మాస్టరుగారి ప్రణాళికలోనిదేనని మనం గ్రహించగలగాలి. తోటలో ఉన్నప్పుడు నిజానికి చెట్లే కాని చెట్లక్కడ ఉన్నాయి అనడంలేదు మనం, ఇక్కడ తోట ఉన్నది అంటున్నాం. ఏకవచనాన్ని ప్రయోగిస్తున్నాం. అలాగే దైవయోగాన మనం బహుధా ప్రవర్తించినప్పటికీ, ఏకత్వమనేది మనచేత నిరంతరం అనుభవింపబడాలి. చెట్లు అనబడే స్థితిలో కాకుండా తోట అనబడే స్థితిలో మనం ఎప్పుడూ ఉండాలి. 'ఎస్! ఇట్ ఈజ్ మాస్టర్స్ గార్డెన్' మాస్టరుగారి తోట. మాస్టరుగారి ఈ తోట. మనం చెట్లవంటివాళ్ళం. మనద్వారా వ్యక్తమవుతున్న ఆయన తోటవంటివారు. ఈ సత్యం మనకు గుర్తున్నంత వరకు

మనలో ఎవరెవరం ఎక్కడున్నా ఏంచేస్తున్నా ఒకానొక దివ్యానుభూతి అనుభవానికొస్తుంది. ఆ అనుభూతే మన మాస్టరుగారు.

సభ మాస్టరుగారి స్మృతిరూపమై ధ్యానసముద్రంలో నిలచినట్లున్నది.

మౌనం పాటించడం కాదు - ధ్యానం చేద్దాం

మాస్టరు ఇ. కె. దేహాన్ని విడిచిపెట్టిన కొద్దిరోజులకే శ్రీరామనవమి వచ్చింది. ఆ సందర్భంగా విశాఖ ఇండస్ట్రియల్ కాలనీలోని రామాలయంలో స్వామి ప్రసంగించవలసివచ్చింది. ఏటా శ్రీరామనవమి రోజుల్లో ఏదో ఒకరోజున మాస్టరు ఇ. కె. స్వామిని కలుపుకొని ఆ రామాలయంలో ప్రసంగించడం అనేది ఒక ఆచారంగా వస్తోంది. ఈ సంవత్సరం బరువెక్కిన గుండెతో అలానే స్వామి ఆ ఆచారాన్ని ఒక్కరుగా కొనసాగించవలసి వచ్చింది.

ఇ. కె. మాస్టరుగారికి ఆ రామాలయమన్నా ఆ రామాలయ నిర్వాహకులన్నా ఒక ప్రత్యేకమైన అనురాగం. దానికి కారణం కార్మికులు, శ్రమజీవులు కలసి మెలసి స్వయంగా ఆ రామాలయాన్ని నిర్మించుకోవడమే ! నిర్మించుకోవడమే కాకుండా, చక్కగా దాన్ని నిర్వహించుకోవడం. నిర్మాణం ప్రారంభమైనప్పటినుండి ఆ దేవాలయంతో ఇ. కె. మాస్టరుగారికి విడదీయరాని అనుబంధముంది. నిర్మాణ సందర్భంలో ఆ శ్రామికులను ఆశీర్వదిస్తూ ఆయన ఇలా అన్నారట ! ఈ పని మీ వల్ల అవు

కుండా అని. మీరు భయపడవలసిన పనిలేదు. ఆనాడు వారధి కట్టిన వానరులు ఎలాంటివారో ఇప్పుడు మీరూ అలాంటివారే, ఆనాటి నుండి రాముడు తన ఆలయాలను ఇలా సామాన్యులను బృందాలుగ తీర్చిదిద్దే నిర్మింపజేసుకుంటున్నాడు. రామాలయంటే మీరు పరిశీలించ వచ్చు. మిగిలిన దేవతామూర్తుల గుడులు ఎవరైనా నిర్మించి ఉండవచ్చు కాని రామమందిరాలు మాత్రం దాదాపుగా అన్ని శ్రమజీవులు, సామాన్యులు బృందాలుగా ఏర్పడి ఏర్పాటు చేసుకున్నవే. కనుక ముందుకు సాగండి. మీ మీ వృత్తి విద్యలను రామాలయ నిర్మాణంలో వినియోగించి ధన్యులుకండి ! మీ వెంట నేనెప్పుడూ ఉంటాను.

అలా ఆయన వెన్ను తట్టడంతో రామాలయ నిర్మాణం చకచకా సాగిపోయింది. అప్పటినుండి ఆ శ్రమజీవులకు రామాలయాన్ని చూచినపుడల్లా మాష్టరుగారి మాటలే గుర్తుకొస్తుంటాయిట. వారు తరచు చెబుతుంటారు.

అలాంటిచోట స్వామి ప్రవచనం ప్రారంభం కాబోతున్న వేళ అది. ఆ కార్యక్రమ నిర్వాహకులలో ప్రధానుడైన వ్యక్తి లేచి మాష్టరు ఇ. కె. దివ్యవైభవాన్ని స్మరించుకొని 'అంతటి వారు శరీరాన్ని విడిచిపెట్టారు కనుక మన మందరమిప్పుడు రెండు నిముషాలు మౌనాన్ని పాటిద్దాం' అన్నాడు. వెంటనే స్వామి మైకు అందుకుని ఇలా అన్నారు. సోదరీ సోదరులారా ! చిన్న సవరణ, రెండు నిముషాలపాటు మనం మౌనం పాటించ వలసిన సందర్భంకాదిది. ఆ మహనీయమూర్తిని స్మరించి ధ్యానం చేసుకోవలసిన సమయం. మామూలుగా జీవించిన వ్యక్తులు

మరణించినప్పుడు కొద్దిసేపు మౌనం పాటిస్తాం. వారికి శాంతి కలగాలని దైవాన్ని ప్రార్థిస్తాం. కాని భూమిపైన దైవస్వరూపులుగా వెలుగొందిన మహితాత్ములు తమ శరీరాన్ని విడచిన వేళ వారిని స్మరించుకుంటాం. ధ్యానంచేస్తాం. వారిస్పర్శననుభవిస్తాం.మనం చిత్తశాంతిని పొందుతాం ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం. కనుక మౌనం స్థానంలో ధ్యానం చేసుకుందాం వారి అనుగ్రహానికి పాత్రులవుదాం. అంటూ స్వామి ధ్యాన నిమగ్నులైనారు. సభమొత్తం ధ్యానంలోనికి ప్రవేశించింది. ఇ. కె. మాస్టరుగారి దివ్యతేజం ప్రాంగణ మంతటా పరుచుకొన్నట్లుగా గోచరించింది.

దేహానికి దేహమే బదులు

కృష్ణాజిల్లా అవనిగడ్డలో మాస్టరు ఇ. కె. దివ్య సంస్మరణ సభ ఏర్పాటు చేయబడింది. ప్రముఖులు ఎందరో తరలి వచ్చారు అంజలి ఘటించడానికి. మాస్టరు ఇ. కె. నుండి వ్యక్తమైన దివ్యవైభవాన్ని నోరార కీర్తిస్తూ, అలాంటి మహనీయులు శరీరాన్ని విడిచిపెట్టడం తమని తీరని వేదనకు గురిచేస్తున్నదని చెప్పారు. సభఅంతా గాఢమైన విషాదానుభూతిని పొందుతోంది.

ఇక స్వామి లేచారు లేచి ఇలా అన్నారు పెద్దలెందరో ఇ. కె. మాస్టరుగారిని గూర్చి, వారి కృషిని గూర్చి ప్రస్తుతించారు. అకాలంగా వారు దేహాన్ని విడిచిపెట్టడం తమను తీవ్రమైన వేదనకు గురిచేసిందని చెప్పారు. నిజమే ! అనుకోకుండా

భూకంపమొస్తే ఎలా ఉంటుంది. జల ప్రళయం వస్తే ఎలా ఉంటుంది ? ఇదీ అలాంటిదే. తట్టుకోవడం చాలా కష్టంగానే ఉంది, కాని ఈ సందర్భంలో నాదొక్కమాట. ఇప్పుడు ఇక్కడ చేరిన మనందరం ఎందుకు బాధపడుతున్నాం. వారులేరని కాదు కదా ! వారున్నారు, శాశ్వతస్వరూపులై ఎప్పుడూ ఉంటారు అని మనకు తెలుసు. అయితే మరెందుకు ఈ బాధంతా ? వారికి దేహం లేదని, దేహంతో వారు మనకు కనబడటం లేదని! అంతేనా ? అదే మన బాధయినప్పుడు మనమొకపనిచేద్దామా? నాదృష్టిలో ఆయన ఎడల మనకు గల విశ్వాసానికి, ప్రేమకు, భక్తికి మనం చేయ దగినది, చేయగల్గినది, చేయవలసినది కూడ అదే. నా కనిపిస్తుంది కదా ! అసలాయన అందుకే మనలనుచేరదీశారని. దేహం అన్న తరువాత ఎప్పటికైనా విడిచిపెట్టక తప్పదు. ఆ విడిచిపెట్టే లోపున మరిన్ని దేహాలను ఆ పనికి సిద్ధం చేయడం జరిగినప్పుడు ఇక ఆ కార్యక్రమం ఆగదు. గురువునకు శిష్యులుగాని, తల్లిదండ్రు లకు బిడ్డలుగాని అందుకే ఏర్పడుతున్నారు. ప్రకృతి ఆ ఏర్పాటు అందుకే చేస్తున్నది. కొందరు తల్లిదండ్రులు ఈ సత్యాన్ని దర్శించలేక ఈ పిల్లలు పెరిగి పెద్దవాళ్లై వృద్ధాప్యంలో మనని చూడటానికి పనికివస్తారు అనుకుంటారు. అలా చూడాలని కోరు కుంటున్నారు కోరిక బాగానే ఉందికాని కొంత స్వార్ధంతో కూడు కుని ఉంది. అసలు ప్రకృతి మనకు పిల్లల్నిచ్చింది మనం సమాజానికి ఏ పని చేసిపెడుతున్నామో, ఆ పనిని వాళ్ళు మన తర్వాత కూడా కొనసాగించాలని. చూశారా ! ఈ సత్యాన్ని గమ నించి బిడ్డల్ని తీర్చిదిద్దితే ఎంత బాగుంటుంది. అలాంటిదే గురు శిష్యసంబంధంకూడా. గురువు తన శిష్యుని కొనసాగించబానికే

శిష్యులను రూపుదిద్దుతున్నాడు. కనుక సోదరులారా ! ఈ దీక్షలను ఆయనకు మరొక్కసారి మనస్ఫూర్తిగా అప్పగించుకుందాం. ఇన్ని దేహాలనూ తనవిగా స్వీకరించి లోకహితార్థమై జరుగుతున్న కృషిని కొనసాగించమని వారిని వేడుకుందాము. ఆ సమర్పణకు కావలసిన ప్రేరణ నందుకొనడానికే ఇప్పుడు ఈ దివ్య సంస్మరణ.

సభలోని విషాదచ్ఛాయలు స్వామిలేచి నిల్చున్నప్పటి నుండే కరగి పోవడం మొదలు పెట్టాయి. సందేశం పూర్తయ్యే టప్పటికి సభ స్ఫూర్తిని పొంది, కర్తవ్యోన్ముఖమై ఇ. కె. మాస్టరుగారివైపు సమర్పణ భావంతో చూస్తున్నట్లుగా భాసించింది.

ఆక్రమణ ఉండదు - ఆ క్రమమే ఉంటుంది

విశాఖలోని లాసన్స్‌బేలో వైద్యసేవలో ఉన్నారు స్వామి. మధ్యలో ఒక పెద్దాయన వచ్చారు. ఇ. కె. మాస్టరుగారి కార్యక్రమాలంటే ఆయనకు వల్లమాలిన అభిమానం.

మాటల మధ్యలో ఆయన అడిగారు స్వామిని "కృష్ణమాచార్యులవారు శరీరం విడిచిపెట్టారుకదా ! మరి ఇపుడు ఆ స్థానాన్ని ఎవరు ఆక్రమిస్తారు ?" అని.

సూటిగా చూస్తూ స్వామి ఇలా అన్నారు : ఇ. కె మాస్టరు గారు ఒక క్రమంలో తమ అంతేవాసుల్లో కొందరిని ఎప్పటినుండో

తీర్చి దిద్దుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు కూడ ఆ క్రమమే ఉంటుంది. ఇక ఆక్రమణకు అవకాశమెక్కడిది ? ఆ అవసరం మాత్రమెక్కడుంటుంది ?

అవతలి వ్యక్తి బోధపడినట్లె తృప్తిగా చూశారు.

కాబోయే కులపతికి కాలమే రూపుదిద్దుతుంది

మరొక రోజున వైద్యసేవలో ఉన్న స్వామి దగ్గరకు కొందరు పరామర్శించడానికని వచ్చారు. పరిస్థితులను గూర్చి ప్రస్తావించుకుంటూ ఉండగా అందులో ఒకాయన మధ్యలో అడిగాడు. ఇ. కె. మాస్టరుగారు శరీరాన్ని వదలి పెట్టారు కదా ! మరి ఇప్పుడు కాబోయే కులపతి ఎవరు ? అని.

వారివైపు సూటిగా చూస్తూ స్వామి ఇలా అన్నారు : ఇ.కె. మాస్టరుగారిని కులపతిగా రూపొందించింది ఎవరు? కాలం. కాలమే ఆయనకు ఆ రూపమిచ్చింది. ఆయనలా రూపుదాల్చి పనిచేసి పెట్టాలని కోరుకున్నది. ఆయన అలా పనిచేసి పెట్టారు. ఇక ముందు కూడా కాలమే తనకు తగిన వారిని ఎంచుకొని కులపతిగా రూపు దిద్దుకుంటుంది. కనుక ఎవరూ కలవర పడనక్కరలేదు. కాలం వరించకుండా ఎవరైనా తాము కులపతులమని భావించినా, భావించి ఊరుకోవడమెందుకని తమపేర్లముందు అలా తగిలించుకున్నా ఒరిగేదిగాని, జరిగేదిగాని ఏమీ ఉండదు. ఆ పదం

కూడా వారి పేరులో భాగంగా మిగిలిపోతుంది. సోమయాజులని పేరు పెట్టుకునే వాళ్ళులేరూ ? శాస్త్రి అని పేరు పెట్టుకునేవాట లేరూ ? అలాంటిదే ఇది కూడా అవుతుంది. కనుక కాలం వరించ వలసిన విషయంలో మరొకరు వివరించవలసిందేముంటుంది ?

మాస్టరు సి.వి.వి. గారి సంప్రదాయానికి చెందినవారిలో ఎక్కువమంది మొదట్లో ఇ. కె. మాస్టరుగారిని సి.వి.విగారి పరం పరలో ఒకరిగా గుర్తించడానికే ఇష్టపడలేదు. తరువాత ఆయన విజృంభించి ఉద్యమ రూపం ధరిస్తున్న వేళల్లో కూడా అందరూ ఆయన్ని మాస్టరుగారని పిలుస్తున్నా వాళ్ళు మాత్రం మీడి యంల్లో ఒకరిగా అంగీకరించలేక పోయారు. అయినా కాలం వీరెవరిని లక్ష్యపెట్టలేదు. మాష్టరు సి.వి.వి.గారు కూడా వీరెవరి మాటా వినిపించుకోలేదు. ఇ. కె. మాష్టరు గారి ద్వారా మాష్టరు సి.వి.విగారి సంప్రదాయం విశ్వవ్యాప్తమైంది. సనాతన ధర్మం యొక్క నిజస్వరూపం నేల నాలుగు చెరగులా ఆయన నుండి వెదజల్లబడింది. కాలం ఆయనను వరించింది. కులపతిగా ఆయనను అభిషేకించింది. సర్వసంప్రదాయాలవారికి కావలసిన సమన్వయాన్ని ఆయన ద్వారా వ్యక్తం చేసింది. కనుక ఇకముందు కూడా జరుగవలసిన కథను ఆ కాలమే నిర్ణ యిస్తుంది.

ఆ వింటున్నవాడు ఔనౌను అంటూ తలవూపుతున్నాడు. అవును, కాలపురుషుడు చేసే నిర్ణయానికి ఎవరైనా తలవూప వల సిందే కదా !

2. సహచరులు - సరిదారి

1. గంటల కొలది
2. గుండెగల వాళ్ళిప్పుడు కావాలి
3. లైట్‌గా తీసుకోవడంకాదు-రైటుగా తీసుకో
4. ఆర్ట్ - కిల్
5. వర్రీ కాదది పెర్రీ
6. ఖాళీ లేదు అంటే-మన పనే ఖాళీ అవుతుంది
7. వీలు చూసుకొనిగాదు-వీలు చేసుకొని రండి
8. తీరిక లేదు అంటే - తీరు ఇక లేదు అని
9. ఆకర్షించడం కాదు-ఆరాధించడం జరగాలి
10. విల్లును ఎక్కుపెట్టండి
11. మార్చడం కాదిది మలచడం
12. అడుగు పెడితే అడుగు తగలాలి
13. శ్రద్ధయా వర్ధతే విద్యా

గంటల కొలది

మేడ మెట్లు దిగుతున్నారు స్వామి. అప్పుడే అక్కడొక సభ జరిగింది. చేరిన వారందరూ ఇంకా ఆ అనుభూతిలోనే మునిగి తేలుతున్నారని వాళ్ళను చూస్తేనే తెలుస్తోంది. స్వామితో పాటుగా దిగుతున్నారొక పెద్దాయన, పొంగుకొస్తున్న అనుభూతిని తనలో ఇముడ్చుకొనలేక పోతున్నారు కాబోలు స్వామి చేతులు పట్టుకొని, 'మాష్టరుగారూ' మీరివాళ మరీ కాసేపే మాట్లాడారు మరీ అంతలోనే ముగించేస్తే ఎలా ? ఇది నా మాటగాదు ఇక్కడ చేరిన వారందరి మాట, మనలో మాట. అసలు అందరూ వచ్చేది మీ మాటలు విందామనే కదా! ఈ సారికి ఏదో ఇలా అయిపోయింది వచ్చేసారైనా మీరెక్కువసేపు మాట్లాడాలి. గంటల కొలది మాట్లాడాలి' అన్నారు.

చిరునవ్వుతో ఇలా అన్నారు స్వామి : ఏమిటీ ! గంటల కొలది మాట్లాడాలా ? మనకున్న గంటలే కొలది కదా ! ఈ కొలది గంటలు మాట్లాడటానికే అయిపోతే ఇంక మనం పనిచేసే దెప్పుడు ?'

'అదిగో చెణుకు వేశారు మీరు ! అసలా చెణుకుల కోసమే కదా మిమ్మల్ని వదలలేని స్థితిలో మీ వెంట మేమూండి పోయేది, అయితే నాదొక చిన్న విన్నపం ! మాటలాడటానికే సమయాన్ని కేటాయిస్తే ఇంక పని ఎప్పుడు ? అన్నారు మీరు ! మామూలు అర్థంలో మీరన్నమాట కరక్టే. మీ విషయంలో మాత్రం చెప్పవలసింది వేరేఉంది. మీరు మాటలాడటం కూడా పని చేయడమే అవుతుంది. చూడండి మీ మాటలు మా మీదెంతగా

పనిచేస్తుంటాయో ! వందలవేలమందిని కర్తవ్యోన్ముఖులను చేసే మాటలు కదా మీవి, మరి ఆ మాటలాడటం కన్నపని ఇంకేముంటుంది చెప్పండి, అసలు మాటలాడటమే ఏ నిజమైన పని. ఎందుకనంటే ఈ మాటలు శతాబ్దాల తరబడి మానవాళిమీద పని చేస్తూనే ఉంటాయి కనుక. మానవాళిచేత పనిచేయిస్తూనే ఉంటాయి కనుక.

'బాగా చెప్పారే !' అంటూ ఆయన భుజాన్ని చిన్నగా తట్టి ఇలా అన్నారు స్వామి 'చిన్నమాట ! ఆ మాటలకా శక్తి ఎక్కడనుండి వొచ్చిందంటారు. పని చేస్తూ చెబుతున్నాము కనుక! అందుకే అంత శ్రద్ధగా వింటున్నారు. అంత శ్రద్ధగా వింటున్నపుడు ఏం మాట్లాడాము అన్నది ముఖ్యం తప్ప ఎంత సేపు మాట్లాడామన్నది ముఖ్యంకాదు కదా ! ఇది ఊకదంపుడుంకాదు విత్తనాలను చల్లడం. ఏముంటారు ? విత్తనాలు ఎంతబాగున్నా, క్షేత్రానికి సరిపడే చల్లుతుంటాము కదా !

'మాస్టరుగారూ ! మిమ్మల్ని మాటలలో జయించగలవారెవరు ? మిమల్ని జయించటం మాటలా ? చెప్పండి. ఇటుగో ఈ మాటలు, మీ మాటలు నాడైరీలోకి వెళ్ళిపోతున్నాయి అన్నారాయన ఆనందంగా, డైరీని జేబులోనుండి పైకితీస్తూ.

'డైరీలోకేకాదు డైలీ లైఫ్ (Daily life) లోకి కూడా వెళ్ళిపోతాయవి' అన్నారు స్వామి.

'అందుకేగా మాస్టరుగారూ చెవులు పెద్దవిచేసుకొని మేమంతా మీ వెంట నిలిచేది' అంటూ ఆ పెద్దాయన పారవశ్యంతో చేతులు జోడించి, శిరస్సువంచి, నమస్కరించి సెలవుతీసుకున్నారు.

గుండెగల వాళ్ళిప్పుడు కావాలి

'మీరిక్కడే ఉండిపోతున్నారు. అన్నివైపులకు కదలి రావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మాట మీకు మేము వేరుగా చెప్పనక్కరలేదనుకోండి, కానీ మనవి చేసుకుంటున్నాము. నెమ్మదిగానైనా మీరాలోచించాలి. మమ్మల్ని కూడా అనుగ్రహించాలి. ఈ విజయవాడ ఇంత అదృష్టానికి నోచుకున్నందుకు మాకెంతో ఆనందంగా ఉంది. మా ప్రాంతాలకు కూడా ఈ అదృష్టంపట్టాలని మా కోరిక.

నాదేముంది 'అది మీ చేతులలోనే ఉంది' అన్నారు స్వామి చిరునవ్వు నవ్వుతూ.

అంతవరకూ అభ్యర్థిస్తూ వస్తున్న అవతలి వ్యక్తి కొంచెం ఆశ్చర్యంగా ముఖంపెట్టి స్వామి వైపు అలా అలా చూస్తున్నారు.

కొద్ది క్షణాల మౌనం తర్వాత ఇలా అన్నారు స్వామి: అది మీ చేతులలోనే ఉంది. మీరు గట్టిగా నిలబడితే తప్పకుండా జరుగుతుంది. వినబడినపుడు, మనస్సు పులకించినపుడు మాత్రం ఇలా జరగాలని కోరుకుంటూ, ఆ తర్వాత మరచి పోకూడదు. ఇలా జరగడానికి కావలసిన విధంగా మిమ్మల్ని మీరు మలచుకుంటూ ఉండాలి. ఆ మలచుకోవటం నిరంతరంగా సాగాలి.

ఇక్కడ కొంతమంది గట్టివాళ్ళు నిలబడ్డారు. ఇక్కడ పని జరుగుతున్నది. ఎక్కడ నిలబడితే అక్కడ పని జరుగుతుంది. మీరు గుండెగలతో ఎసరు పెట్టండి. ఎసరు తెర్లేనాటికి బియ్యం

చేయడానికి తప్పక వస్తాను. మీరు గుండిగలనే పెట్టలేకపోతే నేనేలా రాగలను ? కాబట్టి మీ కోరికను కృషిగా మార్చండి. ఆ కృషి తప్పక ఫలిస్తుంది. గుండిగల వాళ్ళిపుడు కావాలి. గుండె గల వాళ్ళిపుడుకావాలి, ఏమంటారు ?

స్వామి వదనం సరస గంభీరంగా ఉంది.

అవతలి వ్యక్తి కొద్ది క్షణాలపాటు అలాగే ఉండిపోయాడు. కొంత సేపటికి తేరుకుని 'అలాగే మీరన్నట్టుగా గుండిగలవాళ్ళుగా, గుండెగలవాళ్ళుగా రూపొందే ప్రయత్నంలో ఉంటాము మమ్మల్ని ఆశీర్వదించండి' అన్నాడు.

మంచి పనికి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. అని వెన్ను తట్టారు స్వామి.

స్వామి నుండి శెలవునందుకొని బయలు దేరాడాయన. ముందుకు అడుగులు వేస్తూ తనను సాగనంపుతున్న సోదరునితో అంటున్నాడు 'అదిగో ఆ మాటల కోసమేనండీ ఇంతదూర మొచ్చేది, చూశారా ! ఒక్కమాటను మలుపు తిప్పుతూ మన జీవితాలనే మలుపు తిప్పుతున్నారాయన. అందుకే అన్నారు ఈ మాటలను మంత్రాలని.

లైట్‌గా తీసుకోవడం కాదు లైటుగా తీసుకో

'ఏం అలా చూస్తున్నావు ? ఇంతఘాటుగా మాట్లాడుతున్నారేమిటీనా ? తల్లిదండ్రులు కూడా ఎప్పుడూ ఇలా అనలేదే. మరి ఈయనిలా అంటున్నాడేమిటా అనా ?' అంటూ స్వామి ఎదురుగా తలవంచుకుని చూస్తున్న యువకునివైపు చూస్తున్నారు.

కొంతసేపు నిశ్శబ్దంగా నడిచింది. ఆ నడచినకాలం చాలా భారమనిపించింది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ 'ఏం? మాట్లాడవేం ?' అన్నారు స్వామి.

'లేదండీ నేనేమి అనుకోవడంలేదు. మీరు ఎప్పుడు ఏమన్నా నేను లైట్‌గానే తీసుకుంటాను. అంతలోనే మరచిపోతానండి' అన్నాడాయువకుడు తానేదో మంచిపని చేస్తున్నట్లు.

చురుక్కుమన్నట్లు చూస్తూ ఇలా అన్నారు స్వామి 'అదే నీతో వచ్చిన ఇబ్బంది. లైట్‌గా తీసుకుంటావు తప్ప 'లైటుగా ఎందుకు తీసుకోలేవు ? అంతలోనే మరచి పోతావు తప్ప అన్నవి గుర్తుంచుకొని నిన్ను నీవెందుకు మలచుకోలేవు ?'

కొంతసేపు మళ్ళీ నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలో కొంత ప్రశాంతత. స్వామి మళ్ళీ ఇలా అన్నారు: అర్థమైందా ? నీవెక్కడ తప్పులో కాలువేస్తున్నావో ! మాస్టరుగారు తిడుతున్నా నేను పడుతున్నాను, అందరిలా నేను పట్టించుకోవడంలేదు అనుకుంటున్నావు తప్ప, ఎందుకు తిడుతున్నారని ఎప్పడైనా ఆలోచించావా ? ఒక్కసారి మందలించినపుడు కారణాన్ని గమనించి నీవు సర్దుకుంటే

మళ్ళీ మళ్ళీ మందలించవలసిన అవసరం ఎందుకొస్తుంది ? అందుకే అన్నది లైట్‌గా అంటే తేలికగా తీసుకోవద్దు లైట్‌గా అంటే వెలుగుగా తీసుకోమని నేనన్నమాటలు. నీకా లిటి వెలుగై నీకు దారి గోచరించినవేళ ఇక మరచి పోవడమనుండదు. మలచు కోవడమే ఉంటుంది ఏమంటావ్ ?

'నిజమే మాస్టారూ !' అన్నాడతడు చెప్పబడిన నిజంలోనికి మేల్కొంటున్నట్లుగా కనబడ్డాడు.

వీపు మీద చిన్నగా తట్టి చిరునవ్వుతో అన్నారు స్వామి: అమ్మయ్య ! గ్రహించావుకద. ఈ సత్యాన్ని నీవెప్పటికి గ్రహి స్తావా ? అని చూస్తున్నాను. ఇక నా మాట నీ బాట కావాలి. ఇలా నానోటి వెంట మాటవస్తే అది అలా నీ కనులవముందు బాటై నీవు నడుచుకు సాగాలి. అందుకు ఇంతా చెప్పింది.

ఆ యువకుడు స్వామి పాదాలపై వ్రాలిపోయాడు. అతని కనులు అనుభూతి బాష్పాలతో ఆ పాదాలను కడుగుతున్నాయి.

ఆర్టికిల్

'ఇన్నాళ్టికా మీరు కనబడేది. ఇంతకీ మీ ఆర్టికల్ తెచ్చారా? సావనీర్ పని పూర్తయిపోతోంది. మీరేమో కనబడరు. వెతికినా దొరకరు' అన్నారు స్వామి ఎదుటనున్న మిత్రుణ్ణి మందలింపులో ప్రేమను మేళవించి.

'క్షమించాలిమాస్టారూ! నా సంగతి మీకు తెలియందేముంది? ఈ సంస్థలు, సంస్థల సభలు, సభలకు వక్తలు, ఆ వక్తలకోసం తిరగడాలు ఇలా తిరగడానికే టైమంతా ఖర్చైపోతోంది. ఈ హడావిడుల్లోపడి మీకిచ్చిన మాట నిలుపుకోలేక పోయాను. నిలుపుకోలేక పోయాను కదా అన్న సిగ్గుతో మధ్య మధ్యలో కొద్దిపాటి అవకాశాలు దొరికినా మీ ముందుకు రాలేకపోయాను. ఒక వారం గడువివ్వండి. అన్న ప్రకారం ఆర్టికల్ తీసుకురావడానికి ప్రయత్నిస్తాను!' అన్నాడాయన ప్రతిమాలుతున్నట్లుగా పలుకుతున్న గొంతుతో.

సరస గంభీరంగా అతని వైపు చూస్తూ స్వామి ఇలా అన్నారు: ఆర్టికల్ సంగతి సరే, ఈ ఏటికి కాకపోతే వచ్చే ఏటికి వ్రాస్తారు. నా బాధంతా ఏమిటంటే అర్థంలేని ఈ తిరుగుళ్ళలో పడి మీలోని ఆర్ట్ అంతా కిల్ అయిపోతుందే అని! భగవంతుడు మీకిచ్చిన ఆర్ట్‌ను ఇలా సంస్థలని, పదవులని తిరుగుళ్ళని అంటూ కిల్ చేయువచ్చునా? చివరికి మిగిలిపోయేది అదేనండి ఆ ఆర్టే! ఈ సంస్థలు, పదవులు అన్నీ కాలగర్భంలో కలసిపోతాయి ఏమంటారు?"

"నిజమే మాస్టారు, మీరన్నది. అక్షరాలా నిజం. ఇటీవల ఇవన్నీ తగ్గించుకోవడానికే ప్రయత్నిస్తున్నాను. మీకు దగ్గరైనప్పటినుండీ ఏది నిలిచేదో, ఏది నిలువనిదో తెలుస్తూనే ఉంది మనస్సుకి, కాని అభ్యాసదోషం కొంత, చుట్టూ ఉన్న వాతావరణం కొంత, పనిచేయుటంలో నాకింకా లంగరు అందడం లేదు. ఇదిగో ఇవాళ మీరు నాపైన సంధించిన బాణాలతో నా మనస్సుకు మరింతస్థాయి చిక్కి ఇక లంగరు అందుతుంది అనిపిస్తోంది. అందుకు మీ ఆశీస్సులు కావాలి." అన్నారాయన చేతులు జోడిస్తూ.

'ఇప్పటిదాకా అందింపబడినవేమిటి ?' అన్నారు స్వామి తృప్తిగా చూస్తూ.

"అర్థమైంది ఇంతకంటె ఆశీస్సులు ఇంకేముంటాయి. నేనదృష్టవంతుణ్ణి. మీ మనస్సులో నాకామాత్రం చోటు దొరికినందుకు. నేను దగ్గరకారేక పోతున్నా మీరు మాత్రం నా గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. అది నా అదృష్టం" అన్నారాయన వినమ్రుడై.

"అవును ఆలోచిస్తూనే ఉంటాను. ఆ ఆలోచన మీరెంత దూరాన ఉన్నా మిమ్మల్ని చుట్టుకొని, గట్టిగా పట్టుకొని మిమ్మల్ని నా దగ్గరకు తీసుకువచ్చి పడవేస్తుంది. ఇది తప్పదు. ఏమంటారు ?"

స్వామి విచ్చిన కన్నులతో చూస్తున్నారు. ఆత్మవంతులై భాసిస్తున్నారు. 'అవునవును. 'ఇది మాకు స్వానుభవమేకదా ! అన్నాడామిత్రుడు. అదో విధమైన అనుభూతి చెందుతూ, లోలోన గిలిగింతలు పొందుతూ.

వర్రీ కాదది వెర్రి

'ఏమిటో ఈ మధ్య కనబడటం తగ్గించావ్ ?' అన్నారు స్వామి తమను సమీపిస్తున్న ఒకామెను చూస్తూ

"ఏమనుండి మాస్టారూ మనసంతా వర్రీగా ఉంది. ఎటూ కదలబుద్ధికాక అల్లాగే ఉండిపోయాను." ఇంట్లో అన్నదామె.

'బాగుంది ఎందుకంత వర్రీపాపం.' అన్నారుస్వామి

మీకు తెలియనట్లడుగుతారేమిటి మాస్టరుగారు. నేను మళ్ళీ మళ్ళీ చెప్పాలా ? ఏమిచెబితేనమాత్రం ఏం లాభం ? ఆయనలో లేశమాత్రమైనా మార్పురావడంలేదు. రాకపోగా ఇది వరకటికన్నా ఇంకా దిగజారుతున్నారనిపిస్తోంది. ఇక మనసంతా వర్రీగాక ఏమవుతుంది ? చెప్పండి. అన్నదామె.

సూటిగా ఆమె కనులలోనికి చూస్తూ ఇలా అన్నారుస్వామి: 'దీనిని వర్రీ అనరు. వెర్రి అంటారు'

ఆమె ఆవేదనతోకూడిన ఆశ్చర్యంతో స్వామివైపు చూస్తున్నది. కొంచెంసేపు ఆమెనలాచూడనిచ్చి, స్వామి ఇలా అన్నారు: అతను నిన్ను అర్థం చేసుకునేపరిస్థితుల్లోలేడు. నీవు అతనిస్థాయికి దిగలేవు. నీ స్థాయికి అతన్ని పెంచలేవు. పట్టించుకోకుండా ఉండమంటే ఉండలేవు. దానితో ప్రతిదానికీ ఘర్షణ. దాని ఫలితం ఈ వర్రీ. వెర్రి'.

'అయితే ఏం చేయమంటారు' అన్నట్లుగాచూసిందామె ఆ చూపునందుకొని స్వామి ఇలా అన్నారు: ముందుపట్టించుకోవడం తగ్గించు. దానితో ఘర్షణతగ్గుతుంది. నువ్వుపట్టించుకుంటున్నావు కాబట్టి అతను మరీ మరీ నసపెడుతున్నాడు. పట్టించుకోవడం తగ్గించావనుకో ఎన్నాళ్ళని నసపెడతాడు ? ఎవరైనా ఉడికే వాళ్ళనే ఉడికిస్తారు. మనపప్పులిక్కడ ఉడకవు అని తెలిసిన

తర్వాత వాళ్ళే సర్దుకుంటారు. అతడికి కావల్సింది చేసిపెట్టు. అతడంటున్నది మాత్రం వినబోకు. అప్పుడు ఘర్షణలుండవు. ఈ వర్రీలుండవు.

వినిపించుకోకుండా ఉండటం ఎలా సాధ్యం ? అని నీవడుగ వచ్చు. మనస్సును 'హయ్యర్ పర్పస్' వైపుకు మళ్ళించు. ఒక ఉన్నతమైన ఆశయానికీ, ఉత్తమమైన సేవాకార్యక్రమానికి నీవంకితమైననాడు ఇక అవన్నీ నీవు పట్టించుకోమన్నా పట్టించుకోవు. కనుక, అవి సర్దుకున్న తర్వాత ఈ మంచి పనులు చేద్దామనుకోకాక. మంచిపనులుచేయడం మొదలుపెట్టు. శ్రద్ధతో చేస్తూఉండు. పరిస్థితులిక అవే దారిలోకివస్తాయి.

ఎలా వస్తాయి ? అని చూస్తున్నావుకదూ ? ఎప్పుడైతేనీవు సత్కర్మాచరణకు అంకితమయ్యావో అప్పుడు క్రమంగా నీచూపు రేఖలు మారిపోవడం మొదలుపెడతాయి. వాళ్ళిక సతాయిద్దామనుకున్నా సతాయించలేరు. అలా వారిని వారించగలిగినట్టి దివ్య తేజస్సు నీనుండి వ్యక్తమవుతుంది. అప్పుడిక వాళ్ళు అందాలని ఉన్నా అనలేరు. మరీ కుసంస్కారులైతే ఎదురుగా అనలేని స్థితిలో ఉన్నారు గనుక చాటుగా గింజుకుంటారు. పోనీ, గింజుకోనీ, మనకేమీ ఇబ్బందిలేదుకదా ! ఘర్షణలకు అవకాశంలేదు కదా ! అందుకే నీవుపడుతున్న వర్రీని నేను 'వెర్రి' అన్నాను. ఇంత చక్కటి మార్గముండగా వర్రీపడుతున్నావంటే వెర్రిగాక మరి ఏమిటి ?

ఆ మాటలకు ఆమె తేరుకున్నది. ఆమె ముఖంలో తిరిగి ప్రశాంతత నెలకొన్నది. చెప్పినట్లు చేద్దామనే నిర్ణయం ఆమెలో కనబడుతున్నది.

ఖాళీలేదు అంటే మన పనే ఖాళీ !

డిస్పెన్సరీకి ఆ మధ్య రెగ్యులర్‌గా వచ్చేదానివి. ఈ మధ్య కనబడటం మానేశావేమిటి ? నీలో కూడా మనజాతి లక్షణం పైకుబికినట్లుంది. "ఆంధ్రులు ఆరంభశూరులు" అని పెద్దలు మనకొక సర్టిఫికేట్ ఇచ్చారు. పెద్దలమాటను వమ్ముచేస్తే ఎలా ? అన్నట్లుగా ఉంటుంది మనవాళ్ళ ప్రవర్తన. నీవూ ఆ జాబితా లోనికెజారుకున్నట్లున్నావు ! అన్నారుస్వామి.

'ఎక్కడ మాష్టారూ ! ఎంతప్రయత్నించినా అసలుఖాళీనే దొరకడం లేదండీ' అన్నదామె.

'నువ్వుచెప్పిందితప్పు. ప్రయత్నిస్తే నీకు ఖాళీదొరికేది. నీవు ప్రయత్నించటంలేదు. అయ్యో ! వెళ్ళలేకపోతున్నానే ! అని మాత్రం అనుకుంటున్నావు. అదైనా అప్పుడప్పుడు. ఆ అనుకోవడాన్నే నీవు ప్రయత్నమనుకుంటున్నావు. ధృఢసంకల్పంతో మనం ప్రయత్నించాలేగాని, ఆ మాత్రం ఖాళీదొరక్క పోతుందా ?

'చూడు మనం చేయనంత మాత్రం చేత ఏ పనీ ఆగదు. చేయగలిగితే ఆ తృప్తి మనకు దొరుకుతుంది. ఖాళీలేదు అంటే మన పనే ఖాళీఅవుతుంది.' అన్నారుస్వామి.

ఆమె సిగ్గుతో తలవంచుకుంది.

వీలు చూసుకుని కాదు-వీలుచేసుకునిరండి

వైద్యశిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఒక రోజున క్లాసు పూర్తికాగానే స్వామిజీలా అన్నారు విద్యార్థులనుద్దేశించి: కేస్‌షీట్ ఎలా తయారుచేయాలి అన్నది మీకు చెప్పబడింది. రేపటినుండి కార్యాలయంలోని వైద్యాలయంలో మీరు కేస్‌షీట్లు తయారుచేయవచ్చు. ఈ సందర్భంలో నేనొక మాట చెబుతాను. ఈ శిక్షణ తరగతులలో మీరెలా పాల్గొంటున్నారో, వైద్యాలయాలలోకూడా మీరు అలాంటిసేవ చేయవలసి ఉంటుంది. వీలు దొరికినప్పుడు వద్దామనుకోకండి. అలా అనుకున్నవారికది కనబడదు. వీలుచేసుకొని రండి. వీలు చేసుకోవడం అలవాటుచేసుకోండి. అప్పుడు మాత్రమే మీరు రాగలుగుతారు, లేకపోతే ఈ కాలచక్రమున్నదే అదే టైమ్ అనే వీల్. అది గిర్రున తిరిగిపోతుంది. మనకు మాత్రం వీలు దొరకదు. కనుక వీలుచూసుకుని కాక వీలుచేసుకొనిరమ్మని సోదరులకు నేను సవివరంగా చెబుతున్నాను.

ఆ మాటలు వారికి నచ్చాయి. ఎందువల్లనంటే మానవ జీవితాలలోని సూక్ష్మాంశాలనుపట్టిచూపి, ఆచరణకు కావలసిన వెలుగును అందిస్తున్నాయి కనుక :

తీరిక లేదు అంటే తీరు ఇక లేదు అని

'పదిమందికి పనికివచ్చే మంచిపనిని పదిమందీకలసి చేస్తుకుందాం రండి !' అని పెద్దలయినవారు దిగివచ్చినప్పుడల్లా ప్రజలకు పిలుపునిస్తూనే ఉన్నారు, విన్నవాళ్ళల్లో చాలామందికి ఆ మాటలు నచ్చుతూనే ఉన్నాయి. కాని, ఆ బాటలో మాత్రం ఎక్కువమంది నడవలేకపోతున్నారు. కారణం, మాటలు నచ్చడానికి కాస్తంత సహృదయంఉంటేచాలు. ఆ బాటలో నడవడానికి మాత్రం బోలెడంత తయారీకావాలి. దృఢసంకల్పంఉండాలి. గాఢవిశ్వాసంకలగాలి. నిరంతరం అభ్యాసం జరగాలి. ఇవన్నీ ఎక్కడినుండి తెచ్చుకుంటాం. ఇలాంటివి ఎన్నని అలవరచుకుంటాం !' అని బద్ధకించి, మనిషి, "మంచిపనికి రావయ్యా." అన్నప్పుడల్లా 'ఎక్కడండీ, తీరికలేదు.' అంటాడు.

చూడండీ ! తీరికలేదు అంటే, తీరు ఇకలేదు. ఇక ఇప్పట్లో రాదు. దానినంతత్వరగా మేమురానివ్వం. అని అర్థం. చూశారా! అతడంటున్న మాటలలోనే అతడుంటున్నస్థితికూడా ఉన్నది. అది అలా అతడినుండి అప్రయత్నంగా పలుకబడుతున్నది. సరస్వతి ఉన్నదే, ఆమె చాలా చిత్రమైనది సుమా !

కనుక, ఈ మాటలు వింటున్న మీరు పిలుపు వినబడినప్పుడు తీరికలేదనీ ఇంకెప్పుడూ అనరని నేను అనుకుంటున్నాను. తీరికదొరకాలీ అంటే, మన తీరు ఇక మారాలి. పైన చెప్పిన అన్ని లక్షణాలనూకోరి మనం అలవాటుచేసికోగలగాలి! అంటూసోదరబృందాన్ని మృదువుగా మందలించారు. సున్నితంగా హెచ్చరించారు. నాజూకుగా నచ్చచెప్పారుస్వామి ఒకానొక శుభ సందర్భంలో.

ఆకర్షించడం కాదు ఆరాధించడం జరగాలి

సాయం సమయం. కార్యకర్తల మధ్య స్వామి కూర్చొని ఉన్నారు. కార్యక్రమాల విస్తృతికై తీసుకొనవలసిన మెలుకువలను గూర్చి ప్రస్తావన జరుగుతోంది.

ఒకరిలా అన్నారు ! మన కార్యక్రమాలలోనికి యువకులను పెద్దసంఖ్యలో ఆకర్షించాలి. దానికి కావలసిన చర్యలను మనం వేగంగా చేపట్టాలి.

స్వామి ఇలా అన్నారు: ఆకర్షించాలి అన్నపదం అంత మంచిది కాదు. ఆకర్షించే ప్రయత్నమూ అంత మంచిదికాదు. జరగవలసింది. ఆకర్షించడంకాదు ఆరాధించడం.

మాట్లాడుతున్నవానితోపాటు మిగిలినవారు కూడా తాము అనుకుంటున్నది తప్పు అని తెలుసుకుంటూ నాలుక కరుచుకున్నారు.

కొద్దిక్షణాల తర్వాత స్వామి ఇంకా ఇలా అన్నారు: ఆకర్షించడం అన్నది మనిషిలో దాగి ఉన్న స్వార్థాన్ని సూచిస్తుంది. ఆరాధించడం అన్నది మనిషిలో వెలుగుతున్న పరమార్థాన్ని సూచిస్తుంది. అవతలివ్యక్తినుండి ఏదయినా ఆశించి చేరదీసినప్పుడు అది ఆకర్షించడం అవుతుంది. అవతలి వ్యక్తి కూడా ఈ యజ్ఞార్థ కర్మలో పాలుపంచుకొని ధన్యత పొందాలని చేరదీసినప్పుడు అది ఆరాధన అవుతుంది. అందాకా ఎందుకు ? మీరందరూ ఇక్కడకు ఎలా చేరారు ? మిమ్మల్ని వీరంతా

ఆకర్షింపబడ్డారు అనవచ్చునా ? అలా అనబడడానికి మీరు అంగీ కరించగలరా ? మరి మిగిలినవారిని ఆకర్షించాలని మీరెలా అన గలుగుతున్నారు ?

నాకు తెలుసు, మీ మనస్సులోని ఉద్దేశం అది కాదని. తెలియకనే ఆ పదం అనేశారని. కాని తెలియకనే కూడా వాడ వలసిన పదంకాదది, అందుకనే ఇంతగా తెలియచెప్పవలసి వచ్చింది.

'ఇక యువకులు పెద్ద సంఖ్యలో చేరరావాలి అన్నది మీ కోరిక. అదెలా జరుగుతుందో వివరిస్తాను వినండి. ఇప్పటికి చేర వచ్చిన యువకులున్నారు కదా ! వారి విషయంలో మనం బాధ్య తపడి, వారిని తీర్చిదిద్దడమనేది జరిగినపుడు చేరవచ్చే యువ కుల సంఖ్య ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. అంటే మనం చేస్తున్న కృషికి ప్రకృతిమాత మెచ్చి మరింతమంది యువకులను మనకు అప్పచెబుతుంది. ఏమంటారు !

కనుక ఇప్పుడు మన కర్తవ్యం మన ఎదురుగానే ఉన్నది. ఎప్పుడైనా అంతే! ఎవరి కర్తవ్యం వారి ఎదురుగా ఉంటుంది. దానిని శ్రద్ధతో నిర్వహించినకొద్దీ మరిన్ని బాధ్యతలను అనగా లోకహిత కార్యక్రమాలను ప్రకృతిమాత వారికి అప్పగిస్తుంది. చేయవలసినదేమిటో అని ఎదురు చూడవలసినపనిలేదు. ఎదురుగా చూస్తేచాలు మనం చేయవలసినది మన ఎదుటనే ఉంచబడు తున్నదనీ, అది చేసినపుడే మరొకటి మనకు అప్పగించబడు తుందని మనం గుర్తించవలసి ఉంది.

కాబట్టి మనతో ఉంటున్న యువకులపై పు దృష్టిని పెట్టండి. వారిశక్తియుక్తులకు పదును పెట్టండి. వారిని అన్ని విధాలా ప్రయోజకులనుచేయండి. ఆత్మవిశ్వాసం కలిగి వాళ్ళకాళ్ళమీద వాళ్ళు నిలబడి తమకు, తమకుటుంబానికీ, ఈ సమాజానికీ పనికి వచ్చేవాళ్ళుగావారిని తీర్చిదిద్దండి. ఈ కృషిలో మనముంటగా అలా తీర్చిదిద్దబడవలసిన యువకులను ప్రకృతిమాతే పెద్ద సంఖ్యలో మన చెంతకు ప్రవేశపెడుతుంది.

చుట్టూ ఉన్న సోదరులందరూ స్వామిపైపు తృప్తిగా చూస్తున్నారు.

'బండిని ఏ మాత్రం పట్టాలు తప్పనివ్వదు మన స్వామి' అన్నట్లుగా ఉన్నాయి వారి చూపులు

విల్లునం ఎక్కు పెట్టండి

"ఈ మధ్య క్రొత్త బాధ్యతలు దిన చర్యను ఆక్రమించడంతో ఇక్కడకు అంతగా రాలేకపోతున్నాను. కాని మనసంతా ఇక్కడే ఉంటుంది. అవకాశం ఉన్నంతలో మీరు నాకప్పగించిన పనిని చేస్తూనే ఉన్నాను. కాని మరింతగా కార్యక్రమాల్లో పాలు పంచుకోలేకపోతున్నానే అన్న బాధ మనసుకు కలుగుతూనేఉంది, కాలమే మళ్ళీ వీలును కల్పించాలని ఎదురుచూస్తున్నాను." అంటూ సోదరబృందంలోని ఒకామె తమ పరిస్థితిని వివరించసాగారు.

కొద్దిక్షణాల నిశ్శబ్దం తర్వాత ఆ నిశ్శబ్దాన్ని శబ్దంగా రూపొందిస్తూ ఇలా అన్నారు స్వామి: 'నీకొక చిన్న సూక్ష్మం చెబుతాను. ఒకప్పుడు మన కార్యక్రమాలపై మనం ఎక్కువ సమయాన్ని వెచ్చించగలిగి ఉండవచ్చు. మరొకప్పుడు అనుకున్నంత సమయాన్ని వెచ్చించలేకపోవడం జరగవచ్చు. అయినప్పటికీ ఎల్లప్పుడూ ఒకే రకమయిన శ్రద్ధ మన ఉద్యమం ఎడల మనకుండాలి. శ్రద్ధ మానసికమైనది. అది వ్యక్తంకావడానికి ఏ అడ్డూ ఉండదు. భౌతికంగా అవకాశమున్న మేరకు వొళ్ళు దాచుకోకుండా పనిచేస్తూనే మానసికంగా నిరంతరమైన శ్రద్ధా, దీక్షలను మనం కలిగిఉండాలి. అలా మనం కలిగిఉన్నపుడు భౌతికంగా మనం కార్యక్రమంలో లేకపోయినా మన సంకల్పం ఆ కార్యక్రమానికి దోహదంచేస్తూనే ఉంటుంది. నీకు తెలుసునో తెలియదో !దినచర్యలో మనకిక్కడ పెద్దగా కనిపించకుండానే ఈ ఉద్యమం విశ్వవ్యాప్తం కావాలనీ, చిరకాలం వర్ధిల్లాలని దృఢంగా సంకల్పించి, కనబడకుండానే మనతో చేతులు కలుపుతున్నవారు ఎందరో ఉన్నారు. వారు గుర్తుకువచ్చినప్పుడల్లానాకనిపిస్తూఉంటుంది. 'వారందరిసంకల్ప బలమే ఈ సత్కర్మాచరణమనే యజ్ఞానికి తగిన వాతావరణాన్ని మనకు కల్పిస్తూ ఉన్నదని. కనుక సంకల్పం ముఖ్యం, సంకల్పమున్నపుడు పని చేసేటందుకు దారులుకూడా వాటికవిగా రూపుదిద్దుకుంటూనే ఉంటాయి.

ఇంకొకమాట చెప్పనా ? మానసికంగా ఉద్యమం ఎడల భక్తిశ్రద్ధలు దృఢ సంకల్పం లేకుండా మొహమాటానికో లేక ఏదైనా ప్రయోజనాన్ని ఆశించో రోజువారీ కార్యక్రమాల్లో నలుగురికి కనపడేటట్లు పాల్గొనేవారికన్నా నేను పైనచెప్పిన కేటగిరి

ఉన్నారే వాళ్ళవల్లే ఉద్యమానికి ఎక్కువ ప్రయోజనం చేకూరుతూ ఉంటుంది.

ఏతా, వాతా తేలిందేమంటే మానసికమైన కమిట్‌మెంట్ ముఖ్యం. ధృఢసంకల్పం అంటే ఇంగ్లీషులో మనమంటామే విల్ పవర్ అని. అది కలిగి ఉండడం ముఖ్యం. కనుక మనమెవరం ఎక్కడఉన్నా మనముద్దేశించిన ఉద్యమంకోసం మనలోని విల్లు (విల్)ను ఎక్కుపెట్టి ఉండటం ముఖ్యం. కనుక ఆ విల్లును ఎక్కుపెట్టండి.' అని ఆమెను ఆశీర్వదించిపంపారు స్వామి.

మార్చడం కాదిది మలచడం

ఇక్కడకు ఒక్కరోజు రాకపోయినా నాకేమిటోగా ఉంటుంది ఇక్కడకు వచ్చి కొంతసేపయినా పనిచేసివెళితే ప్రాణానికి ఏమిటో హాయిగా ఉంటుంది. ఒక్కొక్కపుడు అనిపిస్తొంటుంది నన్ను మీరెంతగా మార్చేశారాని!

అలా అంటున్న ఆమెవైపు చూస్తూ స్వామి ఇలా అన్నారు! ఇక్కడ మార్చడం ఉండదు. మలచడముంటుంది. శిలను శిల్పంగా తీర్చేదిద్దే శిల్పి ఏంచేస్తున్నాడు ? ఆ శిలను శిల్పంగా మలుస్తున్నాడు. ఇదీ అలాంటిదే. శిల్పంలో ఉన్నది కూడా శిలే. శిల్పి క్రొత్తగా తెచ్చిపెట్టింది ఏమీలేదు. కాని తన పనితనం వల్ల శిలను మలచిన శిల్పి ఆ శిల్పం నుండి ఎన్ని అందచందా లను ఒలికింపచేస్తున్నాడు. గురుశిష్య సంబంధం కూడా సరిగా అలాంటిదే !

ఒకప్పుడు నా విషయంలో అనుకున్న వారికి కూడా ఇదే జవాబు చెప్పాను. మాస్టరుగారి పరిచయం తర్వాత నన్ను చూసి 'మాస్టరుగారు మిమ్మల్నెంతగా మార్చేశారండి !' అనేవారు స్నేహితులు. ఇది మార్చబడటంకాదు. మలచబడటం అని జవాబు చెప్పేవాడిని ఎందువల్లనంటె మాస్టరుగారు ఏంచేస్తున్నా రన్నది నాకు తెలుసును కనుక ! ఆయన నా సిద్ధాంతాలను మార్చుకోమని నాకు చెప్పలేదు, తన సిద్ధాంతాలను ఏ మాత్రం నా మీద రుద్దలేదు. నా జీవితంలో నేనేం కావాలని కోరుకున్నానో అలారూపుధరించేటట్లుగా చేశారు. అది కూడా నా కోరిక మేరకు.

ఈ సందర్భాన్ని నాకిలా చెప్పాలనిపిస్తూ ఉంటుంది. దేశరక్షణ కోసం, తపనపడుతూ ముందుకుసాగుతున్న ఒక యువ కుని చేరదీసి, అతన్ని సైనికుడిగా తీర్చిదిద్ది, దేశాన్ని రక్షించు కోవడానికి కావలసిన ఆయుధ సామగ్రిని కూడా అతనికి ఇచ్చి, వెన్ను తట్టి పంపించడం ఎలాంటిదో సరిగా నా గురువు నా విష యమై చేసిందలాంటిదే. నాలో పెల్లుబుకుతున్న తపనకు కావల సిన శిక్షణ నిస్తున్నారు. జాతి పునర్నిర్మాణానికి పనికి వచ్చే ఉపకరణాల నిస్తున్నారు. ఆశించినదానిని సాధించగలగిన స్థితిలో నన్ను నిలబెడుతున్నారు. ఇప్పుడు చెప్పండి. దీన్ని మార్చడమంటారా ? మలచడమంటారా ?' అని నేను వాళ్ళకు చెప్పేవాడిని. అదే విషయం నీకు కూడా చెబుతున్నాను.

జరుగుతున్నది ఆమెకు బోధపడుతున్నది. ఆమె ఆ వెలు గునకు మరింత దగ్గరగా జరుగుతున్నట్లుగా కనబడుతున్నది.

అడుగు పెడితే అడుగు తగలాలి

చేసేది ఏదో పూర్తిగా చేయండి. దిగేది ఏదో పూర్తిగా దిగండి. అడుగు పెడితే అడుగు తగలాలి. అడుగు తగలకుండా మధ్యలో ఆగితే తెలియని అశాంతి ఏర్పడుతుంది. ఏమిటా ఇలా ఉంది ? అనిపిస్తుంది. ఇప్పుడేం చేయాలి ? అనిపిస్తుంది. ఏమీ చేయనక్కరలేదు. ఆ అడుగు క్రిందకు దింపండి. అడుగు తగులుతుంది. మీ అశాంతి తొలిగిపోతుంది. జీవితంలో పట్టుకుదురు తుంది. సగమిటు, సగమటుగా వద్దు. అది మరీ దుర్భరస్థితి. అటో ఇటో తేల్చుకొని మరీ దిగండి. పూర్తిగా అటున్నా, పూర్తిగా ఇటున్నా ఫరవాలేదు. మధ్యలో నిలబడి అటూ ఇటూ చూస్తున్న ప్పుడే ఇబ్బంది.

మీకీ పద్ధతి నచ్చిందీ నూటికి నూరుపాళ్ళూ దీనికి తగినట్లు ప్రవర్తించండి. నచ్చలేదూ ! నచ్చనట్టే ఉండిపొండి. అప్పుడు పెద్ద ఇబ్బంది ఏం ఉండదు. మధ్యలో మాత్రం నిలబడవద్దు. డైలమా అసలు వద్దు. కొంత నచ్చి కొంత నచ్చకపోయినా ఇబ్బందే. అంతా నచ్చికూడా నచ్చినట్లుగా బ్రతకడానికి సరైన ప్రయత్నం లేకపోయినా ఇబ్బందే. ఇది మనకు నచ్చిందీ అన్నప్పుడు దానికి తగిన ప్రయత్నం మననుండి జరగాలి నిరంతరం జరగాలి. మనం దాని వాశ్యముగా బ్రతకాలి.

మనం ఈ ఉద్యమానికి సంబంధించిన వాళ్ళం అను కున్నప్పుడు ఏ పనులైనా ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని చేయాలి. అది చిన్న పని అవనీయండి. పెద్దపని అవనీయండి. ఉద్యమానికి చిన్నా పెద్దా తారతమ్యంలేదు. ఉద్యమం అను మతించడాన్ని బట్టిమన జీవిత సన్నివేశాలన్నీ దూపుదిద్దు కోవాలి. అప్పుడే మనం ఉద్యమకారులం కాగల్గుతాం. అలా జరుగనినాడు మనకు మంచి ఉద్దేశం ఉంటుంది తప్ప అది మంచి ఉద్యమంగా రూపుకట్టదు, కనుక సోదరులారా ! ఉద్దేశం ఉద్యమ రూపం ధరించేవరకు మనం విశ్రమించకూడదు. అలా ఉద్యమరూపం ధరించేందుకుగాను మన జీవితాన్నే ఒక దీక్షగా స్వీకరించవలసి ఉంటుంది.' అంటూ స్వామి ప్రబోధించారు సోదర బృందసమావేశంలో ఒకసారి.

'శ్రద్ధయా వర్ధతే విద్యా'

లోకంలో ఒక నానుడి ఉంది. 'స్పర్ధయా వర్ధతే విద్యా' అని. స్పర్ధ వలన విద్య వృద్ధిపొందుతుంది అని అర్థం. అంటే ఒకరి ఎడల ఒకరికి స్పర్ధ కలగడంతో పోటీపడి, కృషిచేసి [illegible] సువులైన వాళ్ళు ఆయా విద్యలలో రాటు తేలుతున్నారని దీని భావం. అంటే కాంపిటీషన్ అనేది ఏర్పడటం వృద్ధిలోనికి రావటానికి కారణమవుతోందని దీనిలోని భావన. మామూలుగా చూస్తే ఇది నిజమేననిపిస్తుంది. కొంచెం లోతులకు వెళ్ళి చూస్తే దానికన్న మంచి దారి ఒకటి కనబడుతుంది.

పోటీపడే స్వభావం కలిగి ఉండటం వలన విద్యలలో రాటుదేలవచ్చుగాని అవతల వ్యక్తులపైన రాగ ద్వేషాలు కూడా అదే సమయంలో పెరుగుతున్నాయన్న సత్యం మనం మర్చిపోకూడదు. దీనితో ఇప్పటి కాలేజీలూ, విశ్వవిద్యాలయాల్లో కూడా ఒక విద్యార్థిని మరొక విద్యార్థి పరాయిగా చూడటం ఒకళ్ళ నోట్సులు ఒకరికి చూపించక పోవడం తోటి విద్యార్థులు పడుకునేవరకు వాళ్ళకు కబుర్లు చెప్పి, అప్పుడు వచ్చి కూర్చొని తాను చదువుకోవడం ఇట్లాంటిలక్షణాలన్ని వస్తున్నాయన్నమాట. లైబ్రరీ పుస్తకాలు ఇంకొకరికి దొరకనీయక పోవటం, ఆ పుస్తకాలలోని కొన్ని చాప్టర్స్‌ని చింపేసుకొని పోవటం మొదలైన

అవలక్షణాలు కూడ ఎన్నో వ్యక్తిత్వానికి ఒక రూపు దిద్దుకోవలసిన ఆ వయస్సులో ఏర్పడుతున్నాయి.

అలాకాక ఇంకొకదారి ఉన్నది అని చెప్పాను కదా! దాన్ని వివరిస్తాను చూడండి. ఈ విద్యను మనం శ్రద్ధతో అభ్యసించాలి. నేర్చిన విద్యతో ఈ లోకాన్ని మనం సేవించాలి. అన్న భావంతో విద్యను సమీపించడం జరగాలి. ఎప్పుడైతే లోకహితానికి ఉపయోగిస్తాము అన్న ప్రమాణం మనం మానసికంగా చేస్తున్నామో, అప్పుడు ఆ విద్య మనకు అరచేతి ఉసిరికం అవుతుంది. అనగా మనలను అనుగ్రహిస్తుంది. మనను ఉపాధిగా స్వీకరించి, అది వెలుగై వెలుగుతుంది. కనుక సోదరులారా! విద్య ఎడల పవిత్రమైన భావనను కలిగి ఉండండి. నిరంతరమైన శ్రద్ధతో ఆ విద్యను అభ్యసించండి. అభ్యసించడంలో ఎంత శ్రద్ధ పెడుతున్నారో దానిని సద్వినియోగం చేయడంలోను అంతగానూ శ్రద్ధ పెట్టండి. స్పర్ధయా అన్న స్థానంలో శ్రద్ధయా అని వ్రాసుకోండి. అప్పుడు శ్రద్ధయా వర్ధతే విద్యా అన్నది మన మంత్రమవుతుంది. అంటూ సరిదారి చూపారు స్వామి సోదర బృందానికి ఒకానొక ప్రసంగంలో.

3. మాటల వైద్యం - మాత్రల వైద్యం

1. అవ- యావ
2. కంపెనీ సేక్-కంపెనీషేక్
3. చుట్టపెడితే-చుట్టబెడుతుంది.
4. సరదా-జరదా.
5. జ్వరంకాదది వరం
6. కురుపులు కావవి తలుపులు
7. కలవరంగా ఉందా ! కల వరంగా ఉందా !
8. తరిగితే-తరుగుతుంది.
9. చెప్పమని చెప్పాడు.
10. బార్లీనీళ్ళు-బార్లోనీళ్ళు.
11. అవసరాన్ని గమనించగలం- అలసత్వాన్ని గౌరవించలేం.
12. ఆ పదం పనికిరాదు.

ఆవ - యావ

తనకు మందు వ్రాసిన తరువాతకూడా ఒకామె వెళ్ళబోతూ మళ్ళీ ఆగింది.

'ఏమిటన్నట్లుచూశారుస్వామి
కొత్తిమీర తినవచ్చునాండి? అన్నదామె
మితిమీరి తినకూడదు'అన్నారుస్వామి.
'ఆవ తగలవచ్చునాండి'? మళ్ళీ అడిగిందామె.
'ఆవపై యావ పనికిరాదు'. అని చెప్పారుస్వామి.
'మరి అల్లం ?' అన్నదామె క్వశ్చన్ మార్కు ముఖంపెట్టి
'బెల్లంతో కలుపుకుంటే పరవాలేదు' అన్నారుస్వామి.
'ములగకాడ' అన్నదామె అదేమార్కు ముఖంతో.
'మునిగిపోయిందిలేదు. ఇదివరకు నిన్ను ఇబ్బంది పెట్టక పోతే ఇప్పుడూ తీసుకోవచ్చు'
'ఇంకేమయినా కావాలా'? అన్నట్లు చూశారుస్వామి
'సరిపోయింది' అన్నట్లు నవ్వుతూ సాగిపోయిందామె.

కంపెనీ సేక్ - కంపెనీ షేక్

పేషంటుగా కూర్చున్నాయన ఒక బ్యాంకు మేనేజరు శ్రద్ధగా మందుపుచ్చుకుందామనే ప్రయత్నంలో ఉన్నవాడు. మందు వ్రాయటం పూర్తయింది.

'మాష్టరుగారూ ! ఎగ్ తీసుకోవచ్చునాండీ' ? అని అడిగాడాయన.

'ఎగ్, తీసుకోవచ్చు ఫరవాలేదు. కాని పెగ్ మాత్రం తీసుకోకూడదు ప్రమాదం ఉంది''. అన్నారుస్వామి.

ఆయన కొంచెం షాక్ తిన్నట్లయ్యాడు. ముఖం కొంచెం వివర్ణమయింది. తనకు పెగ్ అలవాటు ఉన్నదన్న విషయం మాష్టరుగారు ఇట్టే పట్టేశారే అనుకుని సిగ్గుతో తలదించుకున్నాడు.

'క్షమించండి మాష్టారూ ! చేసినపాపం చెబితే పోతుంది. నాకు విడిగా అలవాటులేదుకానీ ఎప్పుడైనా కంపెనిసేక్ పుచ్చుకుంటుండేవాడిని. మనమందు మొదలుపెట్టిన తరువాత మానేసే ప్రయత్నంలో ఉన్నాను. ఇప్పుడు మీ నోటినుండి వచ్చిన మాటతో ఇక మానేస్తున్నాను, ఎగ్ కూడా మీరు తీసుకోమంటేనే తీసుకుంటాను. మరీ అంత ఇదేంలేదు'. అన్నాడాయన.

స్వామి ఇలా అన్నారు. 'చూడండీ మీరు తప్పదని కంపెనీ సేక్‌కని తీసుకున్నా ఈ కంపెనీ అంటే మనబాడీషేక్ అయిపోతుంది సుమా ! అందుకనే దానిని వదిలేయండి. ఇక గ్రుడ్డు అంటారా ఉడికిన గ్రుడ్లవరకూ శుభ్రంగాతినవచ్చు. మసాలాలు మాత్రం తగలనియవద్దు'. అంటూ ఆయనను వెన్నుతట్టిసాగనంపారు.

చుట్టబెడితే-చుట్టబెడుతుంది

అది విశాఖలోని డిస్పెన్సరీ, ఎదురుగా ఒక జాలరతను పేషెంట్‌గా కూర్చునిఉన్నాడు.

మందు వ్రాయడం పూర్తయింది.

'నీకు చుట్ట అలవాటుందా' ? అడిగారుస్వామి.

'ఉందండి' అన్నాడతను.

'చుట్టనీకు చుట్టమైనా, ఈ మందుకు అది శత్రువే మరి' ! అన్నారు స్వామి.

'చెప్పినారండి. ఏం చేస్తామండి'. చుట్టమానేస్తామండీ అన్నాడతను.

'ఏమంటున్నావ్ ? చుట్టమానేస్తామనా ? చుట్టమా'నేస్తమనా అడిగారు స్వామి.

కొద్దిక్షణాలకుగాని ఆ మాటలలోని విరుపు అతనికి బోధపడలేదు. బోధపడగానే మాత్రం నవ్వునాపుకోలేకపోయాడు. 'బలేవారండి మీరన్నట్టు నేస్తమే అనుకోండి. ఏంచేస్తాం. మానేస్తాను. అయ్యా; బాధ తగ్గాలిగదండీమరి. మాగురించే కదండీ మీరు చెప్తా. చెప్పింది చెప్పినట్టు ఇనుకోవాలి కదండీ. అంతే గదండిమరి, అన్నాడతను వినమ్రతతో.

కొన్నిక్షణాలు గడిచాయి. అతనికేదో అనిపించినట్లుంది. 'బాబయ్యా ! మధ్యలో ఏదన్నా పొరబాటున నోట చుట్టపెడితే

ఏమవుతుంది ? ఊరికే తెలుసుకుందామని అడుగుతున్నా అంతే'. అన్నాడతను.

'ఏమిటీ ? ఎప్పుడైనా చుట్టపెడితే ఏమవుతుందనా ? మళ్ళీ మధ్యలో ఎప్పుడన్నా చుట్టపెట్టావో వ్యాధి మొత్తం చుట్టపెట్టిందన్న మాటే ! నువ్వు చుట్టపెడితే అదీ చుట్టపెడుతుంది. ఇదిగో తాతా ! సకసలే గంగమీద పెంగేవో ! చేపకూడా తగలకూడదు సుమా! మందు పుచ్చుకునే అలవాటుంటే అదీ మానేయాలి' అన్నారు స్వామి.

ఇయన్నీ ఇందాక సెప్పినారండి. అన్నింటికీ అప్పుడునే మందుకొచ్చినానండి. ఏదో బాబయ్యా ! నీ సేతిసలువ. ఈ బాధ నుంచి బైటపడేయండి. అంతేశాన. మా దండాలందుకోండి. మరి సెలవిచ్చిత్తాను' అంటూశలవు తీసుకున్నాడతను.

సరదా - జరదా

ఒక నడివయస్కుడు మందు వ్రాయడం అయిపోయిన తర్వాతకూడా ఇంకా ఏదో నాన్చుతున్నట్లుగా ఉన్నాడు. అవతలింకా చూడబడవలసినవాళ్ళు చాలామంది ఉన్నారు.

'ఏమిటి !' అన్నట్లు చూశారు స్వామి.

'మందు వాడుతుండగా వక్కతగలవచ్చునాండి ?' అన్నాడతను.

'వక్క ఒక్కటే అయితే వాడవచ్చు. బజారులో దొరికే వక్కపొడి అయితే మాత్రం ఆలోచించాల్సిందే !'

వివరణ కావాలన్నట్లు చూశాడతను.

'మరివాటిల్లో సుగంధద్రవ్యాలు తగులుతాయికదా !

ఘాటైన రుచులు, వాసనలు, ఈ మందుకు పనికిరావుకదా! అన్నారు స్వామి.

'మరి కిళ్ళీ సంగతండి' అన్నాడతను.

ఏం కిళ్ళీ ? సరదానా ? జరదానా ? సరదా అయితే వేసుకో వచ్చు. అదైనా ఎప్పుడన్నా జరదా మాత్రం పనికిరాదు. అన్నారు స్వామి.

తలఊపుతూ, నవ్వుకుంటూ సాగిపోయాడతను.

జ్వరం కాదది వరం

పిల్లవాడికి ఉన్నట్టుండి జ్వరమొచ్చేసిందేమిటండీ. అన్నాడొక నడివయస్కుడు.

'జ్వరం కాదయ్యా అది వరం ! ఎన్నాళ్ళనుండి అణగద్రొక్కబడి ఉందో అది లోపల, ఇప్పుడు బయటకు వస్తోంది. అంటే పట్టినగ్రహణం విడుస్తోందన్నమాట. ఇది సంతోషించవలసినవిషయం. ఫీవర్ ఇట్ ఈజ్ ఫర్ అవర్ ఫేవర్. అన్నారు స్వామి.

'అమ్మయ్యా ! ఇప్పుడు ధైర్యమొచ్చిందండి. ఏమిటో అనుకున్నాను నేను. ఇచ్చినమందు వేస్తాననుకోండి. మరి ఆహారమేమి పెట్టమన్నారు ? అన్నాడు అతడు.

'ఏముంది జ్వరం తగ్గేంతవరకు బ్రెడ్ అండ్ బెడ్ అంతే'! అన్నారుస్వామి.

అతడు నవ్వుకుంటూ సాగిపోయాడు.

కురుపులు కావవి-తలుపులు

'ఏమిటి మాస్టారూ ! ఈ కురుపులెంతటికీ తగ్గటంలేదు. ఒక ప్రక్క తగ్గాయనుకుంటే, ఇంకో ప్రక్క వచ్చేస్తున్నాయ్. ఈ రెండు రోజులు నిదానించాయి. అనుకుంటే వచ్చే రెండు రోజులు అవి విజృంభిస్తున్నాయి. వాటికిక అంతం లేదంటారా' తట్టుకోవడం కష్టంగా ఉంది. బయట తిరగడం కూడా కష్టంగా ఉంది వీటితో అంటూ దీనంగా చెప్పాడొక యువకుడు.

'కొంచెం ఓర్పు పట్టాలి తప్పదు. కొంతకాలంపాటు అవి అలా వస్తూ పోతూనే ఉంటాయి. నీకు ఎలాంటి దారుణమైన వ్యాధి తగ్గిందో గుర్తుందికదా ! అన్నారుస్వామి.

ఎంతమాట మాస్టారూ ! ప్రాణం పోసి మళ్ళీనన్ను నిలబెట్టారండి. అసలా ఆస్త్మా ఈ జన్మకు తగ్గుతుందనుకోలేదు. తగ్గుతుందని ఏ డాక్టరూ చెప్పలేదుకూడా. అట్లాంటిది మీ చేతి చలువవల్ల తగ్గిపోయింది. ఇక కురుపులొకటున్నాయంతే. ఇవి కూడాతగ్గిపోతే ఇక నేను బయటపడిపోయినట్లే అన్నాడతను.

స్వామి ఇలా అన్నారు: ఆస్త్మాలాంటి దారుణవేదనలు తగ్గినపుడు ఈ కురుపులులాంటి రూపంలో ఆ చెడంతా బహిష్కరింపబడకతప్పదు. అది అవసరం కూడాను. ఈ కురుపులు కురుపులు కావు. వ్యాధితాను వెళ్ళిపోయేటందుకుగాను తెరుచుకుంటున్న తలుపులు, వ్యాధివెళ్ళిపోంగానే ఈ తలుపులు వాటికవిగా మూసుకుపోతాయి. అప్పుడిక నీకు తిరుగుండదు.

ఇప్పుడు బరువంతా దిగిపోయింది మాస్టారూ ! మీతో ఇలా కాసేపు మాట్లాడే అవకాశం దొరికితేచాలు. నేనెంతో హాయిని ఫీల వుతూ ఉంటాను.' అంటూ నమస్కరించి శెలవు తీసుకున్నా డతను.

కలవరంగా ఉందా ? - కల వరంగా ఉందా ?

'ఈ మధ్య రోజూ ఏదో ఒక కల వస్తోంది మాస్టారూ.' అన్నాడొక యువకుడు.

'అలాగా కలవరంగా ఉందా ? కల వరంగా ఉందా ?' అన్నారుస్వామి.

కొన్నిక్షణాలకుగాని యువకుడి పెదవులు విచ్చుకోలేదు. విచ్చుకున్న తర్వాత అవి ఇక ఆగలేదు. నవ్వుతూనే ఉన్నాయి. మరీనవ్వితే బాగుండదని మర్యాదకోసం ఆపు చేసుకుంటున్నా డతను.

'కల వరంగా లేదండీ ! కలవరంగానేఉంది. అందుకే మీకు చెప్పాల్సివచ్చింది' అన్నాడతడు నవ్వుకుంటూనే.

'అలాగా ! మరో వారం రోజుల్లో అన్నీ సర్దుకుంటాయిలే' అని ధైర్యం చెప్పి పంపించారు స్వామి.

తరిగితే - తరుగుతుంది

పనిపూర్తయిపోయిన తర్వాతకూడా ఒకామె అలా నిలబడి ఉంది.

'ఏమిటి' ? అన్నట్లు చూశారు స్వామి.

''ఉల్లిపాయలసలు తగలకూడదాండి.'' అడిగిందామె

'మీకు తగలకూడదు. మీరు తరగకూడదుకూడాను. అన్నారు స్వామి.

'తరగకూడదు కూడానాండి ! తరిగితే ఏమవుతుందండీ !

'తరిగితే మందు యాక్షన్ కూడా తరిగిపోతుంది.'

'మరి మార్గమేమిటండి ?'

'తినడమే కాకుండా కొనడంకూడా మానెయ్యాలి మీరు !

'అంతేనంటారాండి'?

'ఏమిటమ్మా ఇంత మాత్రానికే అంత బాధపడి పడిపోతున్నావు. కొంపలు మునిగిపోతున్నట్లుగా మరి ఆ ఇంగ్లీషు మందుల వాళ్ళు పంచదార మానేయమంటారు. ఉప్పుమానేయమంటారు. అన్నం మానేయమంటారు. క్రమంగా అన్నీ మానేయమంటారు. మరి అప్పుడేం చేస్తారు ? అందుకనే కంగారు పడకు, ఇక్కడ ప్రాణావసరాలేవి మాననమనడంలేదు. సహజమైన రుచులను మేము కాదనడంలేదు. ఉల్లిలాంటి ఘాటైన పదార్థాలను మాత్రమే వదిలేయమంటున్నాము. ఇంత ఘాటుగా చెబితే గాని వదిలేటట్టులేరు మీరు.

'ఎంతకాలం మానేయాలంటారండీ !'

బలేదానివమ్మా ! నీకు శివలింగాన్ని చూసినా ఉల్లిపాయే జ్ఞాపకమొచ్చేట్టుంది. ఎంతకాలమేమిటి ? ఈ మందు వాడుతు న్నంతకాలం. మళ్ళీ నేను తినమని చెప్పేటంతవరకు మీరు తిన గూడదు ముట్టకూడదు.

కొంతమంది ఉడికినదైతే తినొచ్చు.... అంటారు కదండి.

అది ఆ కొంతమందికి సంబంధించిన విషయం. అప్పుడు నువ్వు మందు ఆ కొంతమంది దగ్గరే పుచ్చుకోవాల్సి ఉంటుంది. ఇక్కడావప్పలేం ఉడకవు. అదిసరేగాని ఉల్లిపాయంటే నీకు అంత ప్రేమేమిటి ? మానమని చెప్పినందుకు చాలా విరహాన్ని అనుభవిస్తున్నట్లున్నావ్. నీకు ఉల్లివిరహం చాలా ఉన్నట్లుంది సుమా !' అంటూ నవ్వించి పంపించేశారు స్వామి.

చెప్పమని చెప్పారు

'ఈ నెలలో మీరు మందుకొచ్చినట్లుగాలేరు' అడిగారు స్వామి

'నేను ఈ మధ్య ఊరువెళ్ళానండి. ఆ విషయం మీకు చెప్పమనికూడ ఇంట్లో చెప్పాను. వాళ్ళు చెప్పారనే అనుకు న్నాను' అన్నాడాయన.

చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారుస్వామి: 'బాగుంది. మీరు చెప్పమని చెప్పారు. వాళ్ళు చెప్పమని చెప్పారు. కాక పోతే సైలెంట్‌గా, ఆమాత్రం మీరు అర్థం చేసుకోబోతేఎలా? మీరు చెప్పబోయేముందు ఎవరి శ్రద్ధ ఎంతవరకో చూసుకుని మరీ చెప్పాలి.' అని చిన్నగా మందలిస్తూ మందులిచ్చారు స్వామి.

బార్లీనీళ్లు - బార్లోనీళ్ళు

విశాఖలోని సంస్థ కార్యాలయంలో ఉదయంవేళ డిస్పె న్సరీ జరుగుతూఉంది. యూనివర్సిటీ విద్యార్థులిద్దరు మందుకని వచ్చారు. అందులో ఒకరు పేషెంట్. ఒకరు అతనికితోడు.

'ఎలా ఉంది' ? అని అడిగారుస్వామి.

'ఇవాళ్టికి నార్మల్‌కి వచ్చిందండి. మొత్తంమ్మీద నాల్గు రోజులుపట్టింది' అన్నాడతడు.

'ఈ నాల్గురోజులు ఆహారం ఏం తీసుకున్నావేమిటి ? అడి గారు స్వామి.

'హస్టల్‌లో ఉంటే సాగదని మా బంధువుల ఇంటికి వెళ్ళాను. మూడుపూటలా బార్లీనీళ్ళు త్రాగుతూకాలం గడిపాను. అన్నాడతను వినమ్రంగ.

స్వామి చిరునవ్వు నవ్వుతూ, 'నీలాంటి విద్యార్థులంతా బార్‌లో నీళ్ళకు ఎగబడుతున్న రోజులివి, నువ్వొకాలా మంచి వాడవయ్యా బార్లీ నీళ్ళతో సరిపెట్టుకున్నావు.' అన్నారు.

ఆ యువకులిద్దరూ నవ్వుకున్నారు.

'ఈపూట సత్యం తినమంటారాండి ?'' అడిగాడతను

'ఏం వేసుకు తింటావ్ ? అడిగారు స్వామి.

బీరకాయతో తినవచ్చాండి ? అన్నాడతను. తినమంటారో లేదో అన్నట్లుగా.

బాగుందయ్యా ! నీలాంటి కుర్రాళ్ళందరు నిస్సందేహంగా బీరకాయలు పట్టుకుని బజార్లలో షికార్లు చేస్తున్నరోజులలో నువ్వు బీరకాయతో తినొచ్చాండి ? అని భయపడుతూ, భయపడుతూ అడుగుతున్నావు. బాగుంది నీలాంటి కుర్రవాళ్ళ సంఖ్య పెరిగితే ఇంకా బాగుంటుంది.

అందరూ ఒకలాగే ఉండరు కాదండీ ! మాస్టరుగారూ ! అన్నాడు అ కుర్రవాడితో వచ్చిన మిత్రుడు,

'నిజమే నివన్నది. ఎప్పుడూ అన్ని రకాల వాళ్ళూ ఉంటారు. ఏ రకం వాళ్ళు ఎక్కువ సంఖ్యలో ఉంటారో వారి పేరిట మిగిలిన వాళ్ళుకూడా చెలామణీ కావలసి వస్తోంది. ఏమంటారు ! యువకులంతా చెడిపోయారని ఎవరైనా అన్నారనుకో నిజంగా అంతా చెడిపోయారనా ? వాళ్ళ ఉద్దేశం. ఎక్కువమంది చెడిపోయారని. మెజారిటీ వాళ్ళదని. ఇప్పుడు నేను కోరేదేమిటంటే మీలాంటి వాళ్ళది మెజారిటీ కావాలని.' అన్నారు స్వామి.

'మీలాంటివాళ్ళు పూనుకున్న తర్వాత అది ఎలాగూ జరుగుతుందండీ !' అంటూ నమస్కరించారు ఆ ఇద్దరూ.

అవసరాన్ని గమనించగలం - అలసత్వాన్ని గౌరవించలేం

'మాస్టరుగారూ ! చిన్నమాట ఈ మధ్య మా వాళ్ళు రెండు మూడుసార్లు లేటుగా వచ్చారు. అలా వచ్చినందుకు ఇక్కడి వాళ్ళు మందలించారట. ఒక సందర్భంలో మీరుకూడ గట్టిగా మందలించారని చెప్పారు. ఇలా అంటున్నానని మీరేమీ అనుకోకండి. ఇది వైద్యాలయంకదా ! ఇక్కడ కూడా ఆలశ్యమైదంటే ఎలా ? వేళలు ఇంకెవరికైనా పెట్టవచ్చుగాని పేషెంట్లను కూడా పాటించమంటే ఎలా ? కొంచెం ముందు వెనకా అయినా సర్దుకుపోవడం మంచిదేమోఅనుకుంటాను. ఏమంటారు? అన్నాడొకాయన.

సూటిగా చూస్తూ స్వామి ఇలా అన్నారు: నిజమైన కారణముండి ఆలశ్యంగా రావడం జరిగితే ఇక్కడివాళ్ళు తప్పక అర్థం చేసుకుంటారు. ప్రాణవిపత్కర పరిస్థితులు ఏర్పడినవేళ అసలు వేళలే పట్టించుకోరు. ఇక ఎటొచ్చీ తీరి ఆలశ్యంగా వస్తున్న వాళ్ళతోనే వస్తుంది ఇబ్బంది. నిజంగా వాళ్ళురావాలీ అనుకుంటే రాగలరు. కాని అలా అనుకోవడానికి బద్ధకిస్తున్నారు, వాళ్ళు, బద్ధకించీ, ఇది వైద్యాలయంకదా ఇక్కడకూడా వేళలు పెడితే ఎలా ? అని లా పాయింటు తీస్తున్నారు. అలా పాయింట్ తీస్తే ఎలా చెప్పండి. అలాంటప్పుడు ఆ పాయింట్స్ పట్టించుకోకుండా మా అపాయింట్మెంట్స్ ప్రకారం మేం వెళ్ళిపోతుంటాం.

చూడండి ఏ పనికయినా ఓ పద్ధతి ఉండాలి. కొన్ని వేళలుండాలి. అది తప్పదు. ఒక వేళంటూ పెట్టాము కాబట్టి ఆ వేళకు వెళితే మాస్టరుగారు దొరుకుతారని మీరొస్తున్నారు. ఇలా వేళలు లేవనుకోండి మీరెప్పుడని వస్తారు ? నేనెప్పుడని చూస్తాను ? ఇక అది లాటరీ వ్యవహారంలా ఉంటుంది. అలా అస్తవ్యస్తంగా నడిపేకన్నా వేళలను పాటించడమే సర్వదా శ్రేయస్కరం. నేను మొదటే చెప్పాను మీకు నిజమైనకారణముండి లేటయిన వారిని ఇక్కడివారు అర్థంచేసుకుంటారు. మీరేమీ అనుకోకండి. నేనిలా చెబుతున్నానని. నేను అవసరాన్ని గమనించగలను. కాని అలసత్వాన్ని గౌరవించలేను. అందుకనే ఎందరు ఈ పాయింట్ మీద స్ట్రెస్ ఇచ్చినా నేను రాజీపడటంలేదు. ఇది సేవాసంస్థ మాత్రమేకాదు. శిక్షణ సంస్థకూడా ! అది మీరు మరచిపోకూడదు మీ ఆరోగ్యాలు చక్కదిద్దబడటమేగాదు. మీ వ్యక్తిత్వాలు కూడా తీర్చిదిద్దబడాలి ఏమంటారు ?

అవతలివ్యక్తికి మాటలాడటానికి ఇంకేం మిగిలింది ? అతడు మెల్లగా అన్నివిధాలా సర్దుకున్నాడనివేరుగా చెప్పనక్కర లేదుకదా !

ఆ మందం పనికిరాదు

స్వామికి ఎదురుగా ఒక తల్లీ కూతుళ్ళు కూర్చొని ఉన్నారు. ఆ కూతురివడిలో ఒకపాప ఉన్నది. ఆ కూతురికి కూతురన్న మాట తల్లీ బిడ్డల విషయంలో ఎలాంటి జాగరూకతలు తీసుకోవాలని అడిగి తెలుసుకుంటోంది ఆ పెద్దతల్లి.

'మాస్టరుగారూ ! ఈ బాబుకి గ్రైప్‌వాటర్ పట్టమంటారా ?' అడిగిందామె.

'అటువంటివేం అవసరం లేదు.' అన్నారు స్వామి. ఒక్క క్షణమాగి వాటివల్ల జీర్ణకోశం దెబ్బతినిపోయే ప్రమాదముంది' అన్నారాయన.

'మరి ఆముదం మాటేమిటి ? ఇప్పటి డాక్టర్లేమో ఆముదం పనికిరాదు అంటున్నారు.' అన్నదామె.

'ఆముదం పనికి రాదన్నారా ! వాళ్ళకు ఆ మందం పనికి రాదు, అని నేనన్నానని చెప్పు' అన్నారు స్వామి.

ఆమె నవ్వుకుంది. ఆ కూతురు నవ్వింది. కూతురు కూతురు కూడా నవ్వింది నాకూ నవ్వొస్తోందన్నట్లుగా.

స్వామి ఇలా వివరించారు : మీరు చెప్పండి. మీ తల్లిదండ్రులు మీకు ఆముదం పెట్టారాలేదా ? మీ అమ్మాయికి మీరు ఆముదం పెట్టారా లేదా ? మరి మీ తరం వరకూ నడచి వచ్చిన సంప్రదాయాన్ని మీరెందుకు వదులుకోవాలి. వదులుకోవలసిన

అవసరమేమొచ్చిందీ ? వైద్యులు చెబుతున్నారు గనుక. అంతేనా ? ఆ వైద్యులది ఇంగ్లీషువాళ్ళ చదువు. ఆ ఇంగ్లీషు వాళ్ళకు ఆముదం సంగతి తెలియదు. తెలియనివాళ్ళు తెలియనట్లూరుకోవాలి. తెలిసినట్లు ఏదో చెప్పడం ఎందుకు ! ఈ డాక్టర్లు గుర్తుకుతెచ్చుకోవాల్సిందేమంటే, వాళ్ళ తల్లులు కూడా వాళ్ళకు ఆముదం పెట్టారని.

సత్యం గమనించినపుడు తెలిసేదేమిటంటే ఆముదం పెద్దవాళ్ళల్లో విరేచనకారి మాత్రమే. అదే చిన్నపిల్లల్లో దాని కథ వేరు. పెద్దల సంప్రదాయం ప్రకారం ఆముదం పెట్టటంవల్ల పిల్లల్లో సకల అవయవాలు సమపాళ్ళల్లో ఎదుగుతాయి. అన్నమయ, ప్రాణమయ, మనోమయ కోశాలకు ఆ ఎదిగే వయస్సులో ఆముదం వల్ల చక్కటి అనుసంధానం కుదురుతుంది. ఆ కోశాలన్నీ చక్కగా వికసించి శక్తిమంతమౌతాయి. ఈ సూక్ష్మాంశాలన్నీ తెలియక ఆముదాన్ని కనుక కేవలం విరోచనకారిగా భావించి, పెట్టడం మానేస్తే ఎదుగుదలలో ఎగుడు దిగుడులొచ్చే అవకాశముంది. వివిధ ప్రజ్ఞల వికాసంలో ఒడిదుడుకులు వచ్చే అవకాశం కూడ ఉంది. కొందరు 'క్రాక్స్'గా రూపొంద వచ్చు. అందువల్ల అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఆముదాన్ని పట్టడమే మంచిది. ఇక మిగతావాటినిక్కులవీ అంటారా ? అత్యవసర పరిస్థితులలో తప్ప అవి అనవసరం.

మీరు చెప్పినట్లుగానే నడుచుకుంటాము అన్నట్లుగా తలలు ఊపారువాళ్ళు.

అవునూ ! స్వామి వాక్కుకు తల ఊపనిదెవరు ?

4. సమాజము - సంస్కరణ

1. పాలన-పాలణా
2. పిండిపాలు-నీళ్ళపాలు
3. ఆర్థికంకాదు-పారమార్థికం.
4. పిడివాదం-దోపిడివాదం.
5. చెడిపోవడంకాదది- చెదిరిపోవడం.
6. భయపడకండి-బాటలోనడవండి.
7. శ్రమపడకండి-కృషిచేయండి.
8. ఎదురు చూడకండి-ఎదురుగా చూడండి.
9. ఊహించకండి-జీవించండి.

పాలన - పాలణా

ఏమిటి అరాచక పరిస్థితి. అసలు పరిపాలన అనేది ఈ దేశంలో ఉన్నదంటారా ! అయినకాడికి గుంజుకోవడమే కన బడుతోంది. అన్నీ అమ్ముకోవడమే. ఉద్యోగాల దగ్గరనుండి లైసెన్స్‌ల వరకూ అన్నీ అమ్ముకోవడమే. ఎలక్షన్లలో వెదజల్లిన దానికి వేయింతలుగా సంపాదించడానికి. కానిమార్గాలను అదే పనిగా వెతకటమే ! ఇదేనా పాలన ?

చిరునవ్వుతో స్వామి ఇలా అన్నారు: మీరు సహృదయులు కనుక ఇంకా బాధపడుతున్నారు. ఈ స్వతంత్ర భారతదేశంలో కుతంత్రంపెరిగింది. పాలన అన్నది కనుమరుగై చాలాకాల మైంది. ఇప్పుడు ఈ దేశంలో ఎక్కువచోట్లకనబడేది పాలనకాదు. పాలణా ! ఎవరికివారు తమ పాలుగాలభించవలసిన అణాకోసం తంటాలుపడుతూ ఉండటమే నేడు కనబడుతూ ఉన్నది.

చూడండీ ! ఇవాళ ఈ దేశంలో పాలన కూడా ఒక వ్యాపారం, గెలవడానికి కొంత ఖర్చుపెడుతున్నారు. అది ఈ వ్యాపారానికి పెట్టుబడి అన్నమాట. గెలచిన తర్వాత వేయింతలు సంపాదిస్తున్నారు. అది ఆ పెట్టుబడిమీద లాభాలు తీయడ మన్నమాట.

చూస్తుంటే అసలు ఈ దేశంలో వ్యాపారం కానిదంటూ ఏదయినా ఉన్నదా అనిపిస్తున్నది. చదువు వ్యాపారం. ఉద్యోగం వ్యాపారం. పెళ్ళి వ్యాపారం. పిల్లలు వ్యాపారం. దేశంలోని పాలనే వ్యాపారమయినప్పుడు పాలనలోనిభాగాలన్నీ వ్యాపారంకావడంలో ఆశ్చర్యమేముందీ ! సర్వం విష్ణుమయం

కాదిప్పుడు సర్వం వ్యాపారమయం ! ఒకప్పుడు వ్యాపారాన్ని కూడా ధర్మదృష్టితోచేసిన జాతిమనది. ఇప్పుడుధర్మాన్ని కూడా వ్యాపారదృష్టితో నడిపించబూనిన ప్రగతిమనది.

ఇంతబాధలోనుండీ అవతలిసోదరులు కొంత నవ్వారు. మీరు ఎంత బాధలోనున్నవారినయినా, ఆ బాధలోనుండే నవ్వించ గలరు అన్నట్లుగా.

'అవును నవ్వుతూ చూసినప్పుడే ఎంతటి బాధకయినా పరి ష్కారందొరుకుతుంది ! అన్నట్లు చూస్తున్నారు స్వామి.

పిండిపాలు - నీళ్లపాలు

'బాబూ పాలండీ' ! అంటూ నిలబడలేక నిలబడ్డాడు గుమ్మంముందు పాలవాడు.

'పిండిపాలా, పిండినపాలా ! లోననుండి అడిగాడు ఇంటా యన కొంచెం కొంటెగా.

'అయ్యో ! పిండియున్నపాలండీ ! మీరింకొక క్షణంలో ఇక్కడ ఉండకపోతేనండీ, నేను మరొక ఇంటిముందు ఉంటా నండీ అన్నాడాపాలవాడు మీ లెక్కెంతఅన్నట్లుగా.

ఇలా ఉంటున్నాయి నేటి మన సమాజంలో నిత్యం మన చెవుల్లో పడుతున్న సంభాషణలూ. వాటి సొగసులూ. ఇక మని షికి మనిషి ఎంత దగ్గరగా ఉన్నాడు. ఎంతగా దూరమయి పోతున్నాడు అన్నది మీరాలోచించండి.

ఒక పల్లెటూళ్ళో తెల్లవారు జామున పాలకేంద్రం దగ్గర రైతులందరూ చెంబులతో, బిందెలతో పాలుపట్టుకొని బుద్ధిగా నిలబడిఉన్నారు. ఆ కేంద్రంలోని కుర్రవాడు పరీక్షచేసి మరీ ఆ పాలను ఒంపుకుంటున్నాడు. వచ్చిన పాలకు వచ్చినట్లుగా మార్కులు వేసుకుంటున్నాడు. మరిన్ని మార్కులు మనపాలకు పడాలన్న కోరికతో, ఆ రైతు సోదరులు నికార్సయిన పాలను పట్టుకొచ్చి మరీ నిలబడుతున్నారు.

ఆ ఊళ్ళోనే రోజూ పాలు కావలసిన వాడొకడు తన ప్రక్కింటి వాడినడిగాడు. ఆ పాలకేంద్రానికి పోసేదేదో, నాకు పోయరాదా అని. కావాలంటే ఒక రూపాయి ఎగస్ట్రా తీసుకోమని ప్రతిమిలాడాడు. ఆ పాలు పోసేవాడునసిగాడు. చివరికి 'సరేలే' అన్నాడు! మర్నాటినుండీపాలు పోసాడు. సగానికి సగం నీళ్ళు కలిపిపోశాడు. రూపాయికి రూపాయి ఎగస్ట్రాస్తూ తీసుకున్నాడు. దీనినేమనాలి చెప్పండి? పాలకేంద్రం పాటి చేయడాసాటివాడు! ఈ జాతిలో, ఈ మనజాతిలో మనుషులు ఒకరికొకరు కాకుండా పోతున్నారనీ, మన జాతీయత అంతా నీళ్ళపాలు అవుతోందని మనం గ్రహించుకోవడానికి ఈ నీళ్ళపాల నిదర్శనం ఒక్కటి చాలదూ !

పిండిపాలూ, నీళ్ళపాలు, ఇక మనజాతియత నీళ్ళపాలు!

సభ ఆశ్చర్యపడుతూనే, ఆవేదనను అనుభవిస్తోంది. రోజూ చూస్తున్నదృశ్యాలే ఇవి. కానీ ఇప్పుడిలా చూస్తూఉంటే ఎంతదారుణంగా కనబడుతున్నాయి. దిగజారి పోతున్న మన బ్రతుకులకు అద్దం పడుతూ మనమెక్కడిదాకా పడిపోయామో చూపెడుతున్నాయి.

స్వామి సభను గమనిస్తున్నారు. తన చూపులతోనే సభలోనివారిని పైకి లేవనెత్తే ప్రయత్నం చేస్తున్నారు.

ఆర్థికంకాదు - పారమార్థికం

నేటిసమాజంలోని సకలసమస్యలకూ మూలం ఆర్థికసమస్యల. ఆర్థికమయిన అంతరాలే, ఆ అంతస్థులలోని తేడాలే ఈ సమాజాన్ని అస్తవ్యస్తం చేసేస్తున్నాయి. అని నమ్ముతున్న వాళ్ళున్నారు. వారినమ్మకాన్ని నేను కాదనను కాని, ఆ నమ్మకం కొంత వరకే నిజమని మనం గ్రహించవలసిఉంది అంటున్నాను.

ఆర్థికమయిన అంతరాలు ఉండకూడదు. నిజమే కాని అంతమాత్రాననే మన సమస్యలన్నీ తీరిపోవు. తండ్రి తన నలుగురు బిడ్డలకూ ఆస్తిని సమంగా పంచి ఇస్తున్నాడు. అంతమాత్రాన వారు కలసి ఉండగలుగుతున్నారా ? కలసి ఉండగలరని మనం చెప్పగలమా ! మనుషులు కలసిఉండటానికి అంతమాత్రమే చాలదు అనితేలిపోతోందికదా !

మనిషికి మనిషి దగ్గరకావడానికి సనాతనధర్మం కొన్ని సోపానాలను నిర్మించింది. అందులో మొదటిది ధనాన్నిబట్టికాదూ. గుణాన్నిబట్టి మనం మనిషికి విలువనివ్వాలి అన్నది. మనిషీ ! తోటిమనిషివైపు చూస్తున్నప్పుడు అతని చుట్టూ ఉన్నస్థితిగతుల వైపుకన్నా, అతనినుండి వ్యక్తమవుతున్న గుణగణాలవైపు తేరి పారజూడు ! అని ఉపదేశించింది. ఈ ఉపదేశాన్ని మనం చిత్తశుద్ధితో అమలుపరుస్తే ఏమవుతుంది. కులమత భేదాలు ఇక మనపైన పనిచేయవు, వయస్సులూ, హోదాలూ ఇక మనకు అడ్డురావు. మీరన్న అంతరాలన్నీ అంతలోనే జారిపోతున్నాయి. ఏమంటారు.

ఒకనిజం చెప్పనా. ఇవాళ మనిషి బాధపడుతున్నది తనకు స్థితిగతులు లేనందుకుకాదు. తనకు సరయినస్థితిగతులులేవని తోటిమనిషి తనవెక్కడ చిన్నచూపు చూస్తాడోనని. మనిషి తోటి మనిషిని చిన్నచూపుచూడకుండా ఎప్పుడు ఉండగలుగుతాడు ! అతడు పారమార్థికంగా ఎదిగినప్పుడు ! కనుక అసలు సమస్య ఆర్థికంకాదు, పారమార్థికం.

సనాతనధర్మం మనిషిని ఇంకొక మెట్టుపైకి ఎక్కమన్నది. తోటి మనిషితో ప్రవర్తించేటప్పుడు గుణగణాలనుబట్టి కూడాకాక ఆ లోని వెలుగును పట్టించుకోవడం నేర్చుకోమన్నది. నేర్చుకుంటున్నకొద్దీ. అందరిలోనూ అండగానూ ఉన్నది అదే వెలుగని' అది ఒకే వెలుగని తెలుస్తుందిచూడు. నిండుగా ఈ సత్యం నీకు అనుభవానికొస్తుందిచూడు. అని ఉపదేశించింది.

ఎక్కవలసిన మెట్లను చూపటమేకాదు. ఆ మెట్లను ఎక్కేటందుకుగాను. మనిషి నిరంతరం చేయువలసినసాధన ఏమిటి అన్నదికూడా సనాతనధర్మం వివరంగా ఉపదేశించింది. అదే యోగసాధన విధానం, అష్టాంగయోగమార్గం. మనుషులను ఈ సాధన పైపునకు మళ్ళించగలిగినప్పుడు ఇక సమస్యల బెడద అన్నది తలయెత్తదు. సకల సమస్యలకూ పరిష్కారం దివ్యమయిన ఈ సాధవలోనికి మానవజాతి ప్రవేశించడమే ! కాలకాలాలలో దేశదేశాలలో ప్రవక్తలూ, మహర్షులూదిగివచ్చేది ఇందుకే ! మానవజాతిని పెద్దఎత్తున ఈ సాధనపథాన ప్రవేశింపచేసేటందుకే ! అందుకే భూమి తన బరువనిపించినప్పుడల్లా అటువంటి పెద్దలకొరకు ఎదురు చూస్తూఉంటుంది.

సభ తాను మొత్తంగా సాధన పథాన ప్రవేశించానంటున్నది. స్వామి ఉపదేశం దానిపై అంతగా పనిచేస్తున్నది.

పిడివాదం - దోపిడివాదం

అనాదిగా నరజాతిని పట్టి పీడిస్తూ వస్తున్నది రెండే రెండు వాదాలు. మొదటిది పిడివాదం రెండవది దోపిడివాదం. పిడివాదంలో పడినప్పుడు మనిషికి మనిషి ఎడమైపోతున్నాడు. దోపిడివాదానికి గురియైనప్పుడు మనిషికి మనిషి మిగలకుండా పోతున్నాడు.

పిడివాదమంటే ఛాదస్తం. తోటిమనిషిని కులంపేరిటో, మతం పేరిటో, పార్టీపేరిటో వర్గం పేరిటో ఎడంగా ఉంచడం. మనుషుల మధ్యలేనిపోని అంతరాలు సృష్టించడం. అస్పృశ్యుడవనిదూరంగా ఉంచితేనేం, ఆడదానివని దూరంగా ఉంచితేనేం ఏరాయి అయితేనేం పళ్లూడగొట్టుకోవడానికి. చదువులేదని దూరంగా పెడితేనేం స్థితి పరుడు కాడని దూరంగా ఉంచితేనేం, ఏ తేడా అయితేనేం మనుషులను విడదీయడానికి. పిడివాదమంటే ఒకానొక ఛాదస్తం. మనిషిని సూటిగా చూడనివ్వదది. తోటిమనిషిని మనిషిగా గుర్తించనివ్వదది. క్రమంగా మనుషులను విడదీసి ఒంటరి వాళ్ళను చేసేస్తుంది అది. మనిషిని మనిషికి కాకుండా చేస్తుందది. సహజీవనానికి స్వస్తి పలుకుతుందది.

దోపిడివాదమంటే మనిషిని మనిషి దోచుకుతినడం దోచుకు తినకుండా ఉండలేక పోవడం. కార్మికుల్ని చేస్తేనేం. కొనుగోలు దారుల్ని చేస్తేనేం దోపిడి దోపిడేకదా ! మామూళ్ళని గుంజితేనేం లంచాలుగా పడితేనేం దోపిడి దోపిడే కదా ! రిక్షావాడిగా చేస్తేనేం పెట్టుబడిదారుగా చేస్తేనేం దోపిడి దోపిడే కదా ! తోటి మనిషిని పీడిస్తూ బ్రతకకు, తోటిమనిషిని మోసగిస్తూ

బ్రతుకు అని పురికొల్పుతుంది ఈ దోపిడీవాదం. 'తోటి మనిషిని మననీయకు, అతడినిక మిగలనీయకు ! అన్న ప్రేరణ ఇస్తుంది ఈ దోపిడీవాదం. ఇలు. నరజాతి నశించిపోవడానికి ఈ రెండు వాదాలూ చాలు. మనిషికి మనిషి కాకుండా పోవడానికి మనిషికి మనిషి మిగలకుండా పోవడానికి ఈ రెండు వాదాలూ చాలు. ఏ దేశాలలో నయినా, ఏ పేర్లతో కనబడుతున్నా వినాశనానికి దారితీస్తున్నవి ఈ రెండు వాదాలే.

సనాతన ధర్మం ఈ రెండు వాదాలకూ పరిష్కారంగా రెండు ఉపదేశాలను చేసింది. మనిషీ ! ఎన్నడూ తోటిమనిషిని నీకన్నా వేరుగా చూడకు.' అన్నది మొదటి ఉపదేశం. 'మనిషీ ! తోటిమనిషిని సేవిస్తూ బ్రతుకుతానని ప్రతినచేయి' అన్నది రెండవ ఉపదేశం. ఈ రెండు ఉపదేశాలనూ ఒంటపట్టించుకున్నప్పుడు నరజాతి అన్నివిధాలా సుఖశాంతులను అనుభవించు గలదు.

స్వామి గొంతు ఆర్ద్రమైంది. స్వామి వదనం గంభీరంగా ఉంది. స్వామి మధనం అమృతాన్ని అందిస్తున్నది. స్వామి సందేశం సనాతన ధర్మ స్వరూపాన్ని స్పష్టంచేస్తున్నది.

సభలోని శ్రోతలు ముగ్ధులవుతున్నారు. మంత్ర ముగ్ధులవుతున్నారు.

చెడిపోవడం కాదిది - చెదిరి పోవడం

చాలా మంది అంటున్నారు. 'ఈ జాతి చెడిపోయిందని'. చెడిపోలేదు ఈ జాతి చెదిరిపోయింది. ఆ చెదురుబాటు చెడిపోవడంగా కనిపిస్తోంది.

శతాబ్ధాల తరబడి బానిసత్వం ఈ జాతిని చిందరవందర చేసింది. మహమ్మదీయుల దండయాత్రలు మన జాతి సంస్కృతి చిహ్నాలను మట్టుపెట్టే ప్రయత్నం చేశాయి. ఎన్నెన్నో గుడులు గోపురాలు బ్రద్దలు కొట్టబడ్డాయి. దేవతా మూర్తుల ముక్కులు, చెవులు అనేకంగా కోసివేయబడ్డాయి. ఈ సంస్కృతి అంటే అంతకసి వాళ్ళకు! ఆ కసిని చూసి ఈ జాతి బెదిరిపోయింది. తనకు తెలియకుండానే తాను చెదిరిపోయింది.

ఆంగ్లేయుల పాలన మన జాతీయతకూ, మన సంప్రదాయానికీ మనం చెందకుండా పోవడానికి కావలసిన విష బీజాలన్నింటినీ నాటింది. మన పవిత్ర గ్రంథాలను మనమే శంకించేలా, మన అవతార మూర్తులను మనమే అవహేళన చేసేటట్లుగా తయారుచేసింది. ఈ దేశంలో ఉంటూనే విదేశాలకు మానస పుత్రులను కమ్మని మనను ఆశీర్వదించింది. అందుకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసింది. అప్పుడేమయింది. జాతి ఛిన్నా భిన్నమయి పోయింది. మరింతగా చెదిరిపోయింది.

ఇంతలో దేశానికి స్వాతంత్ర్యమొచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటిసగం పరిపాలన మనను ధర్మం వైపు నుండి ధనం వైపునకు నడిపించింది. ఇప్పుడు రెండవ సగం పరి

పాలన నైతిక విలువలకు అన్నివిధాలా స్వస్తి చెప్పేటట్లు చేస్తున్నది యథారాజా తథాప్రజా అన్నట్లుగా పాలనతో పాటుగా జాతి కూడా దిగజారుతూవస్తున్నది.

ఇన్ని కారణాలచేత జాతి చెదిరిపోయింది, చిందరవందర యింది. మంచిగా బ్రతుకుదామని ఉన్నా అలా బ్రతుకలేనిస్థితిలో పడిపోయింది. అలా బ్రతకలేనేమో అని భయపడుతోంది. భయపడి పరిస్థితులతో ఎక్కడికక్కడ రాజీపడిపోతోంది. గాలి వాటానికి అనుగుణంగా కొట్టుకు పోతోంది. కాని ఎక్కడో అంతరాంతరాలలో నేను నేనుగా బ్రతకలేకపోతున్నానే, అన్న భావం ఇంకా ఈజాతిలో ఉంది. బ్రతికి ఉంది. కొడిగట్టి కుంచించుకు పోతున్న దీపారాధనలాఉంది. నాలోని ఈ భావాన్ని కాస్త ఎగసన ద్రోసే వారు లేరా అని వెతుకులాడుతోంది. బ్రతిమిలాడుతోంది. అందుకే అంటున్నాను. ఈ జాతి ఇంకా చెడిపోలేదని ఇదంతా చెదలు బాటేనని.

కాస్తంత ఉత్సాహపరిస్తే, కాస్తంత ధైర్యంపోస్తే కాస్తంత మేలుకొలిపితే, పూనుకొనికాస్తంత శిక్షణనిస్తే ఈ జాతిమళ్ళీ బాగుపడుతుంది. బట్టకడుతుంది. ఇన్నినాళ్ళ అనుభవం ఇదేమాట చెబుతున్నది. ఇదే బాట చూపుతున్నది.

సభలో ఉత్తేజం కనబడుతున్నది. ఆత్మవిశ్వాసం కావలసిన మేరకు ఎదిగి వస్తున్నది. జాతి తనను తాను తెలుసుకుంటున్నది. తనను తాను మలచుకుంటున్నది. అని అనిపిస్తున్నది.

భయపడకండి - బాటలో నడవండి

మీకు నిజంగా ఇలా బ్రతకాలనిలేదు. మిమ్మల్ని వెంటాడు తున్న భయంవల్ల మీరిలాగ అయిపోతున్నారు. మీరు భయం చేత వేటాడబడుతున్నారు. ఆ భయం మిమ్మల్ని పిచ్చి కుక్కలా వేటాడుతున్నది.

ఎంతకాలం భయపడతారు. ఎంతకాలం వణుకుతారు.

ఎంతకని పరుగెడతారు. ఎక్కడికని పరుగెడతారు.

రేపెలా జరుగుతుందోనని భయం. ఎల్లుండి అసలు జరుగు తుందో లేదోనని భయం. భవిష్యత్తు అసలెలా జరుగుతుందోనని భయం. మనస్థితిగతులు ఏమవుతాయోనని భయం. బంధుమిత్రులు కలసి వస్తారా అని భయం. కన్నబిడ్డలు మనని చూస్తారో లేదో నని భయం. వ్యాధి బాధలు దారికి వస్తాయా అని భయం. మన ఆర్జన చాలుతుందా, మన మనుగడ సాగుతుందా, ఇలా ఊ మాత్రంగా ఉంటూ మనం దాటిపోతామా లేమా అని భయం. భయం, భయం, భయం అంతా భయం. జీవితమే ఒక భయం. జీవించడమే ఒక భయం !

కాని మన పెద్దలేం చెబుతున్నారు. పిరికివాళ్ళలాగా భయ పడవద్దని చెబుతున్నారు. అసలు భయపడవలసినదేమీ లేదని చెబుతున్నారు. భయం మనని అన్నివిధాలా బలహీనుల్ని చేస్తుందని, భయపడుతున్నకొద్దీ మనం అన్ని విలువలకీ దూరమవుతామని, విలువలకు దూరమవుతున్నకొద్దీ, భయం ఇంకా ఇంకా పెరుగుతుందని జీవితంలో భయమొక్కటే [illegible] చెబుతున్నారు.

సోదరులారా ! కొంచెం ఆలోచించండి. నేటి సమాజంలో ఇన్ని మోసాలు. ఇన్ని దగాలు ఎందుకని జరుగుతున్నాయి. భయం వల్లనే ! ఇన్ని దగాలు, ఇన్ని మోసాలు చేస్తేగాని నేనొక స్థాయిదాటి పైకిపోలేనని మనిషికి భయంకలగటంవల్లనే ! నేటి సమాజంలో ఇన్ని కొట్లాటలు, ఇన్ని హత్యలు ఎందుకు జరుగుతున్నాయి. నన్ను అవతలివాడు ఇలా బ్రతకనివ్వడేమోనన్న భయంవల్లనే ! చూశారా మనం చూస్తున్న ఈ దగాల వెనుక, మోసాల వెనక, కక్ష్యలవెనక, కార్పణ్యాల వెనుక, చివరకు హత్యలవెనక, కిరాతకాల వెనుక ఉన్నది భయమేనని ! భయమే ఇన్ని రూపాలు ధరించి, మనను అన్ని విధాలా హత మారుస్తోందని ! చూశారా గమనించారా భయమన్నది ఎంత భయంకరమైనదో !

భయపడవద్దు. భయపడి దిగజారవద్దు. దిగజారుతూ విలువలన్నింటినీ వదులుకోవద్దు. పరిస్థితులతో రాజీపడుతూ అనుక్షణం చస్తూ బ్రతకవద్దు.

మీరు అనుకున్నట్లుగా మీరు బ్రతకండి. పెద్దలు చూపిన బాటలో నడవాలని మీరనుకోండి. అలా నడిచేటందుకు దీక్ష బూనండి. కంకణధారులుకండి !

పెద్దలుచూపిన మార్గమేమిటన్నది మీకు తెలుసు. కాని మీరా మార్గాన నడవలేక పోతున్నారు. ఎందువల్ల ? ఆ మార్గాన నడిస్తే బ్రతుకు ఇలా గడవదేమో అన్న భయంవల్ల ! మిత్రులారా ! మార్గం తెలియక మనం చెడిపోవడంలేదు. ఆ మార్గాన నడిచే ధైర్యంలేక, ధైర్యంచాలక మనమిలా అయిపోతున్నాం.

భగవద్గీతలో వ్యాసభగవానుడంటాడుకదా' 'ఈ బాటలో ఏ మేరకు నడిస్తే, ఆ మేరకు భయం తొలిగిపోతుంది' అని. అంటే అర్థమేమిటి. ఆబాటలో మనం నడవకపోబట్టే, నడవ డానికి భయపడబట్టే, ఈభయం ఇంతగా మనల్ని గుంజగలుగు తోందన్నమాట. ఒక్కసారి దృఢంగా సంకల్పించి ఆ బాటను పడితే క్రమంగా ఆ భయం మనల్ని విడిచిపెట్టిపోతుంది. కనుక భయపడకండి బాటలో నడవండి.

గంభీర వదనులై ఉన్నారు స్వామి. స్ఫూర్తిమంతంగా చూస్తున్నారు. కనుచూపుమేరలో కనబడుతున్నవారదంరికీ ఆ స్ఫూర్తి అందేలా చూస్తున్నారు.

శ్రమపడకండి - కృషిచేయండి

మీరు కృషిచేస్తున్నారా, శ్రమపడుతున్నారా ? శ్రమ పడకండి కృషిచేయండి. శ్రమపడటానికీ, కృషిచేయడానికీ చాలా తేడా ఉంది గమనించండి.

శ్రామికులు అన్నపదం వినబడినప్పుడల్లా నాకు చాలా బాధకలుగుతుంది. శ్రామికులు అంటే శ్రమజీవులూ శ్రమపడే వాళ్ళు అని అర్థమొస్తుంది. ఆ జీవితాలలోని కళాకాంతులను ఆ పదమే లాగేస్తున్నదా అనిపిస్తుంది నాకు.

శ్రమ అనగానే అలసట అనిపిస్తుంది. కృషి అనగానే తృప్తి అనుభవానికి వస్తుంది. అలసట చెందుతూ పనిచేస్తే అది శ్రమ అవుతుంది. తృప్తిననుభవిస్తూ, పనిచేస్తే అది కృషి అవుతుంది. రెండుస్థితులకూ ఎంత తేడా ఉందో గమనించండి.

అలసట చెందుతూ పనిచేయవద్దన్నారు మన పెద్దలు. అసలు పని చేయడం చేతకాకపోవడం వల్లనే అలసట వస్తున్నది అన్నారు. పని చేయడమెలాగో నేర్చుకోమన్నారు. తృప్తిననుభవిస్తూపనిచేయమన్నారు. దానినే వారు కర్మయోగమన్నారు.

మనస్సు ఇంద్రియాలలోనికి ఎదురుతూ, పరిస్థితులకు ఎదురుతూ పనిచేస్తున్నప్పుడు అలసిపోతూ ఉంటుంది. అప్పుడా పని శ్రమ అవుతుంది. మనస్సు, బుద్ధిని కూడుకొని, హృదయం తోటి అనుబంధానాన్ని పెంచుకున్నప్పుడు ఇంద్రియాలను నడప గలుగుతుంది. పరిస్థితులను మలచగలుగుతుంది. అప్పుడలా చేసిన పని కృషి అవుతుంది.

శ్రమ ఎక్కువకాలం పడలేం. కృషి ఎంతకాలమయినా చేయగలం. అలసట చెందుతూ శ్రమించటానికికాదు మనమీ భూమి మీదకు వచ్చింది. ఆత్మానుభూతిని పొందుతూ కృషి చేయుడానికి మన మీ భూమిమీదకు వచ్చాం. ఈ సత్యాన్ని మనస్సుకు తెలియచెప్పండి. ఈ రోజునుండీ శ్రమపడకండి. కృషిచేయండి.

స్వామి వాక్కులు జీవితాలను వెలిగిస్తున్నాయి. స్వామి చూపులు జాతి మనస్సును మళ్ళిస్తున్నాయి. సభ ఉత్తేజిత మవుతున్నది. కృషికి ఉన్ముఖమవుతున్నది.

ఎదురు చూడకండి - ఎదురుగా చూడండి

ఎందుకలా ఎదురుచూస్తారు? ఒక్కసారి ఎదురుగా చూడండి. మీరేం చేయాలీ అన్నది మీముందే పెట్టబడి ఉంటుంది. చూడకపోతే చూడలేకపోతే అది మీ దోషమే అవుతుంది. ఎదురు చూడకండి ఎదురుగా చూడండి.

అవకాశాలకోసం ఎదురుచూస్తూ, జీవితాన్ని కాలక్షేపంగా గడిపేస్తున్నవారు ఎందరో కనబడుతున్నారు. వారిని చూస్తుంటే జాలివేస్తున్నది, 'ఎదురుగా ఉన్నదే అవకాశమని వారికెందుకు తెలియడం లేదా' అని.

ప్రకృతిమాత కరుణామయి. ఆమెఅందరికీ ఎప్పటికప్పుడు అవకాశాలను కలగచేస్తూనే ఉంటుంది. కానీ మనిషి చిత్రమయినవాడు. తాననుకున్న అవకాశమేదో రావడంలేదనీ, వస్తున్న అవకాశాలన్నింటినీ వదులుకుంటూ ఉంటాడు. నీకేంకావాలో నాకు తెలియదా అన్నట్లుచూస్తుంది ప్రకృతి. ఆ తల్లి చూపునుగమనించుకునేస్థితిలో ఉండడు మనిషి. అతడెటో చూస్తున్నాడు. ఎందుకో చూస్తున్నాడు. ఏమో అయిపోతున్నాడు. ఎందుకిలా అయిపోతున్నావంటే 'అదేనండీ ఏ అవకాశమూ లభించడంలేదు' అంటున్నాడు. ఎదురుగా వస్తున్న అవకాశాలను పట్టించుకోనివాడికీ, నిర్లక్ష్యం చేస్తున్నవాడికీ, కావాలని పోగొట్టుకుంటున్నవాడికీ ఇంక ఏ అవకాశం లభిస్తుంది! ఏ అవకాశం లభించాలి!

ఇదీ ఇప్పటి నీ కర్తవ్యమని ప్రకృతిమాత మనముందు ఏ చిన్నపనిని పెట్టినా, దానిని మనం శ్రద్ధగా చేయగలగాలి.

చిన్నపని కదా అని దానిని నిర్లక్ష్యంచేస్తే, ఈ చిన్నపని పోతుంది. నీవనుకున్న పెద్దపని, పొరపాటున కూడా నీ చెంతకు రాదు. గుండీలే కుట్టడానికి ఇబ్బదకిస్తున్నవాడికి బట్టల్ని కుట్టమని ఎవరిస్తారు.

ప్రకృతిమాత మనకప్పగించిన ప్రతిపనినీ శ్రద్ధగా మనం చేస్తూ పోవాలేగాని. మనం అనుకున్న దానికన్నా మించిన పనులు మన దగ్గర కొస్తాయి. ఆమె మన కథను అలా నడిపిస్తుంది.

వర్తమానాన్ని నిర్లక్ష్యం చేస్తున్నవాడు భవిష్యత్తును సృజించుకోగలడంటారా! 'వర్తమానంపైన శ్రద్ధపెట్టండి.' అనే వర్తమానాన్ని ప్రకృతి మాత నిరంతరం మన కందిస్తూ ఉంటుంది.

ఎదురుగా ఉన్నదే మన కర్తవ్యం అని మనం చేయడం మొదలుపెడితే మనకేంకావాలో, మన మేం కావాలో అందుకు తగిన అన్ని పనులూ అలా వచ్చి మన ముందు నిలబడుతూ ఉంటాయి. ఈ సత్యాన్ని గమనించండి.

ఎదురు చూడకండి, ఎదురుగా చూడండి.

ఊహించకండి - జీవించండి

ఏమిటలా చూస్తూకూర్చుంటారు. ఎందుకలా ఊహల్లో తేలి ఆడతారు. ఊహిస్తున్న క్షణాలలో మీరు జీవించడం మానేస్తు న్నారని మీకు తెలుసునా, ఊహించకండి. జీవించండి.

వస్తున్న ఊహను వస్తున్నట్లుగానే జీవితంగా రూపొం దించండి. కొంతకాలం ఊహిద్దాం. ఆ తరువాత జీవిద్దాం అను కోకండి. ఊహించడానికి అలవాటు పడినవాడు ఇక జీవించడానికి సిద్ధపడలేడు. మీది ఊహాజీవితం కాకూడదు. మీ ఊహ జీవితం కావాలి. నిజంకావాలి. నిజంగా మీరు జీవించాలి !

కలలు కంటూ ఉండిపోకండి. ఆ కలలను అప్పుడే జీవిత సన్నివేశాలరూపంలో ఇలలో ప్రతిష్ఠించండి. కలతోపాటు మీరూ కరగిపోవద్దు. మీ తరువాత కూడా మీ జీవితం ఈ భూమిమీద మిగిలి ఉండేటట్లు చూసుకోండి.

ఊహను ఊహగాకాక, జీవితంగా రూపొందించేస్తున్నా రనుకోండి. కొన్నాళ్ళకు మీ ఊహ సంకల్పరూపాన్ని ధరిస్తుంది అప్పుడు మీ కిక కలిగేది సంకల్పాలే. ఆ సంకల్పాలు జీవిత సన్నివేశాలుగా రూపొందుతూ ఉండగా మీరు ధన్యజీవులవు తారు. చరితార్థులవుతారు. కనుక ఊహిస్తూకాలాన్ని వెళ్ళబుచ్చ కండి. జీవిస్తూకాలానికి రూపుదిద్దండి !

సూటిగా చూస్తున్నారు స్వామి. చురుక్కుమంటున్నాయి ఆ చూపులు. మేలుకోరేచూపులవి. మేలుకొలిపే చూపులవి. వింటున్నవారు మేల్కొంటున్నారు. జీవించడానికి సిద్ధమవు తున్న మమ్మల్ని దీవించమంటున్నారు.

5. ఆత్మవిద్య - అసలు రూపం

1. హా హా హా
2. దేహనింద కాదది-దైవనింద
3. సమస్య కాదది సహజం
4. నలగడం కాదు-మెలగడం చేతకావాలి
5. అడిగిందల్లా ఈయుడు-అవసరమైంది ఇస్తాడు
6. అవతార్ అపతార్ అంటారు మీరెప్పటికలా అవుతారు
7. కొలుస్తున్నారు
8. యాంత్రిక జీవనంకాదు-యాత్రిక జీవనం కావాలి
9. కలసి రావడం
10. పాత పుస్తకాలు కావు-అవి 'పాఠ' పుస్తకాలు
11. వద్దు అనలేదు-హద్దు అన్నారు
12. ఆశ్చర్యాలనుండి ఆచరణకు
13. మరల మరల స్మరించండి-'మర'లా మాత్రం స్మరించకండి
14. రాజయోగం గాదు-రాజీయోగం
15. ఉపరి ప్రశ్నలనుండి పరి ప్రశ్నానికి
16. భక్తి ఒక మార్గం కాదు-అది మన గమ్యం

చా చా చా

చూడగా : మనిషి జీవితంలో మూడు 'చా' లు కనబడుతున్నాయి. అతని జీవితాన్ని ఈ మూడు 'చా' లే ఆక్రమిస్తున్నాయి. ఈ మూడు 'చా'లను అధిగమించలేక అలా బ్రతికేస్తున్నాడు మానవుడు. అవేమిటో తెలుసునా ? బాల్యాన చాపల్యం, యౌవ్వనాన చాంచల్యం, వార్ధక్యంలో చాదస్తం, మొత్తం మీద మూడు 'చా'లు, మన జీవితం వృధాగా గడిచిపోవడానికి ఇవి చాలు.

బాల్యంలో కూడని పనులు చేస్తే, ఇదిబాల్యం, చాపల్యం దానికి సహజం అంటారు. యౌవ్వనంలో పెర్రి పనులు చేస్తే యౌవ్వనం కదండీ ! ఆ మాత్రం చాంచల్యముంటుంది అంటారు. వృద్ధాప్యంలో అయిన దానికీ కాని దానికీ కలుగచేసుకుంటూ అయినవాళ్ళకు కూడా తలనొప్పి కలిగిస్తున్నవేళ వృద్ధాప్యం కదండీ ఈ మాత్రం చాదస్తం తప్పదు అని సరిపెడతారు.

అది సరే ! ఇంతకీ మనిషెప్పుడు మనిషిగా జీవించేది ? చాపల్యం, చాంచల్యం, చాదస్తం అంతలో తనువును చాలించడం. మనిషి జన్మ ఎత్తినందుకు మనమేదో చాలా చేస్తాం, చాలా ఇస్తాం, అని అనుకుంటుంది ప్రకృతి, కాని మనమేం చేస్తున్నాం ? ఈ 'చా'లలో పడికొట్టుకుంటూ తనువులు చాలిస్తున్నాం. అప్పుడు ప్రకృతి తనకు ప్రతినిధులుగా మహనీయులను నిలబెట్టి కాలకాలాలలో, దేశదేశాలలో, మానవ జాతికి ఉపదేశింప జేస్తున్నది. ఏమని, 'మానవుడా నీ కొరకు ఈ దేహమున్నది. ఈ దేహము కొరకు నీవు లేవు. ఈ సత్యాన్ని నీవు గమనించు.

అప్పుడు దేహం యొక్క ప్రభావం నీ మీద పడదు సరికదా, కర్తవ్య నిర్వహణకు దివ్యోపకరణంగా దేహాన్ని నీవు వినియోగించ గలుగుతావు. అలాగే వయసనేది కూడా దేహానికి సంబంధించినదే ! ఎప్పుడైతే నీవు దేహం యొక్క ప్రభావానికి అతీతంగా నిలిచి, దివ్యోపకరణంగా దేహాన్ని వినియోగించడం మొదలు పెట్టావో, అప్పుడిక వయస్సు యొక్క ప్రభావం కూడా నీ మీద పడదు సరికదా, ఆ వయస్సు కర్తవ్య నిర్వహణలో నీకెంతో వినియోగపడుతుంది.

నీ చిన్నతనం అన్నింటినీ నేర్చుకోవడానికి పనికి వస్తుంది. నీ యౌవ్వనం కర్తవ్య నిర్వహణకు కావలసిన శక్తియుక్తులను సమకూర్చి పెడుతుంది. నీ వృద్ధాప్యం అనుభవాన్ని పంచిపెట్టడానికి కావలసిన పెద్దరికాన్ని నీకు అందిస్తుంది. చూశావా ! ఈ చిత్రం ! దేహం ప్రభావం నీ మీదపడినప్పుడు 'ఛా' లతో గడిచిపోయే నీ జీవితం, దేహాన్ని నీవు వినియోగించడం నేర్చిన వేళ ఎంతగా సార్థకమౌతుందో చూశావా ! సోదరులారా ! మహనీయుల సందేశాల సారాంశమిది !

మానవధర్మ శిక్షణ సంస్థ నెలకొల్పబడిన తర్వాత నిర్వహింపబడిన తొలిగురుపూజలలో తొలిరోజున ఆ గురుపూజా వేదిక పై నుండి స్వామి ఇచ్చిన సందేశంలోని భాగమిది. అలాస్వామి సందేశమిస్తుంటే వేదిక మీద వేంచేసి ఉన్న మహనీయులందరూ 'ఔనౌను' అనాదిగా మేము ఇస్తూవస్తున్న సందేశమిదే', అంటూ తమ తమ దరహాసాలతో బదులు పలుకుతున్నారా ! అన్నట్లు ఉన్నది ఆ దృశ్యం. అది అపూర్వం.

దేహనింద కాదది దైవనింద

ఇటీవల కాలంలో ఆధ్యాత్మికతను బోధించాలి. అనుకునే వారిలో కొందరికి ఒక చిత్రమైన ఊహకలుగుతోంది. అదేమిటి అంటే ఈ దేహాన్ని గురించి సాధ్యమైనంత తక్కువ చేసి చెప్పడం ఈ దేహం చీము నెత్తురులతో కూడుకున్నదనీ, నశించిపోయే దనీ, రకరకాలుగా వర్ణించిచెప్పి, కనుక ఈ దేహాభిమానాన్ని వదలి దైవం వైపుకు మళ్ళండి' అని నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు పాపం ! దైవం వైపుకు మళ్ళడం మంచిదె నిజానికి కావలిసిందికూడా అదే అయితే అందుకు దేహన్ని నిందించవలసిన అవసరం ఏముంది ? అన్నది పాయింట్.

పతంజలి ఒక చక్కటి మాట చెప్పాడు. భౌతికంగా, మానసికంగా శుచిగా ఉండటం అభ్యాసమైన కొద్దీ దేహం ఎడల వ్యామోహం తొలగిపోతుందని, అంటే దాని అర్థం ఏమిటో తెలుసునా ? ఈ దేహంనాది అన్నభావం కరిగిపోయి, 'ఈ దేహం భగవంతుని విగ్రహం, కార్యసాధనకై అతనిచే రూపొందింప బడిన ఒక దివ్యోపకరణం.' అన్న దర్శనం కలుగుతుందని. ఆధ్యాత్మిక సాధనలో నిజంగా ప్రవేశించిన వానికి దేహంయొక్క దివ్యత్వం బోధపడుతుంది తప్ప దానిని నిందించాల్సిన అవసరం అతనికేమీ కనబడదు, సరికదా దివ్యత్వం బోధపడుతున్నకొద్దీ దేహాన్ని అతడు పవిత్రంగా నిలబెట్టుకుంటూ నిరంతరం సద్వి నియోగం చేసే ప్రయత్నం చేస్తాడు. అలా చేస్తున్నకొద్దీ దేహానికి, ఇంద్రియాలకు, మనస్సుకు మరింతగా శక్తియుక్తులు లభిస్తూఉంటాయని కూడా ఆ పతంజలే వివరించాడు.

కాబట్టి ఈ దేహం మనది అన్న భావన కరగిపోయి 'దైవ దత్తమైన ఉపకరణమిది.' అన్న దర్శనం మనకు కలగాలి తప్ప ఎన్నడూ ఎట్టి పరిస్థితులలోనూ దేహనిందను మనం చేయకూడదు అలాచేస్తే దేహనిందకాదది దైవనిందే అవుతుంది.

ఇంకో చిత్రమేమిటంటే దేహాన్ని అదేపనిగా నిందిస్తున్నాము అంటే ఆ దేహాన్ని దైవంకన్నా వేరుగానన్నా మనం చూస్తూ ఉండాలి. లేదా ఈ దేహం మనది అన్న భావం అన్నా మనలో ఏమూలో పనిచేస్తూ ఉండాలి. ఈ రెండు భావనలూ ఆరోగ్యానికంత మంచివికావు. కనుక దేహంలోకూడా దైవాన్ని చూస్తూ. దాన్ని ఆ దైవం అప్పగించిన కార్యక్రమానికి మాత్రమే వినియోగించగలిగిన వివేకం మనకు కలగాలి.' అంటూ సాధకునికి కావలసిన వెలుగును గుమ్మరించారు స్వామి ఒక ప్రసంగంలో.

సమస్య కాదిది సహజం

మనిషి సంతోష స్వరూపుడై ఉండాలి. ఎదురవుతున్న సన్నివేశాలను వాటికి తగినట్లుగా నిర్వహిస్తూ తాను మాత్రం సంతోష స్వరూపుడై వెలుగొందగలగాలి. సన్నివేశాన్ని టాకిల్ చేసే వేళలో హడావిడిపడి తాను తన నిజస్వరూపాన్ని కోల్పోకూడదు. ప్రతి చిన్న సన్నివేశానికి మన స్వరూపాన్ని మనం కోల్పోతున్నాం అంటే ఇక అర్థమేముంది చెప్పండి.

అయితే అడుగడుగునా సమస్యలొస్తూ ఉంటే మీరన్నది అప్పుడెలా సాధ్యం ? అని మీరు అనవచ్చు. మీకొక సత్యం చెబుతున్నాను గమనించండి. మనిషిముందు ఎప్పుడూ అతని శక్తికి మించిన సన్నివేశమే ఉంచబడుతుంది. అది ప్రకృతి లోని ఒక ఏర్పాటు. మన శక్తికన్నా చిన్న సన్నివేశాలు మన ముందుకు వస్తూ ఉంటే మనం ఎదగడానికి అవకాశమేది ? ఉన్న స్థితికన్నా ఉన్నతస్థితిని పొందడానికి, ఇదివరకటికన్నా ఎదుగుదలను అనుభవించడానికి ఒక అవకాశమే ఈ మానవ జన్మ ! అలాంటి అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి అన్న సంకల్పంతో ప్రకృతి ఎప్పుడూ కూడా మనకు మించిన సన్నివేశాలనే మన ముందు పెడుతుంది. ఆ సన్నివేశాలను మనం నిర్వహించాలీ, అంటే మనం ఎదిగి తీరాలి. ఎదిగి తీరతాం కూడా ! ప్రకృతికికూడా కావలసిందదే కదా ! మన శక్తికిమించిన సన్నివేశం ఎదురైనపుడు మనం దానిని సమస్య అంటున్నాం. ప్రకృతి అది సహజం అంటున్నది. సమస్యకాదిది సహజం అన్నది ప్రకృతి యొక్క ఉపదేశం. ఈ వాస్తవం తెలియక మనిషి తెంబేలుపడిపోతూ ఉంటాడు. ఇలాంటి వాస్తవాలను గ్రహించడానికే మన పెద్దలు 'తత్త్వజ్ఞాన' మని పేరు పెట్టారు, 'తత్త్వం' అంటే ఏమిటి ? స్వభావం. ఈ సృష్టియొక్క స్వభావాన్ని గ్రహిస్తూ తదనుగుణంగా జీవనయాత్రను నిర్వహించే వారే తత్త్వవిదులు అనబడతారు.

ఇటువంటి సత్యాలు తెలుస్తున్నకొద్దీ మనిషి మనస్సుకు నిమితం చిక్కుతుంది. స్థిమితం చిక్కినకొద్దీ అతడు సంతోష

మయమైన తనస్థితిలోనుండే సకల కార్యక్రమాలనూ నిర్వహించ గలుగుతాడు. ఇలా నిర్వహించడంలో అపారమైన నైపుణ్యాన్ని చూపినవాడే శ్రీ కృష్ణుడు, అందుకే అతడు 'కర్మాచరణలో నైపుణ్యాన్ని చూపగలగటమే యోగమని' ఉపదేశించాడు.

నలగడంగాదు - మెలగడం చేతకావాలి

విభిన్న మనస్తత్వాలు కలిగిన మనుషుల మధ్యలో మన మున్నప్పుడు, మన జీవితం వారితో ముడిపడి ఉన్నప్పుడు, అడుగడుగునా వారితో కలసి సన్నివేశాలను నిర్వహించ వలసి వచ్చినప్పుడు 'ఏమిటోనండీ ! ఇన్ని రకాల మనస్తత్వాల మధ్యలో నేను నలిగి పోతున్నాను' అంటూ ఉంటాం. 'అలా నలగడం కాదు నాలా మెలగడం నేర్చుకోండి'. అంటున్నది రామాయణంలోని సుమిత్ర.

సుమిత్రకు ఒకవైపు కౌసల్య. మరొక వైపు కైక. 'పట్ట మహిషినైనప్పటికీ భర్త అంతగా నన్ను పట్టించుకోవడంలేదని కౌసల్య బాధ. 'కావాలని కట్టుకున్నాడు కదా ! అటుపైన మరొ కరికి ఆయనని ఎందుకు చెందనిస్తాను ?' అన్నది కైక పంతం. ఈ ఇద్దరి మధ్యలో సుమిత్ర. పేరుకు తగినది. ఇద్దరితోనూ మైత్రి చేయగలిగినది. అంతేకాదు తాను, ఇద్దరు బిడ్డలను కని ఆమె బిడ్డకొకరిని, ఈమె బిడ్డకొకరిని సమ దృష్టితో అప్పగించగలిగింది. ఇది నిజంగా ఎంత విచిత్రం ! ఎంత లోకోత్తరం. కౌసల్యను

చూసి కైక ఈర్ష్యపడింది. కైకను చూసి కౌసల్య భయపడింది. వీరిద్దరి మధ్యా సుమిత్ర నిలబడింది. నిజానికి ఆమే నిలబడింది. ఇంకెవరన్నా ఆమె స్థానంలో ఉంటే వారిద్దరి మధ్యా పడి నలిగి పోయేవారు. నలిగిపోతున్నాం బాబోయ్ అని ఆక్రోశించేవారు. కాని ఆమె నలగడానికి బదులుగా మెలగడం ఎలాగో మనకు చూపిస్తున్నది. అది మెలగడమే కాదు. వారిద్దరి మధ్యా ఆమె వెలగడం కూడా ! ఇలాంటి వారిని చూస్తున్న కొద్దీ, ఆరాధిస్తున్న కొద్దీ నలగడం అనే స్థితి నుండి మెలగడం, మెలగడం అనే స్థితినుండి వెలగడం, మనకు కూడా చేతనవుతుంది అంటూ స్వామి ఒకానొక శ్రీరామనవమి సందర్భంలో ఉపన్యాసం చేశారు.

అడిగిందల్లా ఈయడు అవసరమైంది ఇస్తాడు

నేనిన్నాళ్ళనుండీ ఫలానా మంత్రం చేస్తున్నాను. కాని నాకేం జరిగింది. నేననుకున్నది ఒక్కటీ కానప్పుడు నేనింక ఆ మంత్రం ఎందుకుచేయాలి ? అంటూ ఉంటారు ఒక్కొక్కళ్ళు.

ఒక చిన్న ప్రశ్న. ఒక మంత్రంచేసినా, ఒక ప్రార్థన చేసినా మనకుతోచిన జపతపాదులు ఆచరించినా, ఇవన్నీ దేని కోసం ? మనం చెప్పినట్లు దేవుడు నడచుకోవడానికా ? దేవుడు చెప్పినట్లు మనం నడచుకోవడానికా ? మనం చెప్పినట్లు దేవుడు నడచుకోవడానికయితే దానిని జపం, తపం అనరు. దేవుణ్ణి నస పెట్టడం అంటారు. తీరిగ్గా కూర్చుని, తాడపాశం పెడ్తూ దేవుణ్ణి సతాయించడమా ప్రార్థన అంటే ? చాల బాగుంది మన నిర్వచనం.

అలాకాక దేవుడు చెప్పినట్లుగా మనం నడచుకోవడానికే ఈ పూజలూ, జపాలు అని గ్రహించగలిగినపుడు మనం అనుకున్నవి కాలేదు అన్న ఆలోచనే ఉండదు. ఆయన అనుకున్నట్లుగా మనం ఉండటానికిగాను, మనం చేసే ప్రయత్నమే ప్రార్థన ! ఎప్పటికప్పుడు ఆయనతో మనకు గల ప్రీతిని సరిచూచుకుంటూ, ఆయన ప్రతినిధిగా జీవించడానికి కావలసిన వెలుగును ఆయన నుండి స్వీకరించడానికే మన ప్రార్థన. ఈ సత్యాన్ని మనం ఎంతగా గమనించుకుంటే అంతగా దైవానికి దగ్గరవుతాం.

ఈ సందర్భంతో రవీంద్రుడు దైవాన్నుద్దేశించి ఒక మాట చెప్పాడు. 'ప్రభూ ! నీ వైపుచూసి, నా మానసిక చాపల్యాన్ని ఆపుకోలేక ఏవేవో అడుగుతూ ఉంటాను. అందులో కొన్నింటిని నివిస్తావు. మరి కొన్నిటిని నీవివ్వవు. ఇచ్చినవాటి విషయంలో కన్నా ఇవ్వని వాటి విషయంలోనే నేను నీకెక్కువగా కృతజ్ఞతలు చెప్పుకోవలసిఉంది. ఎందుకనీ అంటే నేను నాకుతోచింది అడుగుతాను. నీవు నాకు అవసరమైంది ఇస్తావు. నేను కోరిన వాటిలో నిజంగా నాకవసరమైనవేమిటో నీకన్నా నాకెక్కువ తెలుస్తుందా? ప్రభూ ! కనుక నేనడిగిన వీయనప్పుడే నిజంగా నేను నీకు థాంక్స్ చెప్పాలి. ఎందుకనీ ! అవి నాకవసరం కావని శ్రద్ధతో గమనించి నాకివ్వనందుకు. అలా ఎప్పటికప్పుడు కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఉంటావు నువ్వు.

విన్నారా. రవీంద్రుని మాటలు ! సత్యాన్ని ఎంత తీయగా చెప్పాడాయన ! ఎంత తీరుగా చెప్పాడు ! మన పిల్లవాడే ఉంటాడు. చూసిందల్లా అడుగుతూ ఉంటాడు. అప్పుడు మనం ఏం చేస్తాం ? అందులో ప్రమాదంలేనివి వాడు ఆడుకోవడానికి

పనికి వచ్చేవీ వాడికిస్తాం. వాడు ఆడుకోవడానికి పనికిరానివి, ప్రమాదకరమైనవి వాడడిగినప్పుడల్లా, ఏవో కబుర్లు చెప్పి వాడిని మంపస్తాం. హుష్ కాకెత్తుకుపోయింది అంటాం. వాడటు చూస్తాడు, మనమిటు దాచేస్తాం. అంతేగా! వాడు ఏరోజరో అది గానుకోంది మనం గడ్డ గీసుకుంటున్నప్పుడుచూసి, మా అబ్బాయేకదా! అడిగాడు అని ఇచ్చేస్తామా? దేవుడుకూడా మన విషయంలో సరిగా అల్లాగే ప్రవర్తిస్తాడు. కనుక ఈ మంత్రం చేస్తే ఏమొచ్చింది! ఈ ప్రార్ధన చేస్తే ఏమొచ్చింది. అనకండి. మన ప్రకారం అతడు నడుచుకోవడంకాదు. అతడి ప్రకారం మనం నడుచుకోవాలి. అలానడుచుకోవడానికిగాను మనం దైవాన్ని చేస్తున్న అభ్యర్ధనే మన ప్రార్ధన.

అంటూ స్వామి దైవాన్ని నసపెట్టేవారి పని పట్టారు ఒకసారి.

అవతార్ అవతార్ అంటారు - వీరెప్పటికి అలా అవుతారు

ఒకసారి స్వామి ఒకానొక ఆధ్యాత్మిక సోదర బృందాన్ని ఉద్దేశించి మాట్లాడటానికి అంగీకరించి వెళ్ళారు. ఆ బృందం వారు సంకీర్తన చేస్తూ మధ్య మధ్యలో ‘అవతారునికీ జై కలి యుగ అవతారునికి జై’ అనసాగారు.

స్వామి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇలా అన్నారు: మనకొక అవతారమూర్తి నచ్చడం మన అదృష్టం. ఆ అవతార మూర్తి యొక్క స్మరణ అనుభూతి ప్రదమేకాని అస్మరణ యొక్క

పరమార్థమేమిటో మనం గమనించుకోవాలి. మనం ఆయనలా ప్రవర్తించడానికి మనలను ఉన్ముఖం చేయడానికే ఆ స్మరణ. మనం ఆయనలా ప్రవర్తించకుండా కేవలం స్మరించుకుంటూ, జై కొడుతూ, తృప్తి పడుతూ కూర్చుంటే చూసి చూసి ఏదో ఒక రోజున ఆయనే మనకు కనిపించి అవతార్ అవతార్ అంటారు. మీరెప్పటికి అలా అవుతారు ? అని అడుగుతాడు. ఎందుకనంటే మనం ఎలా అవ్వాలో ఎలానడుచుకోవాలో చూపించడానికే కదా ఆయన దిగివచ్చింది ! మరి మనం అలా అవకుండా, నడుచుకోకుండా కూర్చుండిపోతే ఆయన అడగడా ? మీరిలా కూర్చుండి పోయినప్పుడు నేను దిగి వచ్చిన ప్రయోజన మేమిటని ఆయన ప్రశ్నించడా ? ఆలోచించండి. అవతారుని అడుగు జాడల్లో ప్రయాణం చేయడానికి ఉద్యమించండి.

స్వామి మాటలు వారికి ఆశ్చర్యాన్ని కలిగించాయి. వారు స్మరిస్తున్న అవతారుడే ఈ రూపంలో గోచరించి, వారిని హెచ్చరిస్తున్నట్లుగా అనుభూతి చెందారు వాళ్ళు.

కొలుస్తున్నారు

'మాకు మొదటినుండీ వారే ఇష్టదైవం. వారినే నిరంతరం మా ఇంటిల్లిపాదీ కొలుస్తూ ఉంటాం' అన్నాడొక సోదరుడు,

స్వామి చిరునవ్వు నవ్వారు.

'ఏమిటి మాస్టరుగారూ ? నవ్వుతున్నారు' అని అడిగాడతడు.

అందుకుస్వామి ఇలా అన్నారు: 'ఏమీలేదు. కొలుస్తున్నారు అన్నపదప్రయోగాన్ని గూర్చి ఈపదం ఎంత చిత్రమైనది ! దైవాన్ని రెండురకాలుగా కొలిచే వాళ్ళున్నారు. రెండు రకాల వాళ్ళూ ఆయన్ను కొలుస్తున్నారు. మొదటిరకంవారు మామూలుగా భక్తివిశ్వాసాలతో కొలుస్తున్నారు. రెండవరకంవారు ఆయన ఎంతవరకు దేవుడు ? అని కొలుస్తున్నారు. అంటే మహిమలు చేయగలడా ? లేదా ? అడిగినవి ఈయగలడా లేడా ? ఇతరులకన్నా చిన్నదేవుడా ? పెద్దదేవుడా ? ఇంతకూ ఈయన పవరెంత ? ఈయన వలన జరిగే ఉపయోగమెంత ? అని కొలుస్తూ ఉంటారన్నమాట ! మొత్తంమీద కొలుస్తున్నారు. అన్నపదం ఇద్దరికీ సరిపోతుంది. ఇద్దరికీ అన్వయిస్తోంది. ఏమంటావ్ ? అందుకని నవ్వొస్తేను నవ్వుతున్నాను. ఇంతకూ నీవు మీ ఇష్టదైవాన్ని ఏ అర్థంతో కొలుస్తున్నావ్ ? అంటూ స్వామి అతనివైపు చూసారు.

అతను తనలో తానే నవ్వుకుంటూ తలవంచుకుని అది మీరే చెప్పాలి' అన్నాడు.

'తెలివిగలవాడివి' అంటూ మెన్నుతట్టి చిరునవ్వులు చిందించారు స్వామి.

యాంత్రిక జీవనం కాదు - యాత్రిక జీవనం కావాలి

రాను రాను మనుషులు యాంత్రికమైన జీవనానికి అల వాటుపడుతున్నారు. అంటే వాళ్ళ జీవితం మెకానికల్ అయి పోతోంది. ప్రకృతితో సంబంధం క్రమంగా సన్నగిల్లుతోంది. ప్రకృతితో సంబంధంఎవరికైతే సన్నగిల్లుతుందో, వారిజీవితంలో క్రమంగా అశాంతి నిండుతుంది. యంత్రాలతో పాటు మనం కూడా ఒక యంత్రమైపోయినట్లుగా భావనకలుగుతుంది. అదే పని అలాగే చేసుకుంటూపోవడం యాంత్రికమనబడుతుంది. అలాకాక రోజు రోజుకూ పనిలోనూ, చేయడంలోనూ కూడా విస్తృతి, ఎదు గుదలా కనబడినపుడు ఆ జీవితానికో రుచి ఏర్పడుతుంది. దాన్ని మనం యాత్రికజీవనం అనవచ్చును. యాత్రికుడు రోజూ ప్రయాణం చేస్తున్నాడు. కాని ప్రయాణం సాగుతున్న కొద్దీ కనబడే దృశ్యాలలోను, ఆ దృశ్యాలనుండి అతను పొందే అను భూతిలోనూ ఒకానొక నిత్యనూతనత్వం చోటు చేసుకుంటుంది. అప్పుడతనికి ప్రయాణం యొక్క అలసట తెలియదు. ప్రయాణం చేస్తున్నట్లే అనిపించదు. మరింత ప్రయాణం చేయాలనిపిస్తుంది. ఎందుకని? మరింతగా అనుభూతి లభిస్తుంది కనుక! మనది అలాంటి యాత్రిక జీవితంకావాలి. మన విధి నిర్వహణ అలాంటి యాత్రను తలపించాలి. మరిపించాలి.

యాంత్రిక జీవనంలో పడి కొట్టుకుంటున్న మనకు యాత్రిక జీవనం సాధ్యమవుతుందా? అని అనుకోవద్దు. మనం దృఢంగా సంకల్పించినప్పుడు ఎందుకు సాధ్యంకాదు? అమెరికాలో

కొందరు సజ్జనులు భాగవతాన్ని చదువుకున్నారు. అందులో కృష్ణుడు తిరుగాడిన బృందావనాన్ని గూర్చి చదువుకుంటున్నప్పుడు వారి మనస్సులు పులకించాయి. 'మనమలాంటి బృందావనాన్ని ఎందుకు నిర్మించుకోకూడదు.' అనుకున్నారు. అంతే నిర్మించుకున్నారు.

మళ్ళీకోరి అవతరింప చేసుకున్న ఆ బృందావనానికి వారు 'న్యూబృందావన్' అని పేరు పెట్టుకున్నారు. స్త్రీలు గోపికలుగా రూపొందారు. పురుషులు గోపాలకులుగా రూపుదాల్చారు. పాడి పంటలను వృద్ధిచేశారు. కృష్ణుని స్మరణలో వృత్తివ్యాపారములను రాసలీలగా నిర్వహిస్తున్నారు. ప్రజ్ఞామయ స్వరూపుడైన కృష్ణుడితో తిరుగాడుతూ 'కృష్ణా కాన్షస్‌నెస్ మిషన్' పేర యాంత్రిక జీవనాన్ని దివ్యంగా గడుపుతున్నారు. అమెరికా లాంటి దేశంలోనే అలాంటిది సాధ్యమైనప్పుడు మనకు ఎందుకు సాధ్యం కాదు ? కావలసినది దృఢసంకల్పం ! ఆత్మవిశ్వాసం ! ఆచరణశీలత ! ఆలోచించండి ! అంటూ ఒకానొక సందర్భంలో సోదరబృందాన్ని ఉద్దేశించి ప్రవచనం చేస్తూ పిలుపునిచ్చారు స్వామి.

కలసి రావడం

'ఎన్ని పూజలుచేసినా, ఎన్నినోములునోచినా, ఏమిటో నండీ ! కలసిరావడంలేదు.' అంటుంటారు కొందరు. ఏమిటి కలసి రావాలి ? డబ్బులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, పిల్లలు ఇవేనా ? అవన్నీ వచ్చాయనుకోండి. అప్పుడు మనం సుఖపడగలమని గ్యారంటీ ఉందా ? కనుక నిజంగా కలసిరావడం అంటే ఏమిటి అంటే మనకి మనం కలసిరావడం. మనదేహం, ఇంద్రియాలు, మనస్సూ మనకు కలసి రావడం. మనం చెప్పినట్లుగా అవి నడ చుకోవడం ! మన కర్తవ్యనిర్వహణలో మనపిగా అవినిలబడటం. అదే కలసి రావటమంటే ! కనుక దేవుని దగ్గరకూర్చున్నప్పుడు ఈ కలసిరావడాన్ని గురించి ప్రార్థించకండి. అప్పుడు మిగతావి ఉన్నా, లేకున్నా కూడా మీరు సుఖపడగలుగుతారు' అంటూ స్వామి ఉపదేశించారు ఒక శుభవేళలో.

పాత పుస్తకాలు కావవి - పాత్ పుస్తకాలు

రామాయణ, భారత భాగవతాది గ్రంథాల వైపుచూస్తూ వాటిసంగతి తెలియని వారు కొందరు 'ఇప్పుడెందుకండీ ఇవన్నీ ఎప్పటివో పాతపుస్తకాలు కదా ! అందరూ ముందుకు పోతుంటే మనం వెనకబడి పోవటానికా ? అన్నట్లు వీటి సంగతి ఇప్పుడెం దుకండీ అయినా ఈ నవీన యుగంలో వీటి అవసరం ఇంకా ఉందంటారా ?' అని అడిగేవారు తారసపడుతూ ఉంటారు అక్కడ

క్కడా అడపాదడపా పాపం. వాళ్ళకు తెలియదు. ఇవి పాత పుస్తకాలు కావనీ, పాత్ పుస్తకాలనీ !

పాత్ పుస్తకాలు- పాత్ అంటే మార్గం. మానవజాతి చిరకాలం సుఖపడడానికి కావలసిన సనాతన ధర్మమార్గం ! అలాంటి మార్గం యొక్క అవశ్యకత మానవజాతి ఉన్నంతవరకూ ఉండనే ఉంటుంది కదా ! అలాంటి దివ్య మార్గాన్ని గూర్చి తెలియజెప్పే దివ్యగ్రంథాలను పాతపుస్తకాలని అనవచ్చా ? అంటే మనకింక పుట్టగతులుంటాయా ? ఇంతమాట అంటున్నానని అనుకోకండీ. పుట్టినందుకు గతులుచూపే దివ్యగ్రంథాలు గదా అవి ! అందుకనే అలా అన్నాను ఏమంటారు. అని స్వామి అంటే, విన్నవారేమంటారు ? నాగస్వరానికి నాగులు తల ఊపినట్లు ఈ నాదస్వరానికి అన్నికాలాల ప్రజలు తలలు ఊపక ఏం చేస్తారు ?

వద్దు అనలేదు హద్దు అన్నారు

ఆధ్యాత్మిక జీవనం అలవరచుకోవడం అనగానే కొందరు లేని పోని ఆంక్షలు పెడుతుంటారు. సినిమాలు వద్దని చెప్పడంతో మొదలు పెట్టి పెళ్ళి చేసుకోవద్దు దాకా ఎన్నెన్ని వద్దులో ఉంటాయి వారి ఆంక్షల్లో.

ఇలాంటి వారందరూ ఒక సూక్ష్మాంశాన్ని గమనించాలి. భారతీయ సంప్రదాయంలో నాటినుండి నేటి వరకు మన పెద్ద

లెవరూ ఇలాంటి ఆంక్షలు పెట్టలేదు. వారు దేనిని వద్దనలేదు. హద్దు అన్నారు. అన్నీ అనుభవించవలసిందే ! అయితే హద్దు లెరిగి అనుభవించాలి. ఆ హద్దుల ఎడల మెరుకగలగాలి అంటే మనలో వివేకం వెలగాలి. వివేకం వెలగాలి అంటే మనస్సు బుద్ధిపైపుకు మొగ్గాలి. ఇంద్రియాలలో చిక్కుబడుతున్న మనస్సు బుద్ధిపైపుకు మొగ్గి, ఆ బుద్ధి సారథ్యంతో ఇంద్రియా లను నడపడం నేర్చుకోవాలి.

అప్పుడు తెలుస్తుంది. ఈ సృష్టిలో అక్కరలేనిదిగానీ, అంటరానివిగాని ఏవీలేవని. అన్నీ ఆ దైవము యొక్క వ్యక్త రూపాలేనని దేని ఆవశ్యకత, దేని వినియోగం దానికి ఉన్నా యని ! ఏ అంశం ఎందుకున్నదో, బుద్ధి వెలుగులో గమనించు కొని, ఆ అంశాన్ని అందుకే వినియోగించుకోగల్గడం మనకు చేత కావాలి. హద్దులెరిగి ప్రవర్తించడం అంటే అదే ! కనుక పెద్ద లైనవారు వద్దు వద్దని ఆంక్షలు పెట్టకుండా సృష్టిలోని ఆయా అంశాల నిజస్వరూపాన్ని సామాన్యులకు తెలియజెప్పి, ఏ దృష్టితో ఆయా అంశాలను, ఎలా వినియోగించుకోవాలో నేర్పడంఅవసరం. ఈ నేర్పడానికి మన పెద్దలు శిక్షణ అని పేరు పెట్టారు. గురువు శిష్యునకిచ్చే శిక్షణ అదే. మన సంప్రదాయాన్ని చిత్తశుద్ధితో తేరిపార చూసినప్పుడు ఈసత్యం మనకు బోధపడుతుంది. అంటూ స్వామి తెలియజెప్పారు ఒకానొక సందర్భంలో.

ఆశ్చర్యాలనుండి ఆచరణకు

'ఫలానాచోట ఒక పెద్దాయన ఉన్నారు. ఒక ఆధ్యాత్మిక వేత్త ఉన్నారు. అని ఎవరైనా చెప్పగానే ఆ ప్రక్కవాళ్ళు వారుకూడా ఏమైనా మహిమలు చేస్తారా ? మీరేమయినా మీకు సంబంధించి అలాంటివేమైనా గమనించారా ? అని అడగడం ఈ నాడొక అలవాటయిపోయింది.

ఆధ్యాత్మికవేత్త అనగానే అతడు మనం ఆశ్చర్యపడే ట్టుగా ఉండాలనుకుంటోంది లోకం. లేని వాటిని సృష్టించడమో లేదా ఉన్నవాటిని మాయం చేయడమో, లేదా అన్నపానాలు లేకుండా అలా నిలబడిపోవడమో, ఇలా ఆయన ఏదో చేయాలి మొత్తంమీద ! లేకపోతే మనకు తృప్తి ఉండదు. ఆయన మన లాగా ఉండే ఆధ్యాత్మికవేత్త ఏమిటి అనిపిస్తుంది. ఏదైనా ఒక స్పెషాలిటీ ఉండాలికదా అని మన మనస్సే మనని ప్రశ్నిస్తూ ఉంటుంది.

విచిత్రమేమిటంటే ఆధ్యాత్మికవేత్త అయినవాడు ఇతరుల కన్నా ఏ విషయంలోకూడా విచిత్రంగా ప్రవర్తించకూడదని శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు. అలా కనబడకుండా ఉండడం సాధనలో ఒక భాగమన్నాడాయన ! అందరిలాగ ఉంటూనే, అందరిమేలూ కోరుతూ, అందరికొరకు పనిచేసేవాడు నిజమైన ఆధ్యాత్మికుడని ఆయన నిర్వచనం. కనుక ఆశ్చర్యాలనుకోరే స్థితినుండి ఆచరణకు విలువనిచ్చేస్థితికి మనం ఎదగవలసి ఉంది.

రామకృష్ణాది అవతార మూర్తులు ఈనాటికి ఆదర్శమూర్తులుగా మనచేత పూజింపబడుతున్నది వారు చేసిన ఆశ్చర్యకర అంశా లను బట్టికాదు. వారు నడిచిచూపిన ఆచరణ పథాన్ని బట్టి.' అంటూ స్వామి చురకవంటి హెచ్చరిక చేశారు ఒకానొక సంద ర్భంలో.

మరల మరల స్మరించండి - మర లా మాత్రం స్మరించకండి

మీకు నచ్చిన దైవనామాన్ని మనసార స్మరించండి. గొంతెత్తి స్మరించండి. మరల మరల స్మరించండి 'మర' లా మాత్రం స్మరించకండి !

'మర'లా అంటున్నారేమిటి ? అనుకోకండి. ఇటీవలి కాలంలో మనలో ఎక్కువ మందిమి మరలాగానే స్మరిస్తున్నాం. దైవనామాన్ని అంటున్నవారిలో, ఆ అంటున్న క్షణాలలో ఆ నామాన్ని వింటున్న వారెందరు ? వినకుండా అంటున్నప్పుడు మనకూ, టేప్‌రికార్డరుకు తేడా ఏమిటి ? ఆ టేప్‌రికార్డర్ మన కన్నా స్పష్టంగా అంటోంది కదా !

ఒక మంత్రాన్నిగాని, ఒక నామాన్నిగాని గొంతెత్తి అంటూ, ఆ అంటున్న క్షణాలలో మనసారవింటూ ఉండాలి. అనడం ఎంత అవసరమో, వినడం అంతే అవసరం. వింటున్న ప్పుడు ఏం జరుగుతున్నది ? వినటానికి మన మనస్సుకూడా అక్కడకు చేరుకుంటున్నది. మనస్సునకు ఆ నామస్పర్శ అంటు తున్నది. అటుపైన మనస్సే ఆ నామమై వెలుగొందుతున్నది. అందువల్లనే మన పెద్దలు వేద విద్యను ఉద్గీథ విద్య అన్నారు.

గొంతెత్తి గానం చేయమన్నారు. మనసారా పానం చేయమన్నారు. ఆ గానం, ఈ పానం కలుస్తే ధ్యానం అవుతుందన్నారు. అలాగే ఆ ధ్యానం నిలుస్తే సమాధి సిద్ధిస్తుంది అన్నారు. నీ వెవరవు అన్నదానికి నీకప్పుడు సమాధానం దొరుకుతుంది అన్నారు.

చూశారా ! సోదరులారా ! నామస్మరణ వైభవం ఎలాంటిదో ? నామస్మరణ వైభవమెలాంటిదో ? అంటూ స్వామి మరల మరల స్మరించుకునేలా నామస్మరణ స్వరూపాన్ని ఉపదేశించారు సోదర బృందాన్ని ఉద్దేశించి ప్రవచనమిస్తూ ఒకసారి.

రాజయోగమా ? రాజీయోగమా ?

'ఆ మధ్య ఒకతను నా దగ్గరకు వచ్చాడు. తన స్థితిగతులన్నీ చెప్పాడు. అక్కడికీ ప్రతిదానిలోనూ ఎడ్జెస్ట్ అయిపోతున్నానండీ. మనం ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నాం కదా ! అని అలా సరిపెట్టుకుంటున్నాను. అయినా సరే పరిస్థితులు మాత్రం ఇంకా దారికి వస్తున్నట్లు కనబడడం లేదు, అని చెప్పాడు.

అప్పుడు నేను చెప్పాను. 'ఆధ్యాత్మికత అన్నదానికి నీప్పు ఇప్పటి అర్థం చెప్పావయ్యా ! నిజమే ! నీవన్నట్టు ఎడ్జెస్ట్ అయిపోవడమే ఆధ్యాత్మికత అనుకుంటున్నారు ఇటీవలకాలంలో కొంతమంది, కానీ ఎడ్జెస్ట్ అవటం మనలో ఉన్న మంచితనాన్ని తెలియజేస్తుంది. ఆ మంచితనంలో కొంత మెతకదనం ఉందనికూడా తెలియచేస్తుంది. మెతకదనం లేని మంచివాడు ఎడ్జెస్ట్‌మెంట్ అనే స్థితినుండి ఎరేంజ్ మెంట్ అనే స్థితికి ఎదుగుతాడు. సరిపెట్టుకోవడం అనేస్థితినుండి సరిదిద్దుకోవడం అనే స్థితికి ఎదుగుతాడు: చూశావా.! గమనించావా? సరిపెట్టుకోవడానికీ సరిదిద్దుకోవడానికీ ఎంత తేడా ఉందో ఒక్కసారి ఆలోచించు అని.

చూశారా ! నేటి సగటు భారతీయుని మనస్తత్వాన్ని తెలియజెప్పడానికే ఈ ఉదాహరణ చెప్పాను మీకు. ఎడ్జెస్ట్మెంట్ మనస్తత్వం ఒక సద్గుణంగా, ఒక ఆధ్యాత్మికతగా చెలామణి అవుతోందీనాడు. మనిషి అడుగడుగునా రాజీపడిపోతున్నాడు. తెల్లవారి లేస్తే పాలదగ్గరనుండి దేశపాలనవరకు అతను సరిపెట్టుకోవడానికి అలవాటు పడితే మనస్థితిగతులుగానీ దేశస్థితిగతులుగాని మరి ఇక ఎలా మారుతాయి ? దేశంలో మార్పులేదు. అభివృద్ధిరావడం లేదు అంటున్నామేగాని, మనమిలా ఉంటే అవి ఎలా వస్తాయి ?

మన పూర్వులు మనకు రాజయోగం నేర్పారు. మనమిప్పుడు రాజీయోగం నేర్చుకుంటున్నాం. ప్రస్తుత భారత దేశ రోగమే ఇలా మారిపోయింది. మనం నిద్రలేవాలి. ఎట్టి పరిస్థితులలోనూ మనం రాజీపడకూడదు. అలా అని ఘర్షణా పడవలసిన అవసరంలేదు. జీవిత సన్నివేశాలలో ఇటు రాజీపడకుండా, అటు ఘర్షణ పడకుండా ముందుకు సాగిపోయిన శ్రీరామచంద్రుడు మనకు ఆదర్శంకావాలి. ఈ దృష్టితో ఒక్కసారి రామాయణం చదివి చూడండి.' అంటూ స్వామి చేరవచ్చిన సోదరబృందాన్ని ప్రబోధించారు ఒకసారి.

ఉపరి ప్రశ్నల నుండి పరి ప్రశ్నానికి

పరిప్రశ్నము అంటే ఏమిటి ? అని చాలా మందికి అనుమానం వస్తూ ఉంటుంది. ప్రశ్నలు రెండు రకాలు. ఉపరి ప్రశ్నలూ, పరిప్రశ్నలూ అని. మనం రైల్లో వెళుతున్నామనుకోండి. మన ఎదురుగా ఉన్న సీట్లో ఎవరో కూర్చొని ఉంటారు. వాళ్ళు సుముఖంగా ఉండటం చూసుకొని మీ పేరేమిటండీ ?

మీ ఊరేమిటండి? ఎక్కడికి ప్రయాణం ? ఏం చేస్తుంటారు ? ఇలా రకరకాల ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబడుతూ కాలక్షేపం చేస్తూ ఉంటాం. అలాగే మీకు పెళ్లైందా ? పిల్లలెందరు ? ఏం చేస్తున్నారు. మొదలైన ప్రశ్నలన్నీ కూడా ఇలాంటివే. ఇలాంటి వాటినన్నిటినీ కలిపి ఉపరి ప్రశ్నలు అనవచ్చు. పైపై ప్రశ్న లన్న మాట ! వాటివల్ల మనకేమయినా తెలిసిందా అంటే తెలి సింది. తెలియలేదా అంటే తెలియలేదు.

అలాకాక ఆ కూర్చున్న వ్యక్తి యొక్క నిజ స్వరూపాన్ని చూడగలిగేటంత వరకు మనం ప్రశ్నించుకుంటూ వెళ్ళగలిగితే, అది పరిప్రశ్న మవుతుంది. అతనిపేరు అతనుకాదు. అతనికులం అతనుకాదు. అతని వయస్సు అతను కాదు. అతనిదేహం అతను కాదు. మరి ఎవరతను ? ఇంతకూ ఎలా ఉంటాడతను, ఆ నిజ మైన అతను మన మనస్సుకు పొడగట్టేంత వరకూ మనం వేసు కుంటూ వెళ్ళే ప్రశ్నే పరిప్రశ్న.

సాధారణంగా మనం మనిషి చుట్టూవున్న అంశాలను చూస్తాం. అవే మనిషనుకుంటాం. అలా అనుకుంటూనే కాపురాలు కూడా చేసేస్తుంటాం. ఆలోచించి చూడండి. ఇంతమంది దగ్గరగా కాపురాలు చేస్తూ బ్రతుకుతున్నారు కదా ! ఇందులో ఒకరి నిజ స్వరూపాన్ని ఇంకొకరు గుర్తించ గలిగే దంపతులు ఎంతమంది ఉంటారంటారు! ఒకరికొకరు పూర్తిగా తెలియకుండానే కాపురాలు గడచిపోతున్నాయి. ఆశ్చర్యంగా లేదూ ! ఒకరికొకరు తెలిసి కాపురమే సాగితే అది అర్ధనారీశ్వరత్వమవుతుంది. అద్వైతాను భూతి అప్పుడు సిద్ధిస్తుంది. అలాంటి స్థితి అనుభవానికి వచ్చే వరకు ప్రశ్నించుకుంటూ సాగడమే పరిప్రశ్న. చూశారా ! ఉపరి ప్రశ్నలకు, పరిప్రశ్నలకూ ఎంత తేడా ఉందో ! తెల్లవారి

లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ ఊపరి ప్రశ్నలతో పై పైన బ్రతుకుతూ రోజులు గడిపేస్తున్నాం. అలా గడిపేసిన వారికి సుఖసంతోషాలేం దొరుకుతాయి ? వాటిని ఆశిస్తూ అవి అందడం లేదని నిరసిస్తూ, తోటివారు కారణమని వారినినిందిస్తూ, పొద్దుపెళ్ళబుచ్చుకుంటున్నాం. అలాకాక పరిప్రశ్న మనేది అల వాటుచేసుకొని మనయొక్క, మన చుట్టూ ఉన్నవారి యొక్క నిజస్వరూపాన్ని దర్శిస్తూ, కర్తవ్య నిర్వహణ ద్వారా ఆ నిజ స్వరూపాన్ని సేవించగలిగిననాడు అనుభవానికొచ్చేవే నిజమైన సుఖ సంతోషాలు ! ఊపరి ప్రశ్నలతో కాలం గడుపుతున్నప్పుడు మనం టైం పాస్ చేస్తున్నాం. పరిప్రశ్నలతో మనం ముందుకు సాగుతున్నప్పుడు టైం మనలను పాస్ చేస్తోంది. అంటే ఊత్తీర్ణతను అనుగ్రహిస్తుంది. కనుక ఉత్తనే గడిపే స్థితినుండి ఉత్తీర్ణతను అనుభవించగలిగే స్థితికి మనం ప్రయాణం చేయవలసి ఉంది. ఆ ప్రయాణానికి సాధనమే పరిప్రశ్నము అంటూ స్వామి సాధన యొక్క లోతులలోనికి వెళ్ళి అమృతప్రాయమైన సందేశ మిచ్చారు ఒకసారి.

భక్తి ఒక మార్గంకాదు - అది మన గమ్యం

ఒక గురువుగారికి ఒక శిష్యుడు పాదాలపై సాష్టాంగ పడుతూ 'ప్రణిపాతం చెందుతున్నాను' అన్నాడు. అలా అతను చాలాసార్లు పడుతూ లేస్తూ ఉంటాడు. ప్రణిపాతం అంటే అలా పడిపోవడం అనుకుంటున్నాడతడు. సాష్టాంగ నమస్కారమనేది అత్యుత్తమమైన సంప్రదాయమే ! ప్రణిపాతానికి సంకేతమే ! అయితే, అది ఏమిటో ఎందుకో తెలిసి ఆచరించాలి. లేదా సంపూర్ణమైన సమర్పణ భావం మనలో నిండినపుడు, మనకు

తెలియకుండానే మనసుండి వ్యక్తమైనదైనా అయిఉండాలి. నిజానికి ఈ ముద్రలన్నీ అనుభూతి చెందుతున్న మానవులనుండి అప్రయత్నంగా వ్యక్తమైనవే మొదట. అలా అప్రయత్నంగా వ్యక్తమవుతున్న ముద్రలను గ్రహించి, పెద్దలైనవారు సంప్రదాయకంగా రూపొందించి ఇస్తూవచ్చారు.

ఇంతకూ ప్రణిపాతమంటే ఏమిటి ? మెదడును ఆటపట్టుగా కలిగిన మనస్సు, హృదయస్థుడైన ఈశ్వరునికి శరణాగతి చెందడం. మనస్సు, నరప్రజ్ఞ అయితే, హృదయస్థుడైన ఈశ్వరుడు నారాయణ ప్రజ్ఞ అవుతాడు. ఈ నరుడు ఆ నారాయణుని శరణాగతి చెందడమే ప్రణిపాతమంటే. మనస్సు శిష్యుడైతే హృదయస్థుడైన ఈశ్వరుడు గురువవుతాడు. ఈ శిష్యుడు ఆ గురువునకు శరణాగతి చెందడమే ప్రణిపాత మనబడుతుంది.

ఎవరికి వారికి సాధన ప్రారంభమైన తొలినాళ్ళలో తమ లోని హృదయస్థుడైన ఈశ్వరుడు గోచరించడం అంత సులభం కాదు కనుక, లోకమున అప్పటికే మనస్సులు హృదయాన కరిగి స్థితప్రజ్ఞులై ఈశ్వర స్వరూపులై లోకహితార్థం మానవులుగా చరిస్తున్న మహనీయులకు శరణాగతి చెందటమనేది మార్గంగా పెద్దలు నిర్దేశించారు. ఈ నిర్దేశమే గురుశిష్య సంప్రదాయమై యుగముల తరబడి వర్ధిల్లుతూ వస్తున్నది.

హృదయస్థుడైన ఈశ్వరుని గురురూపమున దర్శించటంతో మొదలుపెట్టిన సాధకుడు, క్రమంగా సకల జీవరాసుల హృదయములనుండి వ్యక్తమవుతున్న ఆ సర్వేశ్వరుడికి, సర్వము నందున్న ఈశ్వరునికి, సర్వమునకు ఈశ్వరుడైన వానికి శరణాగతి చెందటం అభ్యాసం చేయాలి. గురువునకు శరణాగతి చెందటం అనేది ఒక ప్రారంభం. సకల జీవరాసుల స్వరూపంలో ఉన్న దైవానికి శరణాగతి చెందడానికి నాంది పలకటమే గురువునకు శరణాగతి చెందడం. గురువుతో ప్రారంభించి, జగత్తంతా ఆ గురుస్వరూపాన్నే దర్శించి, జగద్గురువుగా అతనిని

దర్శించగలగాలి. అలాంటి దర్శనం కొనసాగుతూ ఉండగా, ఆదర్శిస్తున్న వానిలోని మనస్సు క్రమంగా అతని హృదయ స్థానాన్ని చేరి, హృదయస్థుడైన ఈశ్వరునిలో కరిగిపోతుంది అప్పుడు తనయందు నిఖిల భూతముల యందు ఉన్నది ఆ ఒక్కడే అని అనుభవానికి అందుతుంది.

సర్వజీవరాసుల హృదయాంతర్వర్తియైన ఈశ్వరుని విశ్వసించి మనసా, వాచా, కర్మణా, అతనికిశరణాగతిచెందాలి. నామరూపాది వైభవాలలో విలసిల్లుతున్న అతని నిజస్వరూపం పొడగట్టేవరకూ పరి ప్రశ్నం వేసుకుంటూ ముందుకుసాగాలి. పరి ప్రశ్నం వల్ల అతని స్వరూపం పొడగడుతుంది. పొడగట్టిన ఆ దివ్య స్వరూపం అనుభవానికి రావాలంటే ఏం చేయాలో తెలుసునా ?మన స్వధర్మాన్ని, అతనికి సమర్పణగా, అతని ఎడల సేవగా, నిర్వహించడంలో శ్రద్ధ చూపాలి. అనగా జీవరాసుల రూపంగా ఉన్న అతణ్ణి మన స్వధర్మంతో అర్చించాలి. అప్పుడతను ముగ్ధుడై మనలను స్వీకరిస్తాడు. మనమే అతడని, అతడే మనమని తెలియగలిగే ఎరుకనిస్తాడు. ఆ ఎరుకనే, తెలిసిన పెద్దలు జ్ఞానమంటున్నారు. జ్ఞానమంటే తెలియడం. ఏమని తెలియడం? అతడే మనమని తెలియడం. ఆ తెలిసిన క్షణంలో మనస్సు అతడితో కరిగిన క్షణంలో అనుభవానికొచ్చేస్థితినే భక్తి అంటారు. భక్తంటేఏమిటి? కలియడం, కరగడంవల్లభక్తి అంటారు అంటేఏమిటి? ఒకరంగు మరొక రంగుతోకలియడంకాదా ! కనుక తెలియడం జ్ఞానం, కలియడం, భక్తి ఈ రెండింటికి కావలసిన సాధనం స్వధర్మ ఆచరణ అనే సత్కర్మస్వరూపం. స్వధర్మాన్ని సత్కర్మగా, సేవగా ఆచరిస్తున్న కొద్దీ అతడి నిజస్వరూపం తెలియడం ప్రారంభమౌతుంది. తెలియడం ప్రారంభించినకొద్దీ స్వధర్మం మరింత సత్కర్మగా రూపొందుతుంది. ఇలా కర్మ జ్ఞానములు ఒకదాని వలన ఒకటి ఊతం అందుకుంటూ సాగు

తుండగా ఏదో ఒక క్షణంలో మనస్సు అతనిలో కరగడంప్రారంభ మౌతుంది. ఆ కరిగేస్థితే భక్తి. అదే మానవజీవితానికి గమ్యం. కనుక భక్తిమార్గంకాదు. గమ్యం. తెలియక మనం దానినికూడా ఒకమార్గమంటాం. అదిగమ్యం. అది రమ్యం,పరమప్రేమ అను భవానికొచ్చే శుభసమయమది. కృష్ణుని యందు గోపికలు అను భవించినదదే కనుకనే నారదుడు తన భక్తి సూత్రాలలో భక్తి అంటే పరమప్రేమ అనీ, గోపికలు అనుభవించిన దివ్యస్థితి దానికి ఉదాహరణమనీ చెప్పాడు. ఇప్పుడొకసారి చూడండి. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా అన్న భగవద్గీతా వాక్యానికి ఇంతవరకు నేను చెప్పిన వివరణ బోధపడిందనుకుంటాను ? సర్వజీవరాసుల రూపంలో రూపములలోనున్న సర్వేశ్వరుని విశ్వసించి శరణాగతి చెందండి. ప్రణిపాతేన' అంటే అది అతడి యొక్క నిజస్వరూపం పొడగట్టేవరకూ ప్రశ్నించుకుంటూ సాగండి. పరిప్రశ్నేన అంటే అది! పొడగట్టిన ఆత్మస్వరూపాన్ని మీస్వధర్మ నిర్వహణనే సేవగా మలచి ఆరాధించండి 'సేవయా అంటే అది. అప్పుడతడు ముచ్చటపడతాడు మనలను స్వీకరిస్తాడు మన మనస్సు అతడిలో కరుగుతూ దివ్యానుభూతి పొందుతుండగా ఈ జన్మకర్మలు నవ్యములై, దివ్యములై సార్థకత చెందుతాయి. భక్తి లేక ముక్తి అంటే అది.

అంటూ స్వామి వివరిస్తున్న వేళలో ఆ వింటున్న వారికి ఆ స్థితి అక్కడికక్కడే అనుభవానికి వస్తున్నది. దేశకాలాల స్పృహ వారినుండి జారిపోతున్నది. వారి మనస్సు హృదయస్థుని చేరిపోతున్నది. భగవద్గీతలో ఇలా కృష్ణుడు చెబుతూ ఉండగానే అలా అర్జునుడు ఆ స్థితిని పొందుతూ ఉంటాడు. అలా పొందాడు కనుకనే గీతా బోధఅయ్యేటప్పటికి లేచి నిలబడ్డాడు. సరిగా అలాంటి స్థితి అనుభవానికి వస్తున్నది.

— o —